ఎర్రబావుటా నిగనిగలు
సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభల ప్రత్యేకం
వివరాలు 16లో

అనుదినం... జనస్వరం
www.navatelangana.com

# నవతెలంగాణ

గురువారం 27-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 85 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50




# కమీషన్ రగడ

## 30 శాతం పర్సంటేజ్‌ల సర్కార్ : కేటీఆర్



ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి : భట్టి

కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నాం : ప్యానల్ స్పీకర్ రేవూరి



- కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సభ్యుల పట్టు
- భట్టి సారీ చెప్పాలని స్పీకర్ పోడియం వద్దకెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- సభ్యులు నిల్చుంటే మైకు ఇవ్వబోనని తేల్చిచెప్పిన రేవూరి
- సర్కార్ డౌన్..డౌన్ అంటూ వెళ్లిపోయిన బీఆర్ఎస్ సభ్యులు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

'కమీషన్ సర్కార్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ చేసిన వ్యాఖ్య శాసనసభలో పెద్ద దుమారాన్నే లేపింది. 'మైకు చేతిలో ఉందికదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లా డొద్దు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి. ఆధారాలతో చూపించు.. లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పు' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావోద్వేగ హెచ్చరికతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సవాళ్లు.. ప్రతిసవాళ్లు... ఆరోపణలు.. ప్రత్యారోపణలు... క్షమాపణల డిమాండ్లు.. ఇటు కాంగ్రెస్..అటు బీఆర్ఎస్ సభ్యుల పోటాపోటీ నినాదాలు తీవ్ర ఉద్రికత్తలకు దారితీసింది. భట్టి క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద దూసుకెళ్లారు. అక్కడ ముందుకెళ్లకుండా మార్షల్స్ అడ్డుగోడగా నిలబడ్డారు. కూర్చుంటేనే మైకు ఇస్తానని ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేయడంతో '30 శాతం కమీషన్ సర్కార్ డౌన్..డౌన్..30 శాతం కమీషన్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేసుకుంటూ బయటకు వెళ్లి పోయారు. అనంతరం అసెంబ్లీలోకి ప్రవేశించే ద్వారం వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు.

### రూ.4 కోట్లు ఇచ్చి... రూ.40 కోట్ల ప్రకటనలతో ప్రచారం : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

శాసనసభలో ఐఅండ్‌పీఆర్ శాఖ పద్దులపై చర్చల్లో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ...సంఘాలను చూసి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలనుకోవడం దుర్మార్గమన్నారు. చాలా మంది సీనియర్లు యాజమాన్యాలు నచ్చక సొంతంగా వెబ్‌సైట్లు పెట్టుకుని నడిపించు కుంటున్నారని తెలిపారు. జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలంపై సుప్రీం కోర్టులో సీనియర్ లాయర్లతో కేసీఆర్ కేసు వాదింప జేశారనీ, ఆ భూమి కబ్జాకు గురికాకుండా కేటీఆర్ రక్షించారని కొనియాడారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం కింద రూ.4 కోట్లు ఇచ్చి మీడియాలో ప్రకటనల ద్వారా ప్రచారానికి రూ.40 కోట్లు ఖర్చుపెట్టారని ఆరోపించారు. హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికలకు మనకు ఏం సంబంధమని యాడ్‌లు ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 15 నెలల్లో 15 ఇటుకలైనా పేర్చారా? అని ప్రశ్నించారు.

### చర్చకు సిద్ధమేనా... సత్యదూరపు మాటలు సరిగాదు : పొంగులేటి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పదేండ్లలో ఐఅండ్ పీఆర్ శాఖను సొంత ఆస్తిలాగా బీఆర్ఎస్ సర్కారు వాడుకున్నదని విమర్శించారు. వేరే రాష్ట్రాల్లోనూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని ఎత్తిచూపారు. పింక్‌కలర్ మీడియా ఛానళ్లకు, పత్రికలకు ఇచ్చిన ప్రకటనల ఖర్చు ఎంత? మిగతా పత్రికలకు ఇచ్చినదెంత? అనే దానిపై చర్చ పెట్టడానికి తాము సిద్ధమని ప్రకటించారు. జాతీయ పార్టీ అని చెప్పుకుని మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సర్కారు తరపున ...15లో

# ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సిట్

## వ్యసనాలకు తెలంగాణలో తావులేదు

శాంతి భద్రతలు బాగుంటేనే పెట్టుబడులు

ఉప ఎన్నికలు వస్తాయనేది పచ్చి అబద్ధం

ప్రతిపక్షాలు సామాజిక బాధ్యతతో మాట్లాడాలి

చేసేదే చెబుతాం.. చెప్పిందే చేస్తాం : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆన్‌లైన్‌యాప్‌లు, రమ్మీ బెట్టింగులు, డిజిటల్ బెట్టింగ్ గేమ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా శాంతిభద్రతలపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు ఆయన సమాధానమిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం కల్పించేవారిని విచారించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదన్నారు. పక్క రాష్ట్రాలు, పక్క దేశాల్లో కూడా విచారణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (సిట్)ను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరైనా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినా, నిర్వహణలో భాగస్వాములైనా వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే చట్ట సవరణ చేసి శిక్షను పెంచుతామని హెచ్చరించారు. వ్యసనాలకు తెలంగాణలో తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని కొందరు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ చిన్న సంఘటన జరిగినా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నడిబజారులో న్యాయవాద దంపతులను నరికి చంపితే ఆనాటి ప్రభుత్వం స్పందించలేదని గుర్తు చేశారు. ఆనాటి వెటర్నరీ డాక్టర్ లైంగిక దాడి ఘటన విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. మహిళలపై జరిగిన లైంగిక దాడుల్లో 2020లో దేశంలోనే రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. బాధితులపై ...3లో





# రణరంగంగా రామోజీ ఫిల్మ్ సిటీ

## సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గేటును బద్దలుకొట్టిన పేదలు

- అడ్డగించిన పోలీసులు, లాఠీచార్జి, అరెస్టులు
- దమ్ముంటే రామోజీ యాజమాన్యాన్ని ప్రభుత్వం అరెస్టు చేయాలి
- కబ్జా చేసిన భూములను అప్పగించాలి
- అక్రమంగా ఆక్రమించిన 360 ఎకరాల్లో ఎర్రజెండాలు పాతుతాం
- 10 వేల మందితో ఫిల్మ్ సిటీని దిగ్బంధిస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- ఇండ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టీకరణ

**నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి**

'ప్రభుత్వానికి, పోలీసులకు దమ్ముంటే ప్రభుత్వ భూమిని కబ్జాపెట్టిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై కేసులు పెట్టాలి. పేదలకు కేటాయించిన భూముల్లోకి వెళ్లకుండా అడ్డంగా గేట్లు పెట్టి, రోడ్డు నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. అక్రమంగా కబ్జా పెట్టిన 360 ఎకరాల్లో ఎర్రజెండాలు పాతుతాం. 10వేల మందితో ఫిల్మ్ సిటీని ముట్టడిస్తాం. పేదల భూముల్లో గుడిసెలు వేసి తీరుతాం. పేదలకు భూములు దక్కే వరకూ పోరాటం ఆగదు' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పొల్కంపల్లి, నాగన్‌పల్లి గ్రామాల ప్రజలకు భూములు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇండ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రామోజీ ఫిల్మ్ సిటీ కార్యక్రమంలో జాన్‌వెస్లీ, జిల్లా పార్టీ కార్యదర్శి యాదయ్య, జిల్లా నాయకులు, పేదలు పాల్గొన్నారు. ప్రభుత్వం తమకు కేటాయించిన భూముల్లో గుడిసెలు వేసుకుంటామని, తమ భూములు తమకే కావాలని ఎర్రజెండా చేతపట్టి పేదలు బుధవారం రామోజీ ఫిల్మ్ సిటీకి తరలివచ్చారు. అడ్డంగా పెట్టిన గేట్లు బద్దలు కొట్టి తమ ఇండ్ల జాగాలకు వెళ్లారు. వీరిని ...15లో




# అప్రజాస్వామ్యం


## స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదు



- మాట్లాడేందుకు అవకాశమివ్వటం లేదు
- ఎలాంటి ఆధారాలూ లేకుండా నాపై అసత్యాలు : లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా తీరుపై రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదనీ, ఇది అప్రజా స్వామికమని వ్యాఖ్యానించారు. సభలో ఏం జరుగుతుందో తనకు అర్థం కావడంలేదనీ, ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని అన్నారు. బుధవారం సరైన కారణం లేకుండా స్పీకర్ సభను వాయిదా వేశారని విమర్శించారు. తాను మాట్లాడేం దుకు ఎప్పుడు లేచి నిలబడ్డా స్పీకర్ మాట్లాడనివ్వడం లేదని అన్నారు. కనీసం మాట్లాడనివ్వకపోతే తమ వాయిస్‌ను ఎలా వినిపించాలని ఆయన ప్రశ్నించారు. తనను ఒక్క ముక్క కూడా మాట్లాడనివ్వలేదని అన్నారు. గడిచిన ఏడెనిమిది రోజులుగా స్పీకర్ తన విషయంలో ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రభుత్వ కొత్త వ్యూహమనీ, సభలో ప్రతిపక్షాలకు చోటులేదని ఆరోపించారు. ఇటీవల లోక్‌సభలో ప్రధాని మోడీ కుంభమేళాపై ప్రసంగం ...15లో



# ఆ వ్యాఖ్యలు అమానుషం

## సున్నితత్వం లోపించింది

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే మంజూరు చేస్తూ ఆదేశాలు

కేంద్రానికి, యూపీ సర్కారుకు నోటీసులు

**న్యూఢిల్లీ :** బాలిక వక్షోజాలను పట్టుకోవడం, ఆమె పైజమా దారాన్ని తెంచి దుస్తులను కిందికి లాగడం లైంగికదాడి యత్నంగా పరిగణించలేమంటూ అలహాబాద్ హైకోర్టు ఈ నెల 17న ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వులపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ రాం మనోహర్ నారాయణ్ మిశ్రా నేతృత్వంలోని హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ చేసిన వ్యాఖ్యల్లో సున్నితత్వం పూర్తిగా లోపించిందని, అవి అమానుషంగా ఉన్నాయని తెలిపింది. ఇద్దరు నిందితుల చేతిలో మైనర్ బాలికకు గాయమైం దన్న విషయాన్ని హైకోర్టు ఉత్తర్వులలోని కొన్ని పేరాలు స్పష్టం చేస్తున్నాయని, కానీ ఆమెపై అత్యాచారం చేయాలన్న ఉద్దేశం వారికి లేదని న్యాయమూర్తి నిర్ధారణకు వచ్చారని, ఇది పూర్తిగా సున్నితత్వం లోపించడమే అవుతుందని జస్టిస్ గవాయ్ వేలెత్తి చూపారు. పైగా న్యాయమూర్తి తన ఆదేశాలను వెంటనే ఇవ్వకపోవడం దారుణమని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఈ కేసును గత సంవత్సరం నవంబరులో ఉత్తర్వుల కోసం రిజర్వ్ చేశారు. ఈ మార్చి 17న ఉత్తర్వులు ఇచ్చారు. అంటే రిజర్వ్ చేసిన దాదాపు నాలుగు నెలల తర్వాత ఉత్తర్వులు జరీ చేశారు. కేసులోని వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించానని జస్టిస్ మిశ్రా అంటున్నారు. అయినప్పటికీ ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చారు' అని వ్యాఖ్యానించింది. కాగా ఈ కేసు విషయంలో అటార్నీ జనరల్ ఆర్. వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ ...15లో



# ఉగాది నుంచి సన్నబియ్యం

## ఏప్రిల్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ

'కాళేశ్వరం' బాధ్యులపై చర్యలు : అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెల్ల రేషన్ కార్డు దారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 89.1 లక్షల రేషన్ కార్డులకు ఏటా 24లక్షల మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అదిస్తున్నామని చెప్పారు. అయితే ఆ బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ 6 కిలోల ...5లో



భద్రాచలంలో

# ఘోర ప్రమాదం

## కుప్పకూలిన నిర్మాణంలోని ఆరంతస్తుల భవనం

శిథిలాల కింద చిక్కుకున్న కూలీలు

స్పష్టత రాని క్షతగ్రాతుల సంఖ్య, కుటుంబసభ్యుల ఆర్తనాదాలు

పరారీలో భవన యజమాని

ట్రస్ట్ పేరుతో అక్రమ నిర్మాణం

గతంలోనే ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

కొనసాగుతున్న సహాయక చర్యలు

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రస్టుల పేరుతో చట్టాలను చుట్టాలుగా మలుచుకొని నాసిరకంగా అక్రమంగా నిర్మిస్తున్న భవనంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించిన ఫలితంగా పొట్టకూటి కోసం వచ్చిన ...6లో

# చేయూతకు గండి

## 15 నెలల పాలనలో.. 2,16,804 పింఛన్లు రద్దు

పింఛన్ కోసం 24.85 లక్షల మంది ఎదురుచూపు

గతేడాది బడ్జెట్‌లో రూ.4114 కోట్ల నిధులు ల్యాప్స్

"కొండ నాల్కకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుంది" సర్కార్ పని తీరు. అధికారంలోకి రాగానే అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని, పింఛన్ డబ్బుల్ని పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 15 నెలల పాలనలోనే 2.16 లక్షల మంది ఆసరా పింఛన్లు రద్దయ్యాయి. కేటాయించిన బడ్జెట్‌లోనూ రూ.4 వేల కోట్లు ఖర్చు చేయకుండా ల్యాప్స్ అయ్యాయి. పింఛన్ల కోసం దరఖాస్తు చేసిన లక్షలాది మంది సర్కార్ చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో పింఛన్ల కోసం దరఖాస్తుల్ని స్వీకరించిన ప్రభుత్వం అర్హులైన లబ్దిదారుల్ని గుర్తించేందుకు సర్వే కూడా చేయించింది. అయినా ఇంత వరకు ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్ మంజూరు చేయలేదు. 15 నెలల పాలన పూర్తవుతున్నా పింఛన్ డబ్బులు పెంచలేదు. కొత్తవి మంజూరు చేయలేదు. కానీ.. ఉన్న పింఛన్లను మాత్రం రద్దు చేసి కేటాయించిన నిధుల్ని దారి మళ్లించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.




ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేలకు పెరగని పింఛన్

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్రంలో 11 రకాల కేటగిరిల్లో ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. వికలాంగులకు రూ.4016, ఇతరులందరికీ రూ.2016 చొప్పున చెల్లిస్తున్నారు. 2025 మార్చి నెల నాటి గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా 42,51,341 మందికి పింఛన్ అందుతుంది. కేటగిరీల వారీగా చూస్తే.. వృద్ధులు 15,18,021 మంది, వితంతువులు 15,22,550 మంది, వికలాంగులు 4,90,044 మంది, ఒంటరి మహిళలు 1,40,456 మంది, బీడీ కార్మికులు 4,22,425 మంది, కల్లుగీత కార్మికులు 62,635 మంది, చేనేత కార్మికులు 35,623 మంది, ఎయిడ్స్ బాధితులు 34,254 మంది, బోధకాలు బాధితులు 17,403 మంది, డయాలసిస్ ...6లో

### పింఛన్ నిధులు దారి మళ్లింపు

ఆసరా పింఛన్‌దారులకు చెల్లించేందుకు బడ్జెట్‌లో పెట్టిన నిధుల్ని సైతం ప్రభుత్వం మిగిల్చికుని ఇతర అవసరాలకు మళ్లించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పింఛన్ల కోసం రూ.14628.91 కోట్లు కేటాయించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 2025 మార్చి నాటికి కేవలం రూ.10514.32 కోట్లను మాత్రమే పింఛన్ల చెల్లింపు కోసం ఖర్చు చేశారు. ల్యాప్స్ అయిన నిధుల్ని ఇతర పద్దులకు మళ్లించి కోత పెట్టారని పింఛన్‌దారులు మండిపడుతున్నారు.

# గంజాయి లేడీ డాన్ సంగీతా సాహూ అరెస్ట్

ఒడిశాలో పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

రాష్ట్రంలో ఐదు కేసుల్లో నిందితురాలు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

గంజాయి లేడీ డాన్ సంగీతా సాహూను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రం కుర్ధా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన ఆమెపై సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు, ధూల్‌పేట పోలీస్ స్టేషన్లో నాలుగు కేసులున్నాయి. గత రెండేండ్లుగా తప్పించుకు తిరుగుతున్న సాహూను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ ప్రత్యేక పోలీస్ బృందం అరెస్ట్ చేసింది. ఇందుకు సంబంధించి తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మాట్లాడుతూ... "ఇన్‌స్టా గ్రామ్‌లో సినిమా హీరోయిన్‌లా వీడియోలు పోస్టు చేస్తుంది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండడంతో అనేక రాష్ట్రాల వ్యాపారులతో మాట్లాడుతూ వారికి గంజాయిని సరఫరా చేస్తోంది. ధూల్‌పేట్‌లో శీలాబాయ్, నేహబాయ్, ఇష్కాసింగ్ తోపాటు మరి కొంత మందికి గంజాయిని సరఫరా చేసినట్టు పట్టుబడిన నిందితులు ఇచ్చిన వాగ్మూలంతో ఆమెపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. రైలులో గంజాయి రవాణా చేస్తూ 2022లో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది. జైలు నుంచి విడుదల అయిన తర్వాత కూడా అదే దందా కొనసాగిస్తోంది. దాంతో అబ్కారి పోలీసుల ప్రత్యేక బృందం ఒడిశా వెళ్లి స్థానిక పోలీసుల సాయంతో ఆమెను అరెస్టు చేసి రాష్ట్రానికి తీసుకొచ్చింది" అని తెలిపారు. సాహూను అరెస్టు చేసేందుకు ఒడిశాకు వెళ్లిన బృందంలో ఎస్సై సైదులు, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీధర్, కానిస్టేబుళ్లు మహేష్, అరుణ్, మంగలు ఉన్నారు. గంజాయి డాన్‌ను చాకచక్యంగా అరెస్టు చేసి రాష్ట్రానికి తీసుకొచ్చిన టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.



# తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలి

## టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

## టీపీఎస్‌కే, పీఎన్‌ఎం సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం

**నవతెలంగాణ - ముషీరాబాద్**

తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో 11 ఏండ్లుగా కళాకారులకు 'సంక్షేమం' అంటే తెలియని సాంస్కృతిక రంగం-బడ్జెట్ అంశంపై హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీపీఎస్‌కే, పీఎన్‌ఎం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పీఎన్‌ఎం కార్యదర్శి ఎస్.మారన్న అధ్యక్షత వహించారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో ఆట పాట ప్రజలకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇక్కడ పాటలే ముందుండి ప్రజలను నడిపించాయని అన్నారు. 11 ఏండ్లుగా తెలంగాణ కళాకారుల పట్ల పాలకులు నిర్లక్ష్యం చూపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.74 కోట్ల 35 లక్షలు సాంస్కృతిక రంగానికి కేటాయించిందని తెలిపారు. ఇందులో సాంస్కృతిక సారథి కళాకారుల వేతనాలు, సాంస్కృతిక రంగం జీతభత్యాల నిర్వహణ కిందనే రూ.34 కోట్ల 35 లక్షలు పోతాయని, మిగతా రూ.40 కోట్లు ఎవరికి ఖర్చు చేశారో లెక్కలు చెప్తారా ? అని ప్రశ్నించారు. కట్ట నర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఒక మాయ అని విమర్శించారు. వృద్ధాప్య పింఛన్ల కోసం రూ.13కోట్లు కేటాయిస్తే.. ఆరు కోట్ల రూపాయలు ఇచ్చినట్టు గణాంకాలు చూపుతున్నారని, మిగతా ఏడు కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ నాటకరంగం కళాకారులు కె.శాంతారావు మాట్లాడుతూ.. కళాకారులకు గుర్తింపు కార్డులు లేవు, పింఛన్లు లేవు, ఇండ్లు లేవు, బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా గౌరవ వేతనం లేదని తెలిపారు. కళాకారుల జేఏసీ కన్వీనర్ మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ.. తెలంగాణలో పట్టెడన్నం పాత వస్త్రాలు కళాకారులకు.. పదవులు పట్టాభిషేకాలు పాలకులకా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు రాకేష్ రావణ్, తెలంగాణ ప్రజానాట్య మండలి సభ్యులు శ్రీనివాస్, సాంబరాజు, యాదగిరి, పి.కళ్యాణ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్, ఆశన్న, టీపీఎస్‌కే సభ్యులు జి.నరేష్, పి.రాజయ్య, తెలంగాణ సాంస్కృతిక సంఘం డప్పు స్వామి, జానపద వృత్తి కళాకారుల సంఘం కె.భాస్కర్, కళాకారిణి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

# చాంద్‌బీ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉపాధి కూలి పనులకు వెళ్లి వస్తూ మరణించిన చాంద్‌బీ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జహీరాబాద్ నియోజకవర్గం జరాసంగ్ మండలం కుప్పా నగర్ గ్రామానికి చెందిన చాంద్‌బీ ఎండను తట్టుకోలేక మృతి చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు ఎండీఓ రూ.పది వేలు, జిల్లా కలెక్టర్ రూ.50 వేలు తక్షణమే అందించాలని కోరారు. చాందిబీ ఇద్దరు పిల్లలను ప్రభుత్వం ఉచితంగా చదివించాలనీ, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో తాగు నీరు, నీడ కోసం టెంట్, దూర ప్రాంతాల నుంచి రావడానికి ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

**ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి**

ప్రభుత్వం పేదలకిచ్చిన ఇండ్ల స్థలాల భూములను ఆక్రమించిన రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని మరో ప్రకటనలో నాగయ్య, వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్‌తో ఆస్ట్రేలియా ఎంపీల బృందం భేటీ...

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



ప్రీమియర్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా పీటర్ మాలినాస్కస్ ఎంపీల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బుధవారం భేటీ అయింది. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆస్ట్రేలియా హై కమిషనర్ టు ఇండియా ఫిలిప్ గ్రీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వంతో సిస్కో, టాస్క్ ఎంఓయూ...**

స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనందించేందుకు వీలుగా సిస్కో, టాస్క్ అనే సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా సిస్కో బృందం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు శాతావాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డితో బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష

## కాళేశ్వరం తప్పిదాలకు హరీశ్, కేసీఆర్ కూడా బాధ్యులే

## బీజేపీ సభ్యులు పాల్వాయి హరీష్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష చూపిస్తోందని బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శాసనసభలో జరిగిన వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం తదితర ప్రాజెక్టుల కేటాయింపులకు ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టుల కేటాయింపులను పరిశీలిస్తే తేడా స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. గత సర్కార్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ఈ శతాబ్దపు చారిత్రక తప్పిదమని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం తప్పిదాలకు అధికారులతో పాటు అప్పటి మంత్రి హరీశ్‌రావు, కేసీఆర్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బడ్జెట్ అంచనాలకు, వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని అన్నారు. రూ.16లక్షల జీఎస్‌డీపీ ఉన్న తెలంగాణ రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందనీ, అయితే రూ.36 లక్షల జీఎస్‌డీపీ ఉన్న తమిళనాడు 4.6 లక్షల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ప్రతి ఏటా సర్కార్ ప్రతిపాదించిన బడ్జెట్లో 20 శాతం నిధులను ఖర్చు చేయడం లేదని అన్నారు. గత సర్కార్ దారిలోనే కాంగ్రెస్ అప్పులు చేస్తోందని ఆరోపించారు. ఇది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి విఘాతమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు పీఎం సోలార్ పథకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో బెట్టింగ్, ఆన్‌లైన్ ముఠాల వలలో చిక్కి 15 నెలల్లో 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ధరణి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్, హెల్త్ కార్డులు అందించాలని కోరారు.

# మా పోరాటానికి మద్దతివ్వండి

## సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసిన హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ బృందం

**యూనివర్సిటీ భూముల రక్షణకు మా పార్టీ సంపూర్ణ మద్దతు**

**అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాం : జాన్‌వెస్లీ హామీ**

**ఇదివరకే ఈ భూముల విషయంలో సీఎంకి లేఖ రాసినట్టు వెల్లడి**



**నవతెలంగాణ-మియాపూర్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు తాము చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ బృందం కలిసింది. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో జాన్‌వెస్లీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు, భూముల వేలానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భూములు వేలం వేస్తే జరిగే నష్టంపై విద్యార్థులు జాన్‌వెస్లీకి విన్నవించారు. తమ పోరాటానికి సీపీఐ(ఎం) అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. యూనివర్సిటీకి చెందిన కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్నా ఇప్పటికీ ఆ భూములను యూనివర్సిటీకి చెందినవిగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్స్ చేయించలేదన్నారు. వారికి చెందిన భూములను వారికే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం భారత్ స్పోర్ట్స్ సంస్థకు కేటాయించిన ఈ 400 ఎకరాలు అనంతరం అధికారంలోకి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. కానీ నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ విక్రయించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో విక్రయాలు చేయడం లేదని అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన చేసినా.. అక్కడ విక్రయించాలనుకుంటున్న భూములకు కనెక్ట్ చేస్తూ టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే నిర్మాణాలు నిలిపివేయాలని కోరారు. విద్యార్థుల పోరాటానికి తమ పార్టీ మద్దతు సంపూర్ణంగా ఉంటుందన్నారు. అఖిల భారత స్థాయిలో తమ పార్టీ ఎంపీలతో కేంద్ర మంత్రుల దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు వెనక్కి తిరిగి చూడకుండా తమ పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఈ భూములు దక్కేందుకు పోరాడాలన్నారు. అవసరమైతే తాము ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని తెలిపారు. హైదరాబాద్ యూనివర్సిటీ భూములతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పంకజ్, మెహిత్, సుభాషిణి, అంబేద్కర్, రమేష్, ఆకాశ్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సిట్ : సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సానుభూతితో ఉండి, నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

**దురుద్దేశంతో మాట్లాడుతున్నారు..**

ప్రతిపక్షాలు దురుద్దేశంతో మాట్లాడుతున్నాయనీ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు క్షీణించాయని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడుల మాదిరిగా ఆవేశంతో దాడులు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని దివాళా తీయించి తెలంగాణ ప్రతిష్టను మసకబార్చేలా కుట్రలు చేస్తున్నారని వాపోయారు. ఈ కుట్రలను తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. అధికారం లేకపోతే క్షణం కూడా ఉండలేమన్న తరహాలో వారు(బీఆర్ఎస్) వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇది తెలంగాణ సమాజానికి ఏ రకంగా మేలు చేస్తుందో చెప్పాలని బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. 15 నెల్లుగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పాలన సాగిస్తున్నామని చెప్పారు. అప్పుడే మీకు అంత అసహనం ఎందుకు?అని ప్రశ్నించారు. కడుపునిండా విషం పెట్టుకుని ఎందుకు మాట్లాడుతున్నారని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడిగా జానారెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలనీ, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి మంచి సూచనలివ్వాలని కోరారు.


**గతంలోని రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా?**

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని జోరుగా ప్రచారం చేస్తున్నారనీ, వీరు (బీఆర్ఎస్ నేతలు) హడావిడి చేసినంత మాత్రాన ఎన్నికలు రాబోవని సీఎం తేల్చి చెప్పారు. 2028లోనే ఎన్నికలొస్తాయని తెలిపారు. ఆనాడు పార్టీ మారిన వాళ్లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినా.. ఉప ఎన్నికలు రాలేదని గుర్తు చేశారు. గతంలోనే రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని ప్రశ్నించారు. గతంలో ఆచరించిన సంప్రదాయాలనే ఇప్పుడూ ఆచరిస్తున్నామని తెలిపారు. సభ్యులెవరూ ఆందోళన చెందొద్దనీ, ఏ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. తమ దృష్టి ఉప ఎన్నికలపై లేదనీ, రాష్ట్రాభివృద్ధిపైనే తమ ధ్యాసంతా ఉందని తెలిపారు. బీఆర్ఎస్‌లో కొందరి మధ్య ఉన్న పోటీ రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోందని ఎద్దేవా చేశారు. 'మమ్మల్ని బదనాం చేసినంత మాత్రాన మీరు మంచి వారు కాలేరని చెప్పారు. తాము వివక్ష చూపబోమనీ, అది తమ విధానం కాదని తెలిపారు. డాంబికాలతో తమ ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టలేదని స్పష్టం చేశారు. చేసేదే చెప్తాం.. చెప్పిందే చేస్తామన్నారు.

**ఆ భూమిలో గుంటనక్కలున్నాయి..**

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను ప్రభుత్వం అమ్మబోతుందంటూ వస్తున్న వార్తలపై సీఎం మాట్లాడుతూ ఆ భూమి కోసం గుంటనక్కలు పొంచి ఉన్నాయనీ, వాటికి గుణపాఠం చెబుతామని సీఎం ఈ సందర్భంగా హెచ్చరించారు. రాష్ట్రాభివద్ధి కోసం ప్రభుత్వం భూసేకరణ చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏండ్ల కింద బిల్లీరావుకు గచ్చిబౌలిలో భూమిని కేటాయించారని వివరించారు. ఆ భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇప్పటి వరకు బిల్లీరావు నుంచి భూమిని వెనక్కు తీసుకోలేదన్నారు. ఓపెన్ ఆక్షన్ ద్వారా పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థలకు ఆ భూములను ఇవ్వాలని ముందుకు వస్తే.. అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు తీసుకొచ్చేందుకు అక్కడ పరిశ్రమలను విస్తరించాలనుకుంటున్నామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించాలా? వద్దా? హరీశ్‌రావు సమాధానం చెప్పాలని నిలదీశారు. రేడియల్ రోడ్లు వేయాలా? వద్దా? చెప్పాలన్నారు. అభివద్ధి కోసం భూములు సేకరించాలా? వద్దా? ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలా? వద్దా? అంటూ సభ్యులను నిలదీశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి ఫామ్ హౌస్‌లకు డైరెక్టు కాలువలు తీసుకెళ్లింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ప్రతీది అడ్డుకోవాలనే కుట్ర ఏ రకంగా మంచిది? అని ప్రశ్నించారు. మీ కుట్రలు, కుతంత్రాలకు, అసెంబ్లీలో మైకును వాడుకుంటామంటే ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. అభివృద్ధి, భూసేకరణ విషయంలో అడ్డుపడొద్దని సూచించారు. పరిహారం ఎలా ఇవ్వాలో సూచనలు చేయాలన్నారు. ఇది ప్రభుత్వ ఖజానా నుంచి ఇచ్చేదే తప్ప.. ఎవరి ఇంట్లో నుంచి ఇచ్చేది కాదని చెప్పారు. మల్లన్న సాగర్ లో, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేసులు వేయించింది, పార్టీలో చేర్చుకున్నది వాళ్లేనని(బీఆర్ఎస్) తెలిపారు. 'మేం వివక్ష చూపం.. ఉత్తుత్తి బడ్జెట్.. ఊదరగొట్టే బడ్జెట్ మేం పెట్టలేదు. చేసిందే చెబుతాం.. చేసేదే చెబుతాం. గతంలో కాగితాల మీద బడ్జెట్ పెట్టారు. కాగ్ మొట్టికాయలు వేసినా వారు మారలేదు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికాలో ఐలమ్మ



శివభక్తుడైన హిరణ్యకశ్యపుడికి విష్ణుమూర్తి పేరు చెప్తేనే చికాకు పుట్టుకొస్తుంది. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ 'దొర' గారికి పాలస్తీనా పేరు వింటేనే చిర్రెత్తుకొస్తుంది. దానికి కారణం కూడా లేకపోలేదు. ట్రంప్ అధ్యక్షపీఠం అధిరోహించే ముందు నుండే పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం పేరుతో ఏకపక్షంగా సైనిక దాడులు దిగింది. గాజా నగరంలోని పెద్ద పెద్ద భవనాలను పేకమేడలు లాగా కూల్చింది. ఇప్పటివరకు 50వేల మందికి పైగా పాలస్తీనీయుల ప్రాణాలను బలితీసుకుంది. ఇందులో ఎంతో ఉంది పసి పిల్లలు, మహిళలు ఉన్నారు.ఇవేవి పట్టని ట్రంప్ ఇజ్రాయిల్ ని వెనకేసుకుని యుద్ధాన్నిఆపుతానంటూ పాలస్తీనియన్లతో బేరసారాలు సాగించాడు. యుద్ధాన్ని ఆపుచేయించి గాజా నగరాన్ని ఆక్రమించాలని భావించాడు. ఏ మాత్రం దయాదాక్షిణ్యం లేకుండా పాలస్తీనియన్లను పక్క దేశాలకు తోలి, అక్కడ గాజాలో ఆకాశాన్నంటే భవనాలను, సుందరమైన బీచ్‌లను, హెయలొలికే రిసార్ట్‌లను, ఫైవ్ స్టార్ హెూటళ్లను, రోడ్డుకిరువైపులా కాంతులు వెదజల్లే షాపింగ్ మాల్స్‌ను .... ఓహెూ... ప్రపంచ కుబేరులు సేదదీరే అద్భుత టూరిస్ట్ కేంద్రంగా మార్చాలని ఊహా లోకాల్లో తేలాడు రియాల్టర్ కూడా కదా.

కానీ, ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలనుంచి పాలస్తీనా ప్రజలకు వస్తున్న మద్దతు చూసిన తర్వాత ట్రంప్ లోని చండశాసనుడు బయటకు వచ్చాడు. చివరికి తన దేశంలో కూడా పాలస్తీనా ప్రజలకు మద్దతు దొరుకుతుండటం జీర్ణించు కోలేకపోయాడు. ఇప్పుడు అమెరికాలో పాలస్తీనాకు మద్దతుగా ర్యాలీలో పాల్గొనడం కూడా మహాపరాధమైంది. అటువంటి వ్యక్తులను తన దేశం వారైతే జైలుకి, విదేశాల నుంచి వచ్చిన వారైతే వారి స్వస్థలాలకు బలవంతంగా తరలించడం ఒక ప్రధాన కార్యక్రమంగా ట్రంప్ నిర్ణయించాడు. ఇప్పుడు అమెరికా దేవభూమిలో ట్రంప్ తలుస్తాడు, ఇమ్మిగ్రేషన్ అధికారులు అమల పరుస్తారు.

అందులో భాగంగానే మహమ్మద్ ఖలీల్ ను ఈ నెల మొదట్లో అరెస్ట్ చేసి లూసియానా జైలుకు పంపారు. మహమ్మద్ ఖలీల్ చేసిన తప్పు పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించడమే. ఇమ్మిగ్రేషన్ అధికారులు మొదట చెప్పింది ఖలీల్ స్టూడెంట్ వీసాను ప్రభుత్వం రద్దు చేసిందని. ఖలీల్ తనది స్టూడెంట్ వీసా కాదని,శాశ్వత నివాసహక్కు ఉన్న గ్రీన్ కార్డ్ అని అధికారులకు చెప్పాడు. నాలుక కరుచుకున్న ఇమ్మిగ్రేషన్ వారు అయితే దాన్ని కూడా రద్దు చేస్తున్నామని అప్పటికప్పుడు హెూమ్ డిపార్ట్మెంట్ తో మాట్లాడి రద్దు చేయించి, అరెస్ట్ చేసి పట్టుకెళ్లారు. ఇటువంటి అడ్డగోలు అరెస్టులకు ట్రంప్ పాలనలో అడ్డు లేకుండా ఉంది.

రంజని శ్రీనివాసన్ ను కూడా ఇదే కారణం చెప్పి, ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ వారెంట్ లేకుండా ఆమెను పట్టుకెళ్ళటానికి అపార్ట్మెంట్ కు వచ్చారు. ఇండియాకు చెందిన రంజని శ్రీనివాసన్ కొలంబియా యూనివర్సిటీ లో చదువుతున్నది. రంజనితోపాటు నివసించే అమెరికా అమ్మాయి ఇమ్మిగ్రేషన్ అధికారులను లోపలికి అడుగుపెట్టనివ్వలేదు. అరెస్టు వారెంటు చూపమని బెదిరించింది. దానితో అప్పటికి అధికారులు తోక ముడిచారు. రంజని శ్రీనివాసన్ స్టూడెంట్ వీసాను ఏకపక్షంగా రద్దుచేసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత అమెరికా అమ్మాయి సహాయంతోనే రంజిని తప్పించుకుని కెనడాకు చేరింది. అమెరికాలో వాక్, భావ స్వాతంత్ర్యాలకు ట్రంప్ పాలనలో మగ్యం అని రంజని అంటున్నది.

21 ఏండ్ల యన్సియో చుంగ్ ను ఏ విధంగానైనా అరెస్ట్ చేసి దేశం నుంచి పంపిచాలని ట్రంప్ ప్రభుత్వం తలచింది. చుంగ్ కొలంబియా యూనివర్సిటీలో చదువుతుంది. తల్లి తండ్రులు సౌత్ కొరియా నుంచి అమెరికాకు వలస రావడంతో 7 ఏండ్ల వయసులోనే చుంగ్ అమెరికాకు వచ్చింది. చుంగ్ శాశ్వత నివాస హక్కు ఉన్న గ్రీన్ కార్డ్ హెూల్డర్. ఆమె చిన్నప్పుడే అమెరికాకు రావటంతో ఆ దేశం తప్ప తనకు మరో దేశం తెలియదు అంటున్నది. నన్నెక్కడి పంపించే అధికారం మీకెక్కడిది,అమెరికానే నా మాతభూమి అంటున్నది. ఇజ్రాయిల్ దాడులు మొదలైన 2023 నాటి నుంచే పాలస్తీనాకు మద్దతుగా జరిగే నిరసన ప్రదర్శనలలో చుంగ్ పాల్గొంటున్నది. అది ఆమె తన హక్కు అని కూడా అంటున్నది. ఇటు ఏ కార్డు ఉన్నా గెట్ అవుట్ అనటం మా పాలసీ అంటున్నది ట్రంప్ ప్రభుత్వం. మార్చి 5న పాలస్తీనాకు మద్దతుపలుకుతున్న విద్యార్థులను బహిష్కరించడాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ లైబ్రరీ లో బైటాయింపు సమ్మె జరిగింది. దానిలో చుంగ్ పాల్గొన్నది. దీనిని సహించలేని ట్రంప్ అమెరికా నుంచి చుంగ్ ను పంపించాలనుకున్నది. ట్రంప్ ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రశ్నిస్తూ ట్రంప్ ను, అయన గ్యాంగ్ ను న్యూయార్క్ డిస్ట్రిక్ట్ కోర్టుకు ఈడ్చింది చుంగ్.

చట్టబద్ధ మైన నిరసన కార్యక్రమంలో తాను పాల్గొన్నానని తనను నిర్బందించటం చట్టవ్యతిరేకమనిచట్టం. దేశ పౌరురాలిగా రాజ్యాంగం ఇచ్చిన హక్కుపై ట్రంప్ ప్రభుత్వం దాడి చేస్తున్నదని ఆమె తన లాయర్ ద్వారా వాదించింది. చుంగ్ లాంటి అమెరికాకు చెందని పౌరుల వల్ల అమెరికాకు ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వం కోర్టులో వాదించింది. చుంగ్ వల్ల దేశానికి ముప్పు వస్తుందనే వాదనకు సరియైన రుజువులు ప్రభుత్వం చూపలేక పోయిందని న్యాయమూర్తి ప్రభుత్వ వాదనలను తిరస్కరించారు. ఆమె తుది తీర్పు ఇచ్చేదాకా ఆమె జోలికి ఇమ్మిగ్రేషన్ అధికారులు పోవద్దని హెచ్చరించింది కోర్టు. ఇమ్మిగ్రేషన్ డిపార్ట్మెంట్ ను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం అసమ్మతిని బెదిరింపులకు గురి చేస్తుందని, చుంగ్ తో సహా ఎవరి మీద ప్రభుత్వం చర్యలు తీసుకోకూడదని న్యాయమూర్తి అన్నారు. ట్రంప్ ప్రభుత్వం దూకుడుకి ఈ తీర్పు కళ్లెం వేస్తుందని అమెరికా పత్రికలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఆనాటి తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ఒక భూస్వామి గడీ ముందు ఒక్కతే నిలబడి సవాల్ విసిరి, గెలిచింది వీరనారి ఐలమ్మ. అలాగే ప్రపంచ భూస్వామిగా ఎదగాలని ఉవ్విళ్ళూరుతున్నట్రంప్ దొరకు చుక్కలు చూపించింది 21 ఏండ్ల చుంగ్. ప్రజల హక్కులు కాలరాయాలనుకునే నిరంకుశ ప్రభువులకు ఎదురు దెబ్బలు తప్పవు, అంతిమంగా ఓటమీ తప్పదు.



# వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాల్సిందే..

**ఇందిరాపార్కు వద్ద మహాధర్నా**

**వారంలో పరిష్కరించపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**

**ఉద్యోగాలు వచ్చే వరకు పోరాటం : జూలకంటి రంగారెడ్డి**



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 81, 85 ప్రకారం.. 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, కొత్తగా తీసుకొస్తున్న గ్రామ పరిపాలనా అధికారి (జీపీఓ) పోస్టుల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా పాలడుగు మాట్లాడుతూ.. సర్కార్ ఎంత కాలయాపన చేసినా ఉద్యోగాలు సాధించే వరకూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఈ లోపు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీఆర్‌ఏల విషయంలో ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని వీఆర్‌ఏ జేఏసీ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. తండ్రి, తాతలు, నేటి వరకు వీఆర్‌ఏలతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే మిగిలిన వీఆర్‌ఏల వారసులను విధుల్లోకి తీసుకుంటామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీనిచ్చి, ఇప్పుడు సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు.

రాష్ట్రంలో తక్కువ వేతనంతో ఎక్కువ పని చేస్తున్న వారు కేవలం వీఆర్‌ఏలేనని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. ధర్నాకు కేవీపీఎస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సర్కార్ స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కమిటీ వేశాం.. రిపోర్టు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని కాలయాపన చేయడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం 15 నెలలుగా కాలయాపన చేస్తుండటంతోనే రోడ్డు మీదకు రావాల్సి వచ్చిందని వీఆర్‌ఏ-జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు అన్నారు. గత సీఎం వీఆర్‌ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అసెంబ్లీలో ప్రకటన చేశారని గుర్తు చేశారు. జీవోలు వచ్చి రెండేండ్లు, ప్రభుత్వం మారి ఏడాదిన్నర, కమిటీ వేసి ఏడాది కావస్తున్నా.. వీఆర్‌ఏల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. జీపీఓ వ్యవస్థలో వీఆర్‌ఏలకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్హతలను బట్టి జీపీఓలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పలపల్లి బాలరాజు, ఎంఎస్ఎఫ్ నాయకులు సోమశేఖర్ మాదిగ, జేఏసీ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపాల్టీల ఏర్పాటు, మార్పుల్లో పరిగణనలోకి ప్రజాభిప్రాయం

**మంత్రి శ్రీధర్ బాబు**



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

నూతన మున్సిపాల్టీల ఏర్పాటు, గ్రామాల విలీనం, మార్పులు తదితర విషయాల్లో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణ మున్సిపాల్టీస్ యాక్ట్, 2019 సవరణ బిల్లును ఆమోదించారు. అంతకు ముందు జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, నేరుగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని చట్టంలో లేదనీ, అయితే వివిధ వినతిపత్రాల రూపంలో వచ్చిన ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి కలెక్టర్లు నివేదికలు ఇచ్చారని తెలిపారు. గ్రామాల విలీనం సమయంలో అక్కడి ప్రజలు ఉపాధి కోల్పోతుండటంతో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం చర్యలు తీసుకోనున్నట్టు హామీ ఇచ్చారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఈ సవరణ తెస్తున్నట్టు తెలిపారు. నగరాభివద్ధి నిధుల ద్వారా ఆదుకోనున్నట్టు చెప్పారు. షెడ్యూల్ ప్రాంతంలో వచ్చే గ్రామాల హక్కులను పరిరక్షిస్తామన్నారు. పాల్వంచలో ఏజెన్సీ గ్రామాలను కలుపలేదని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు అక్కడి మున్సిపాల్టీ పరిధిలో ఓటర్లని తెలిపారు. జీహెచ్ఎంసీలో విలీనమయ్యే వారు భయాందోళనకు గురి కావద్దని కోరారు. ప్రోటోకాల్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో తాను కూడా బాధితున్నేననీ, ఆ బాధ తనకు తెలుసని చెప్పారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్ వేతనాలను పెంచే విషయాన్ని పరిశీలించనున్నట్టు తెలిపారు. మున్సిపల్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు ఓటు హక్కు కల్పించాల్సి ఉందని చెప్పారు. అంతకు ముందు చర్చలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనంతో విలీన గ్రామాల ప్రజలకు కలిగే ప్రయోజనాలేంటి? అని ప్రశ్నించారు. వాటిని సమగ్రంగా వివరలించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ నిధులు జీహెచ్ఎంసీకి వస్తున్నాయనీ, తిరిగి షాద్‌నగర్‌కు వాటిని ఖర్చు చేయడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పాల్వంచలో పీసా చట్టం ఉందని గుర్తుచేశారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా కార్పొరేషన్ ఏర్పాటుతో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పెద్ద మున్సిపాల్టీలు, చిన్న మున్సిపాల్టీల పరిధిలో ఒకే రకమైన పన్నులు వేయడం సరికాదని సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో విలీనమయ్యే గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజకీయ అవకాశాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన తర్వాత గ్రామాల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలి ఆవరణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసన

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

శాసనమండలి ఆవరణలో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆకస్మికంగా నిరసనకు దిగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇవ్వాలంటూ బంగారం కడ్డీల నమూనాలను ప్రదర్శిస్తూ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నెలలుగా రాష్ట్రంలో కొత్తగా పెళ్లైన జంటలు తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీలు తెలిపారు. నిరుపేదలు ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.లక్షకుపైగా ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ నేతలు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారనీ, అధికారంలోకి రాగానే ఆ హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఖాతాల్లో జమ చేస్తామని మాయ మాటలు చెప్పారని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ నిరసనలో శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, వాణిదేవి, తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లల నిబంధన సడలింపుపై సీఎంతో చర్చిస్తా

## పంచాయతీరాజ్ మంత్రి సీతక్క



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మందికి అవకాశం లేకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణ పంచాయత్ రాజ్ యాక్ట్, 2018 సవరణ బిల్లును ఆమోదించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకోనున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీలుగా మారిన తండాల్లో అక్కడే రేషన్ షాపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసమే పంచాయతీ ఎన్నికలు ఆలస్యమవుతున్నాయనీ, కేంద్రం తొందరంగా ఆమోదిస్తే బీసీలకు అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు జరిగిన చర్చలో, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, బిల్లును ఆమోదిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల విలీనంతో ఉపాధి తగ్గి, పన్నులు పెరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలని కోరారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పెద్ద ధన్వాడ గ్రామాల్లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దని కోరారు. దానిని పారిశ్రామిక ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీ, పంచాయతీల మధ్య ఇద్దరు పిల్లల నిబంధనలో తేడాలెందుకు? అని ప్రశ్నించారు.

**నిందించడమే పనిగా పెట్టుకున్నారు : ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్‌పై సీతక్క ఫైర్**

ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడమే పని పెట్టుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనను, 15 నెలల కాంగ్రెస్ పాలనను ఒకేగాటన కట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో చేసిన అభివృద్ధి పట్ల ఆయనకు కొద్దిగా కూడా సానుకూల ధృకృథం లేదని చెప్పారు. బుధవారం శాసనసభలో హోం శాఖ, గృహ నిర్మాణ శాఖ పద్దులపై అక్బరుద్దీన్ చేసిన విమర్శలను సీతక్క తిప్పికొట్టారు. శాంతిభద్రతల రక్షణలో నిమగ్నమవుతున్న పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని విమర్శించారు. పోలీసుల్లో మంచివారు కూడా ఉంటారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందనీ, వాటిని నియంత్రిస్తున్న క్రమంలో కొంత రియల్ ఎస్టేట్ వెనుకపట్టు పడిందని చెప్పారు. రాష్ట్రంలోని యువత గంజాయి. డ్రగ్స్, కొకైన్ మత్తు పదార్థాల్లో మునిగిపోయారనీ, ఆ మత్తులో మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పూర్తిగా నియంత్రించే పనిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. మత్తు పదార్థాల సరఫరా వెనుక బీఆర్ఎస్‌లోని కొంత మంది పెద్దల హస్తం ఉందని ఆమె ఆరోపించారు.

# తోట యాక్ట్, నిబంధనలు అడాప్ట్

## మంత్రి దామోదర రాజనర్సింహ



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం చేసిన ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ కణజాలల యాక్ట్, 2011 (అమెండ్‌మెంట్) (తోట) చట్టాన్ని, నిబంధనలను రాష్ట్రానికి అడాప్ట్ చేసుకుంటున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ 1994లో చేసిన ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ (సెంట్రల్ యాక్ట్ 42), 1994 అండ్ రూల్స్, 1995నే ప్రస్తుతం తోట చట్టంగా పిలుస్తున్నారని తెలిపారు. అవయవాల మార్పిడితో పాటు, కణజాలల మార్పిడిని కూడా తోట యాక్ట్ అనుమతించిందని చెప్పారు. "తోట యాక్ట్‌కు సంబంధించిన నిబంధనలను 2014లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దేశంలోని 24 రాష్ట్రాల్లో తోట చట్టం, ఆ చట్ట ప్రకారం 2014లో చేసిన నిబంధనలే అమలులో ఉన్నాయి. తోట యాక్ట్ అడాప్ట్‌తో గుండె, కిడ్నీ, కాలేయం వంటి అవయవాలతో పాటు చర్మం, ఎముక మజ్జ, రక్త నాళాలు, హార్ట్ వాల్వ్ మార్పిడి వంటివి కూడా చట్ట పరిధిలోకి వస్తాయి. బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి వీటిని సేకరించి, అవసరమైన వారికి మార్పిడి చేయడానికి వీలుపడుతుంది. అమ్మమ్మ, నానమ్మ తాతయ్యలు వారి మనవళ్లు, మనవరాళ్లకు అవయవ దానం చేయడానికి చట్టం అనుమతి ఇస్తుంది. కొన్ని రకాల జన్యుపరమైన సమస్యల వల్ల పిల్లలకు కాలేయ మార్పిడి చేయాల్సి వస్తుంది. ఇలాంటి పిల్లలకు, వారి గ్రాండ్ పేరెంట్స్ కాలేయదానం చేయడానికి అవకాశం కలుగుతుంది. పిల్లల ప్రాణాలు కాపాడడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే, మనవళ్లు, మనవరాళ్లు కూడా వారి గ్రాండ్ పేరెంట్స్‌కు అవయవ దానం చేయొచ్చు.... " అని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. "అవయవాల అక్రమ రవాణా, అక్రమ మార్పిడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించేలా కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించి అవయవ మార్పిడి చేస్తే గతంలో రూ.5 వేల జరిమానా, 3 సంవత్సరాల వరకూ జైలు శిక్ష విధించేందుకే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం రూ.ఒక కోటి రూపాయల వరకూ జరిమానా, 10 సంవత్సరాల జైలు శిక్ష విధించవచ్చు.... " అని మంత్రి వివరించారు.

" 1995 నాటి నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెత్ డిక్లేర్ చేసే అధికారం న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లకు మాత్రమే ఉంది. కొత్త నిబంధనల ప్రకారం ఫిజీషియన్, సర్జన్, ఇంటెన్సివిస్ట్, అనేస్థియసిస్ట్‌లకు కూడా బ్రెయిన్ డెత్ డిక్లేర్ చేయడానికి అర్హులు అవుతారు. దీంతో బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవాలు వృథాగా పోకుండా, అవసరమైన పేషెంట్ల ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతాయి. అవయవ దానం, మార్పిడిపై పర్యవేక్షణ కోసం ప్రభుత్వ స్థాయిలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తాం. కేంద్రం, ఇతర రాష్ట్రాల్లోని అవయవ మార్పిడి వ్యవస్థలతో జీవన్‌దాన్‌ను అనుసంధానిస్తాం. ఇతర రాష్ట్రాల్లో బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి సేకరించిన అవయవాలను, మన రాష్ట్రంలోని పేషెంట్లకు అమర్చడానికి అవకాశం కలుగుతుంది. బ్రెయిన్ డెత్ డిక్లరేషన్, అవయవదానం, అవయవాల సేకరణ, మార్పిడి ప్రక్రియల పర్యవేక్షణ కోసం ప్రతి హాస్పిటల్‌లో ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లను నియమిస్తాం. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు "అవయవాలు, కణజాల సేకరణ కేంద్రాలు, స్టోరేజీ కేంద్రాలు" ఏర్పాటు చేస్తాం. దీంతో పారదర్శకత పెరుగుతుంది. మెడికల్ టూరిజం బలోపేతానికి దోహదపడుతుంది.... " అని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు.

సంపాదకీయం

# వికాస 'తిరస్కరణ'

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకం పొందాలన్నా, దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నెంబరును లింకు, పైగా తాజా ఫొటో చేర్చాలనే నిబంధనతో ఇంటిల్లిపాది 'మీసేవ', ఆధార్ అప్‌డేట్ కేంద్రాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తూనే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వకాలం నుంచి కొత్త రేషన్‌కార్డులు అందించకపోగా మార్పులకు కూడా నోచని దుస్థితి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీకి హామీనిచ్చినా.. ప్రకటనలే తప్ప సరైన స్పష్టత లేదనే విమర్శలనేకం.ఈ నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ సమస్యలు, రేషన్‌కార్డుకోసం దరఖాస్తుదారుల తిప్పలు, వెరసి యువత అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది.

> ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు చాలా కాలం నుంచి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించే ప్రక్రియను నిలిపేశాయి. దీంతో ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకం ఒక ఆశాజ్యోతిగా ఉంది. దీనికితోడు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ.ఆరు వేల కోట్లు కేటాయించడంతో దాదాపు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలున్నాయి. అదే కనుక సక్రమంగా అమలు జరిగితే యువత నెత్తిన సర్కార్ పాలు పోసినట్టే. ఒకవైపు దరఖాస్తుకు గడువు చూస్తే ముంచుకొస్తుంది. మరోవైపు ఈ ఇబ్బందులు యువతను కలవర పెడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వరమే రేషన్ కార్డులను జారీ చేసి, దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలి.



నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా యాభై శాతం వరకు బ్యాంకుల ద్వారా రుణాలిప్పించి యూనిట్‌ను బట్టి రూ.40వేల నుంచి 80 వేల వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ పథకానికి మార్గదర్శకాలు రాకపోయినా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ ఐదు గడువు. గతంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను వెబ్‌సైట్ నుంచి తొలగించకపోవడంతో కొత్తగా దరఖాస్తులు ఎంట్రీ కావడం లేదు.దీంతో నిరుద్యోగ యువత ఇబ్బందుల ఇక్కట్లు అన్నీఇన్నీకావు. ఈ పథకానికి కూడా రేషన్ కార్డుతో ముడి పెట్టడంతో కార్డులు లేని వాళ్ల ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి. దీంతో నిరుద్యోగుల కష్టాలు వర్ణణాతీతం.

కొత్తగా పెండ్లయినవారు ప్రభుత్వ పథకాలు పొందడానికి ఉమ్మడి కుటుంబంలో ఉన్న రేషన్‌కార్డు నుంచి పేర్లు రద్దు చేసుకుని కొత్తకార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి కొత్తవి రాకపోగా, ఉన్న పాత రేషన్‌కార్డులో పేరు డిలీట్ కావడంతో తాజాగా ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం సైతం పొందలేకపోతున్నామని యువత ఆవేదన చెందుతున్నది. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా.. కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి 'కొండ నాలుకకు మందేస్తే..ఉన్న నాలుక ఊడిందన్న' చందంగా మారింది.

మరోవైపు కోటి ఆశలతో రాజీవ్ యువ వికాసం పథకానికి యువత చేసుకుంటున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవుతూ నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు కుమ్మరిస్తున్నాయి. కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హులని సర్కారు షరతులు విధించింది. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకుని.. లబ్ధి పొందని వారికి ఈ సమస్య మెడకు గుదిబండలా మారింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి అవ కాశాలు పొందని వారు రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులో ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే 'ఆల్రెడీ అప్లయిడ్' అని చూపుతోంది. వీరే కాకుండా.. వికలాంగులు ఆ శాఖ ద్వారా స్వయం ఉపాధి కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నవారి పరిస్థితీ అంతే. అసలు వీరిలో లబ్ధిదారుల ఎంపికే జరగలేదు. కానీ, యువ వికాసం కింద దరఖాస్తు కోసం ప్రయత్నిస్తే అప్లై చేసినట్టే సైట్‌లో కనిపిస్తోంది. ఈ పరిణామాలతో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో పడింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు చాలా కాలం నుంచి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించే ప్రక్రియను నిలిపేశాయి. దీంతో ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకం ఒక ఆశాజ్యోతిగా ఉంది. దీనికితోడు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ.ఆరు వేల కోట్లు కేటాయించడంతో దాదాపు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలున్నాయి. అదే కనుక సక్రమంగా అమలు జరిగితే యువత నెత్తిన సర్కార్ పాలు పోసినట్టే. ఒకవైపు దరఖాస్తుకు గడువు చూస్తే ముంచుకొస్తుంది. మరోవైపు ఈ ఇబ్బందులు యువతను కలవర పెడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వరమే రేషన్ కార్డులను జారీ చేసి, దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలి. కనీసం గతంలో చేసిన దరఖాస్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. అదే విధంగా గతంలో దరఖాస్తుదారులు నమోదు చేసిన వివరాలను అధికారులు తొలగించకపోవడం వల్లే తలెత్తుతున్న సమస్యలను సైతం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. లేదంటే అంతిమంగా నష్టపోయేది పేదపిల్లలే..ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసే అభాగ్యులే.

---

# దూసుకొస్తున్న 'ప్లాస్టిక్‌బాంబు'



మేకిరి దామోదర్
9573666650

ప్రపంచ పర్యావరణానికి ప్లాస్టిక్ తీవ్ర హాని కలిగిస్తున్నది. ప్రజారోగ్యాన్ని కూడా ప్రమాదంలో పడేస్తున్నది.మానవ జీవితాల్లోకి శరవేగంగా చొచ్చుకొస్తున్నది. ఇప్పుడు మనిషి మనుగడే ఒక ప్రశ్నార్థకంగా మారింది. అందుకుగాను ఇంగ్లాండులోని లీడ్స్ యూనివర్సిటీ పరిశోధకులు గత సంవత్సర అధ్యయాన్ని పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. 'ప్రపంచంలో యేటా 25.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ తయారవుతుంది. ఇలా పుట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కనబరచడం లేదు.దీంతో ప్లాస్టిక్ కాలుష్యంతో ముంచి వేయటంలో అన్నిదేశాల కంటే మనదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది!' అని ప్రఖ్యాత నేచర్ జర్నల్ తాజా అధ్యయనం పేర్కొంది. ఇలా మన తర్వాత స్థానాల్లో నైజీరియా, ఇండోనేషియా, ఆ పాపాన్ని పంచుకుంటున్నాయని, ఈ అధ్యయనాన్ని నిర్వహించిన లీడ్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు వెల్లడించారు.ఈ ప్లాస్టిక్ మానవాళికే కాకుండా ఇతర జంతుజాలానికీ, పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తుంది. ఈ పాపంలో మన వాటా ఎక్కువగా ఉన్నందున తగ్గించుకోవడానికి మనమేం చేయాలో ఆలోచించుకోవాల్సిన తరుణమిది.ఈ అధ్యయనం మేరకు ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో 5.2 కోట్ల టన్నులకు పైగా సరైన నిర్వహణ లేక బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేయటం లాంటి చర్యల ద్వారా వాతావరణంలో కలిసిపోతుంది. ఇలా



అనాలోచితంగా బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్‌ను కాల్చడంతో విషతుల్యమైన కార్బన్ మోనాక్సైడ్ లాంటి వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి గుండె జబ్బులకు, శ్వాసకోశ వ్యాధులకు, క్యాన్సర్ లాంటి ప్రాణాంతకాలకు, నరాల సమస్యలకు దారితీస్తున్నాయి. అలాగే మితిమీరిన ప్లాస్టిక్ వినియోగంతో మనకు తెలియకుండానే సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) మనల్ని అన్ని వైపులా ఆవహిస్తున్నాయి. పర్వతాలు, అడవులు, రిజర్వాయర్లు, నదులు, సముద్రాల్లో ఇవి చేరిపోతున్నాయి.ఇలా మనం తినే తిండి నుంచి పీల్చే గాలిలో, తాగే నీటిలోనూ ఉంటున్నాయి.

ప్రతి గంటకు సగటున మనం గాలి ద్వారా 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులు పీల్చుకునే ప్రమాదంలో ఉన్నాము. అంతేకాకుండా పర్యావరణంలోకి ప్రవేశించే ప్లాస్టిక్ కాలుష్య భూతం అత్యంత ఎత్తయిన ఎవరెస్టు నుంచి అత్యంత లోతైన మరియానా ట్రెంచ్ దాకా ప్రతి చోటును ఆవహిస్తోంది. గమ్మత్తేమంటే ప్రపంచంలో అత్యంత అధికంగా ప్లాస్టిక్ ఉత్పత్తి చేసేవి ధనిక దేశాలు. కానీ వాటిలో ఒక్కటి కూడా టాప్ తొంభై కాలుష్యకారక దేశాల జాబితాలో లేవు. సుమారు 69 శాతం ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యం కేవలం ఇరవై దేశాల నుంచి వస్తోంది.ఇవన్నీ అభివృద్ధి చెందుతున్నపేద దేశాలే కావడం గమనార్హం!.ధనిక దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ సమర్థంగా సాగుతుండటమే ఇందుకు కారణంగా అధ్యయనం అభిప్రాయపడుతున్నది. భారత దేశంలో యేటా 58 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను కాలుస్తున్నారు. మరో 35 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను పర్యావరణంలోకి (భూమి,నీరు,గాలిలోకి) వదులుతున్నాం. మొత్తంగా ఏడాదిలో సుమారు 90 లక్షల టన్నులకు పైగా ప్లాస్టిక్ భూతాన్ని ఈప్రపంచంమీదికి వదులుతున్నాం.నైజీరియా(35 లక్షల టన్నులు), ఇండోనేషియా(34 లక్షల టన్నులు), చైనా (28 లక్షల టన్నులు) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలోనే మిగిలిన రంగాల మాదిరిగానే ప్లాస్టిక్ కాలుష్యంపై కూడా ధనిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన భిన్నంగా ఉంది.ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, నిర్వహణ సరిగ్గా చేయడం ప్రధానమని ధనిక దేశాలు వాదిస్తుండగా.. ప్లాస్టిక్ ఉత్పత్తిని, వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలు వెతకాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు అంటున్నాయి.

ఆ మధ్య మనదేశ అత్యున్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తపరచినట్లు.. మనం ప్రస్తుతం 'ప్లాస్టిక్ బాంబుపై' కూర్చున్నాం!.ఆ మహమ్మారిని కట్టడిచేయడంలో విఫలమైతే అణ్వస్త్రాలను మించిన ముప్పును భావితరాలు ఎదుర్కోక తప్పదు. ఇంతటి దుర్భర దుస్థితి దాపురించకూడదంటే? ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి.సంబంధిత వ్యర్థాల సద్వినియోగం పట్ల పాలకులు ప్రతి ఒక్కరూ నేను సైతం అంటూ సామాజిక బాధ్యతతో శ్రద్ధ వహించాలి. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ తీవ్రత దృష్ట్యా ప్లాస్టిక్ భూతానికి ముగింపు పలికేందుకు జరిగిన అంతర్జాతీయ ఒప్పంద రూపకల్పనకు 170కి పైగా దేశాలు చర్చలు జరిపాయి.కానీ ఏకాభిప్రాయం కుదరలేదు?.ఆ ఒడంబడిక చిత్తశుద్ధితో ఎంత త్వరగా సాకారమైతే ప్రపంచ జీవజాతుల, మానవ మనుగడకు అంతమంచిది. ప్రమాదకర ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై పరిశోధనలకు చేయూతనివ్వాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం ద్వారా ఖర్చు తగ్గిస్తూనే, నాణ్యతను పెంచవచ్చునే విదేశాల అనుభవాలతో పాఠం నేర్చుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో డీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తే, వ్యర్థాలను సంపద సృష్టికి వినియోగించుకోవచ్చు. ఇలా ప్లాస్టిక్ నియంత్రణ నియమాలన్నీ సక్రమంగా అమలయ్యేలా చూడాలి. దాని వాడకం వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.ప్రపంచ,దేశీయ పాలకులు,పాలితులు చిత్తశుద్ధితో కంకణ బద్ధులైతేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. ■

---

# పేదలకు ఇండ్లు, స్థలాలు ఇంకెప్పుడిస్తారు?



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అన్ని పాలక కేంద్ర, రాష్ట్ర బూర్జువా పార్టీలు పేదలందరికీ ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇచ్చేస్తున్నామంటూనే ఉన్నాయి. అయినా అందరికీ ఇండ్లు రాలేదు. ఇండ్ల స్థలాలూ రాలేదు. మరి పేదలు పెరిగారా? లేదా పెద్దల ఖాతాల్లోకే పోయాయా? బీఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇండ్లే దీనికి ఉదాహరణ. పీఎం అవాస్ యోజన డబ్బంతా గులాబీ ఖాతాల్లో వేసుకున్నదని బీజేపీ, తెలంగాణకు బుడ్డ పైసరాలే! డబుల్ ఇండ్లన్నీ కేసీఆర్ గొప్పతనమేనని బీఆర్ఎస్ వారు వాదులాడుకుంటున్నారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల కత ప్రారంభమైంది. దీని సక్కదనం జనం చూస్తూనే ఉన్నారు ఏడాదిగా!

రాష్ట్రంలో ఏ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దళితులకు, గిరిజనులకు, వెనకబడిన వర్గాలకు ఇండ్ల నిర్మాణం చేపడతామని ముందు ప్రకటిస్తుంది. తన బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయిస్తున్నది. కానీ ఇండ్ల నిర్మాణం మాత్రం పూర్తి కావడం లేదు. 1983 నుండి 2014 వరకు చూస్తే ఇందిరమ్మ ఇండ్లు 1-2-3 కింద 42,40,753 ఇండ్ల నిర్మాణం తెలంగాణలో చేసినట్లు ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. అదే తన పదేండ్ల పాలనలో టీ(బీ)ఆర్ఎస్ ప్రభుత్వం 2,92,938 ఇండ్లు మంజూరు చేసింది. రూ.12,560 కోట్లు వ్యయం చేసి 1,54,389 ఇండ్లు మాత్రమే పూర్తి చేసింది. ఇంకా 75,947 ఇండ్లు నిర్మాణం ప్రారంభించలేదు. నిర్మించిన ఇండ్లను పేదలకు పంపిణీ కూడా చేయలేదు. గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లుకానీ, బీఆర్ఎస్ నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు పాలకవర్గాలు వారి పార్టీ అనుయాయులకు మాత్రమే ఇచ్చుకున్నాయి. కొంతమంది నాలుగు నుంచి పదిఇండ్ల వరకు అక్రమించి, తర్వాత వాటిని అమ్ముకొని సొంత బంగ్లాలను కూడా నిర్మించుకున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లలో జరిగిన అవినీతిని విచారించి నిందితులను శిక్షిస్తామని ప్రకటించింది. కానీ, ఆ విచారణ కాగితాలకే పరిమితమైంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం కూడా గత సర్కార్ కాలంలో జరిగిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల అవినీతిని విచారించి బాధ్యులను శిక్షిస్తామని చెప్పింది. పద్నాలుగు మాసాలు గడిచినా డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిని, ఇండ్ల నాణ్యతను గానీ పరిశీలించింది లేదు. ప్రస్తుతం సర్కార్ ఊసే మరిచిపోయినట్టుంది!

> రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెబుతున్నప్పటికీ ఎక్కడ చూసినా భూముల ధరలు మాత్రం విపరీతంగా పెరిగాయి. అందువల్ల భూ సంస్కరణలు అమలు చేయాలి. పేదలు వంద గజాలు కూడా కొనని పరిస్థితి ఉన్నది. భూమి కొనుగోలుకు బదులుగా ప్రభుత్వ భూములు సర్వేచేసి అక్రమణలో ఉన్న భూములను బయటకు తీసి పేదలకు పంచాలి. 1975లో సీలింగ్ చట్టం వచ్చినప్పుడు ప్రభుత్వం సేకరిం చిన భూమిలో 89వేల ఎకరాలు ఇంకా పంపిణీ కాకుండా ఉంది. భూస్వాములు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఆ కేసులను పరిష్కరిం చటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాలి. భూ పంపిణీకి కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. అది ప్రభుత్వ బాధ్యత. లేదంటే ప్రజలు ఉద్యమాల ద్వారానే ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించుకోవాలి.

## ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లు

కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లు కూడా ఉన్నవి. దీనికి సంబంధించి 250చ.గ స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు నిర్మాణ ఖర్చుల కింద ఇస్తామని ప్రకటించింది. తెలంగాణ అమరవీరులకు 250చ.గ స్థలంతో పాటు ఉచితంగా ఇచ్చి ఇండ్ల నిర్మాణం చేపడతామని పేర్కొంది. ప్రతి నియోజకవర్గానికి 3500ల ఇండ్ల చొప్పున 119 నియోజక వర్గాలకు 4.5లక్షల ఇండ్ల నిర్మాణం చేపడతామని నమ్మబలికింది. 7డిసెంబర్2023న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మార్చి 2025 వచ్చినప్పటికీ ఇంకా ఇండ్ల జాబితాలు సేకరించే పనిలోనే ఉన్నది. ఇండ్ల జాబితాలను స్థానిక శాసనసభ్యులు ఆమోదిం చాలన్న నిబంధన ఉండటంతో కాంగ్రెస్ పార్టీ అనుయాయులకే లబ్ధికలిగించడానికి పేర్లు ఎంపిక చేసింది. మొదటి దశలో స్థలాలున్న వారికి రూ.5లక్షలు ఇస్తామని, రెండోదశలో ఇండ్ల స్థలాలు లేనివారికి స్థలాలు పంపిణీ చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ స్థలాలు లక్షల ఎకరాలో ఉన్నప్పటికీ ఏనాడు ఏ ప్రభుత్వం ఇండ్లులేని దళితులకు, గిరిజనులకు, వెనకబడిన వర్గాలకు పంపిణీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో రూ.8,424కోట్లు ఇండ్ల కోసం కేటాయించింది. బడ్జెట్ ప్రవేశపెట్టి ఏడాది కావస్తున్నా ఇండ్ల నిర్మాణం చేపట్టలేదు. రూ.5లక్షలతో ఇండ్ల నిర్మాణం సాధ్యమేనా? కనీసం రూ.15 లక్షలు లేకుండా మామూలు ఇల్లు కూడా నిర్మించ లేము. ఈ వాస్తవం కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసినప్పటికీ కాలయాపన చేస్తున్నది. కనీసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి ఆ ఇండ్లలో విద్యుత్, తాగునీరు, రహదారులు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినా కొంత ప్రయోజనం కలిగేది. కానీ ఆది కూడా చేయడం లేదు. కనీస సౌకర్యాలు లేనందున డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి వెళ్లడానికి ప్రజలు సుముఖంగా లేరు. నిర్మాణం జరిగిన ఇండ్లల్లో కనీస అవసరాలకు పెద్దగా వ్యయం చేయాల్సిన అవసరం లేదు.



## ఇండ్లపై సన్నగిల్లుతున్న నమ్మకం

మూసీప్రక్షాళన పేరుతో, అక్కడే నివాసముంటున్న పేదలకు ఇండ్లు కేటాయిస్తామన్నా అది కూడా అతీగతి లేదు. ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇస్తుందన్న నమ్మకం ప్రజల్లో రోజురోజుకూ సన్నగిల్లుతున్నది. పార్టీ అనుయాయులకు కేటాయించడం వల్ల అనర్హులకు ఇండ్లు పంపిణీ మాత్రం యధావిధిగా కొనసాగుతున్నది. ఇదే అదనుగా కొంతమంది పైరవీకారులు ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అయినా వారికి ఇండ్లు రావడంలేదు. ఇంత కాలం నిర్మాణం చేసిన ఇండ్లు, వాటి పంపిణీపై విచారణ చేపట్టి అర్హులకు ఇండ్లిస్తే వారు ఎంతో సంతోషించేవారు. కానీ అది జరగడం లేదు. 2025-26లో రాష్ట్ర బడ్జెట్ రూ.8,561 కోట్లు మాత్రమే కేటాయించింది. కేంద్రం రూ.4,005 కోట్లు ప్రకటించింది. మొత్తం రూ.12,670 కోట్లకు చేరినా ఈ నిధులతో 4.5 లక్షల లక్ష్యంతో ఇండ్ల నిర్మాణాన్ని సర్కార్ చేపట్టింది. ఇది సాధ్యమేనా? కేంద్ర నిధులు రావాలంటే మోడీ బొమ్మ ఇండ్లపై పెట్టాలంట! అందుకు కాంగ్రెస్ అంగీకరిస్తుందా? దీంతో కేంద్రం నిధులు ప్రకటించినా ఇచ్చే అవకాశం లేదు! గతేడాది కూడా నిధులు కేటాయించింది తప్ప ఇండ్ల నిర్మాణం ఎక్కడా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లు కీలకమైనవి. అవాసాలు లేని పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దెలు చెల్లించలేకపోతున్నారు. వారి కుటుంబ ఆదాయంలో నలభై శాతం అద్దెలకే చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఇండ్లు కేటాయించినవారిలో అసలు అర్హులు ఉన్నారా?అన్నది సర్వే చేయాలి. తర్వాత అర్హులను ఎంపికచేసి 2027 మార్చి నాటికి ఇండ్ల నిర్మాణం పూర్తిచేయాలి.

## దళితులకు భూమి కొనుగోలు పథకం

ప్రతి దళితునికి మూడెకరాల భూమి ఉండే విధంగా, ప్రభుత్వ భూములు లేనిచోట ప్రయివేటుగానైనా కొనుగోలు చేసి ఇవ్వాలని 1983లో ఈ పథకాన్ని ప్రారంభించారు. 2014వరకు 25వేల ఎకరాలు కొనుగోలు చేసి ఇచ్చారు. దీనికి రూ.700 కోట్లు ఖర్చయ్యాయి. భూపంపిణీ చేయాలని 2004లో జరిగిన ఆందోళనల ఫలితంగా నాటి సీఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ఏడు విడతలుగా 6.85 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఈ పంపిణీలో దళితులకు యాభై శాతం, బీసీలకు 25శాతం, ఓసీ పేదలకు 25శాతం అందజేశారు. తర్వాత కూడా ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ప్రారంభించింది. వారి దశాబ్దకాలం పాలనలో (2014-2023)లో 6,242 మందికి 15,575 ఎకరాల భూమిని రూ.678కోట్లకు కొనుగోలుచేసి పంపిణీ చేసింది. ఆ తర్వాత ఈ పథకాన్ని మూసివేసింది. గత కాంగ్రెస్ హయాంలో (2014కు పూర్వం) కోనేరు రంగారావు కమిషన్ పేదలకు భూములు పంపిణీ చేయడానికి 130 సూచనలు చేసింది. ఇందులో 110 సూచనలను ప్రభుత్వం అంగీకరించింది. కానీ, వాటిని నాటి సర్కార్ అమలు చేయలేదు. నేడు కూడా అదే పరిస్థితి ఉంది. భూములు సర్వే చేస్తామని అన్ని ప్రభుత్వాలు చెప్పటమే తప్ప ఆ వైపు అడుగులు వేయడం లేదు. రాజకీయ పార్టీలు తమ నాయకులు భూ కుంభకోణాల్లో ఉండడం చేత సర్వేచేస్తే వారినుంచి వ్యతిరేకత వస్తుందని పట్టించుకోవడం లేదు. భూ చట్టాలు ఘోరంగా ఉల్లంగించబడుతున్నాయి. దళిత, గిరిజన, బీసీల పేర్లు చెప్పి బినామీ పేర్లతో అనేక పథకాల కింద భూములను పెద్దలు కాజేస్తున్నారు. నేడు తెలంగాణలో "ఫాంహౌస్" సంస్కృతి కొనసాగుతున్నది. పాలకవర్గ శాసనసభ్యులు, మంత్రులు ఇందులో ఎందరు పాల్గొన్నారన్న వాస్తవాలు వెలికి రావడానికి భూ సర్వే ఒక్కటే కీలకం. పేదలకు కనీసం 200ల చ.గ ఇండ్ల స్థలం పంచాలి.రాబోయే మూడేండ్ల కాలంలో ఎన్ని ఇండ్లు నిర్మించి ఇస్తారో కూడా స్పష్టంగా ప్రకటించాలి.

> 2025-26లో రాష్ట్ర బడ్జెట్ రూ.8,561 కోట్లు మాత్రమే కేటాయించింది. కేంద్రం రూ.4,005 కోట్లు ప్రకటించింది. మొత్తం రూ.12,670 కోట్లకు చేరినా ఈ నిధులతో 4.5 లక్షల లక్ష్యంతో ఇండ్ల నిర్మాణాన్ని సర్కార్ చేపట్టింది. ఇది సాధ్యమేనా? కేంద్ర నిధులు రావాలంటే మోడీ బొమ్మ ఇండ్లపై పెట్టాలంట! అందుకు కాంగ్రెస్ అంగీకరిస్తుందా? దీంతో కేంద్రం నిధులు ప్రకటించినా ఇచ్చే అవకాశం లేదు! గతేడాది కూడా నిధులు కేటాయించింది తప్ప ఇండ్ల నిర్మాణం ఎక్కడా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లు కీలకమైనవి. అవాసాలు లేని పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దెలు చెల్లించలేకపోతున్నారు. వారి కుటుంబ ఆదాయంలో నలభై శాతం అద్దెలకే చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఇండ్లు కేటాయించినవారిలో అసలు అర్హులు ఉన్నారా?అన్నది సర్వే చేయాలి.

## భూపంపిణీ సర్కార్ బాధ్యత

ఇండ్లు, ఇండ్ల స్థలాలు ప్రత్యేక కార్యక్రమంగా ప్రభుత్వం కొనసాగించాలి. అవాసాలు లేకుండా ఏ పేదవాడు ఉండరాదు. కనీసం చిన్న ఇల్లు ఉండటం నేటి సమాజంలో "స్టేటస్"గా భావిస్తారు. పేద కుటుంబాల్లోని స్త్రీ, పురుషులకు వివాహం కావాలన్న ఇల్లు తప్పనిసరి. ఉద్యోగం ఉన్నప్పటికీ ఇల్లుందా? లేదా? అనే కోణంలో విచారిస్తున్న పరిస్థితి. అందువల్ల ఈ ప్రభుత్వం తక్షణమే గ్రామాల్లో సర్వే చేసి ఇండ్ల నిర్మాణానికి కార్యక్రమం చేపట్టాలి. ప్రతి గ్రామంలో పేదలతో కమిటీలు వేయాలి. ఎవరికి ఇండ్లు పంచేది గ్రామంలో బహిరంగంగా, గ్రామ పంచాయతీలో ప్రకటించాలి. గ్రామసభలో ఇండ్లు లేని వారిని గుర్తించాలి. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెబుతున్నప్పటికీ ఎక్కడ చూసినా భూముల ధరలు మాత్రం విపరీతంగా పెరిగాయి. అందువల్ల భూ సంస్కరణలు అమలు చేయాలి. పేదలు వంద గజాలు కూడా కొనని పరిస్థితి ఉన్నది. భూమి కొనుగోలుకు బదులుగా ప్రభుత్వ భూములు సర్వేచేసి అక్రమణలో ఉన్న భూములను బయటకు తీసి పేదలకు పంచాలి. 1975లో సీలింగ్ చట్టం వచ్చినప్పుడు ప్రభుత్వం సేకరిం చిన భూమిలో 89వేల ఎకరాలు ఇంకా పంపిణీ కాకుండా ఉంది. భూస్వాములు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఆ కేసులను పరిష్కరించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాలి. భూ పంపిణీకి కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. అది ప్రభుత్వ బాధ్యత. లేదంటే ప్రజలు ఉద్యమాల ద్వారానే ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించుకోవాలి. ■

---

# మోడీకి "విగ్రహారాధన" మోజెందుకు?



డా.కోలాహలం రామ్ కిశోర్
9849328496

నరేంద్రమోడీ 2014 నుంచి భారత ప్రధానమంత్రిగా ఉన్నకాలం స్వీయ-ప్రచార రంగస్థలంగా మారింది. ఇది నాయకత్వంతో పాటు దైవత్వం మధ్య గీతను అస్పష్టం చేస్తోంది. అభివృద్ధి, "అచ్చేదిన్" అనే వాగ్దానంతో మొదలైన ఈ ప్రయాణం క్రమంగా వ్యక్తిత్వ పూజగా రూపాంతరం చెందింది. ఆయన రూపం భారత జీవనంలో ప్రతి మూలనూ ఆక్రమించింది. హోర్డింగ్‌లు, రైల్వే స్టేషన్లు, వ్యాక్సిన్ సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాల పత్రాలు, సోషల్ మీడియా వేదికలు ఎక్కడ చూసినా మోడీ ముఖమే కనిపిస్తుంది. ఈ సర్వవ్యాప్తి సహజంగా ఏర్పడినది కాదు.ఇది అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు, బీజేపీ ఐటీ సెల్‌లు, విధేయ మీడియా వ్యవస్థల ద్వారా రూపొందిన ఒక ఉద్దేశపూర్వక వ్యూహం. ఈ వ్యాసం దేశ, విదేశాల్లోని విమర్శలను కూడా పరిశీలిస్తుంది. మోడీ ఫోటో-ప్రదర్శన సంస్కృతి, దైవిక వ్యక్తిగా అతిశయోక్తి చిత్రణ, అతని మానసికస్థితిని భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా చూపిస్తుంది. మోడీ ఆర్థిక సంస్కరణలు, గుజరాత్ మోడల్, బలమైన హిందూవాదంతో అధికారంలోకి వచ్చారు. కానీ, కాలక్రమంలో ఇది స్వీయ-మహిమ వైపు మళ్లింది. విమర్శకులు ఆయన నాయకత్వ శైలిని నార్సిసిజంతో నిండినదిగా భావిస్తారు. 2015లో ఆయన పేరుతో బంగారు అక్షరాలతో కూడిన సూట్ ధరించడం, లేదా యోగా దినోత్సవం, గంగా ఆరతి వంటి కార్యక్రమాల్లో మెస్సయ్యలా కనిపించే ఫొటో సెషన్లు దీనికి ఉదాహరణలు. విదేశీ పత్రికలు, ఉదాహరణకు ది గార్డియన్, 2023లో బీబీసీ కార్యాలయాలపై దాడులు, యామ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి ఎన్జీఓలను దేశం నుంచి తొలగించడం వంటి సంఘటనలను అసహనం, అధికారవాద ధోరణికి రుజువుగా చూపాయి. భారత్‌లో, అరుణ్‌శౌరి వంటి ఆరెస్సెస్ జర్నలిస్టులు సైతం ఆయన్ని "నటుడు" అని వ్యంగ్యంగా పిలిచారు. ఆయన పాలనలో ఇమేజ్‌ను సారానికి మించి పెంచారని విమర్శించారు. అయినప్పటికీ, సమర్థకులు దీన్ని జనసామాన్యంతో నేరుగా సంబంధం ఏర్పరచుకునే కరిష్మాగా చూస్తారు.

కానీ ప్రశ్న ఉత్పన్నమవుతుంది: ఈ వ్యక్తిగత ప్రదర్శన ఏ ధరకు వస్తోంది? మోడీ దైవత్వం 2024 ఎన్నికల్లో గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఒక ఇంటర్వ్యూలో ఆయన జీవశాస్త్రీయంగా జన్మించలేదని, దేవుడు తనను పంపినట్లు చెప్పారు.ఇది హిందూ ఓటర్లను ఆకర్షించే ఒక రాజకీయ ఉపాయంగా విమర్శకులు భావించారు. ఇటీవల ఒక హిందీ పుస్తకం ఆయన్ని ఛత్రపతి శివాజీ మహారాజ్‌తో సమానం చేసింది, ఇది మహారాష్ట్రలో తీవ్ర వివాదానికి దారితీసింది. శివాజీ, ఒక స్వాతంత్ర్య సమర యోధుడు, అతని వారసత్వాన్ని రాజకీయ లాభం కోసం వాడుకోవడం ప్రజల ఆగ్రహాన్ని రేకెత్తించింది. బీజేపీ దీన్ని రచయిత వ్యక్తిగత అభిప్రాయమని చెప్పి విమర్శల నుంచి తప్పించుకుంది. కానీ చరిత్రను వక్రీకరించే ఈ ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. ఇదే సమయంలో, ప్రతి కేంద్ర పథకంపై ఆయన ఫొటో ఉంటుంది. 2021లో కోవిడ్-19 వ్యాక్సిన్ సర్టిఫికెట్లపై కూడా ప్రజల ఆగ్రహాన్ని రేకెత్తించింది. భారత చరిత్రలో ఏ ప్రధానమంత్రి నెహ్రూ, ఇందిరా గాంధీలు కూడా ఇంతగా తమ చిత్రాలను ప్రదర్శించలేదు.'ది వైర్' వంటి భారతీయ మీడియా సంస్థలు దీన్ని అసురక్షత సంకేతంగా చూస్తున్నాయి, విధాన వైఫల్యాలను దాచడానికి ఈ ఫొటో సంస్కృతిని ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ది న్యూయార్క్ టైమ్స్ దీన్ని అధికార కేంద్రీకరణ వ్యూహంగా చిత్రీకరించింది, న్యాయవ్యవస్థ, పత్రికాస్వేచ్ఛను అణచివేస్తూ ఒక అపరాజిత వ్యక్తిత్వాన్ని ప్రాజెక్ట్ చేయడం దీని లక్ష్యమని పేర్కొంది.



ఈ పరిణామాలు మోడీ మానసిక స్థాయి గురించి ఏమి చెబుతాయి? మనస్తత్వవేత్తలు దూరం నుంచి నిర్ధారణ చేయడానికి విముఖత చూపవచ్చు, కానీ ఆయన చర్యలు ఒక విషయాన్ని సూచిస్తాయి. అతను తన వారసత్వంపై మోహంతో, సర్వవ్యాప్తి ద్వారా అమరత్వం సాధించాలనే తపనతో ఉన్నాడు. ఆయన ప్రసంగాలు అర్ధసత్యాలు, గొప్ప వాగ్దానాలతో నిండి ఉంటాయి. పేదరికం తొలగిందని చెప్పడం, కానీ లక్షలాది మంది ఇంకా దారిద్ర్యంలో ఉన్నారు. భారత్ గ్లోబల్ శక్తిగా ఎదిగిందని చెప్పడం, కానీ మైనారిటీలపై హింస పెరుగుతోంది. హ్యూమన్ రైట్స్ వాచ్ 2024 ఎన్నికల ప్రచారంలో ఆయన 110 ఇస్లామోఫోబిక్ వ్యాఖ్యలను గుర్తించింది. ఇది భయాన్ని రేకెత్తించి అధికారాన్ని స్థిరపరచే వ్యూహంగా విమర్శకులు భావిస్తున్నారు. ఇది ఒక రాజనీతిజ్ఞుడి ప్రవర్తన కాదు, ఒక ప్రదర్శకుడిది. జవాబుదారీ తనంకంటే ఆరాధనపై ఆధారపడేవాడు. అదానీ మీడియా సామ్రాజ్యం, ఎన్డీటీవీని 2022లో స్వాధీనం చేసుకున్న తర్వాత, ఈ ప్రచారాన్ని మరింత తీవ్రతరం చేసింది, విమర్శలను అణచివేస్తూ గొప్పగా చిత్రీకరించే కథనాలను వెల్లువిరిపించింది. మోడీపై భారత ప్రజల అంధ విశ్వాసం, ఈ విమర్శలు ఉన్నప్పటికీ, ఆయన ప్రచార యంత్రాంగం సమర్థతను చూపిస్తుంది. సంక్షేమ పథకాలు, లోపాలతో కూడినవైనా, రాష్ట్రం నుంచి కాక, ఆయన వ్యక్తిగత బహుమతులుగా మార్కెట్ చేయబడతాయి. కానీ, ఈ ఆరాధన సంస్కృతి భారత భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది. ప్రజాస్వామ్యం పరిశీలనపై వృద్ధి చెందుతుంది, ఆరాధనపై కాదు, సమిష్టి పురోగతిపై, వ్యక్తిగత మహిమపై కాదు. మోడీ మానసిక సామర్థ్యం తెలివైనది, కానీ మాయాజనకమైనది.ఎన్నికలను గెలిచి ఉండ వచ్చు, కానీ ఇది ఒక వక్రీకృత గుర్తింపుతో దేశాన్ని వదిలివేస్తోంది. 'ది హిందూ' సూచించినట్లు, ఈ మాయ తొలగినప్పుడు ఆయన కుర్చీ కదలవచ్చు, కానీ అప్పటివరకు, ఈ ఫొటో ప్రదర్శన కొనసాగుతుంది. సారం కంటే తమాషాను కోరుకునే దేశంలో ఇది ఒక 'దైవిక మాయ.' ■

> ఈ పరిణామాలు మోడీ మానసిక స్థాయి గురించి ఏమి చెబుతాయి? మనస్తత్వవేత్తలు దూరం నుంచి నిర్ధారణ చేయడానికి విముఖత చూపవచ్చు, కానీ ఆయన చర్యలు ఒక విషయాన్ని సూచిస్తాయి. అతను తన వారసత్వంపై మోహంతో, సర్వవ్యాప్తి ద్వారా అమరత్వం సాధించాలనే తపనతో ఉన్నాడు. ఆయన ప్రసంగాలు అర్ధసత్యాలు, గొప్ప వాగ్దానాలతో నిండి ఉంటాయి. పేదరికం తొలగిందని చెప్పడం, కానీ లక్షలాది మంది ఇంకా దారిద్ర్యంలో ఉన్నారు. భారత్ గ్లోబల్ శక్తిగా ఎదిగిందని చెప్పడం, కానీ మైనారిటీలపై హింస పెరుగుతోంది.హ్యూమన్ రైట్స్ వాచ్ 2024 ఎన్నికల ప్రచారంలో ఆయన 110 ఇస్లామోఫోబిక్ వ్యాఖ్యలను గుర్తించింది. ఇది భయాన్ని రేకెత్తించి అధికారాన్ని స్థిరపరచే వ్యూహంగా విమర్శకులు భావిస్తున్నారు. ఇది ఒక రాజనీతి జ్ఞుడి ప్రవర్తన కాదు, ఒక ప్రదర్శకుడిది. జవాబుదారీ తనంకంటే ఆరాధనపై ఆధారపడేవాడు.

# విద్యాశాఖను ప్రక్షాళన చేస్తాం

## నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో అట్టడుగున తెలంగాణ

ఇప్పటికైనా మేల్కొనకపోతే ద్రోహం చేసినవాళ్లమవుతాం

భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుంది

ఒక్కో విద్యార్థిపై సర్కారు బడుల్లో

రూ.1.08 లక్షలు, గురుకులాల్లో రూ.96 వేలు ఖర్చు

లోపం ఎక్కడుందో సమగ్రంగా అధ్యయనం చేయాలి

త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ విధివిధానాలు ప్రకటిస్తాం

కొత్తగూడెంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు

విద్యావిధానం రూపకల్పన కోసమే విద్యాకమిషన్

అందరితో చర్చించాకే తుది నిర్ణయం తీసుకుంటాం

త్వరలో అఖిలపక్ష సమావేశం

నిధుల కేటాయింపు కాదు అందరూ సామాజిక బాధ్యత తీసుకోవాలి

మంత్రివర్గ విస్తరణ తర్వాత కూడా ఈ శాఖను నేనే పర్యవేక్షిస్తా : శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

విద్యాశాఖను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021లో మూడు, ఐదో తరగతి విద్యార్థుల ప్రతిభ నిరాశాజనకంగా ఉందన్నారు. ఈ సర్వేలో దేశంలోనే అట్టడుగున తెలంగాణ నిలవడం ఆందోళనకరమని అన్నారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే ద్రోహం చేసినవాళ్లమవుతామనీ, భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణలో విద్యారంగంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. వాణీదేవి, ఏవీఎన్ రెడ్డి, యెగ్గె మల్లేశం, బల్మూరి వెంకట్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న, భానుప్రసాదరావు, కూర రఘోత్తంరెడ్డి మాట్లాడారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో మూడో తరగతి, ఐదో తరగతి చదివేవారిలో 75 శాతం మంది విద్యార్థులు ఏ సబ్జెక్టులో కనీస ప్రాథమిక సామర్థ్యం కూడా చూపలేదని వివరించారు. సబ్జెక్టులవారీగా దేశంలో 37 ర్యాంకుల్లో తెలంగాణ 36వ స్థానంలో ఉందన్నారు. మూడో తరగతికి సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో తెలంగాణది 36వ ర్యాంకు, గణితంలో 35వ ర్యాంకు, ఈవీఎస్‌లో 36వ ర్యాంకు సాధించిందని చెప్పారు. ఐదో తరగతికి సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో తెలంగాణ 36వ ర్యాంకు, గణితంలో 35వ ర్యాంకు, ఈవీఎస్‌లో 36వ ర్యాంకు సాధించిందని అన్నారు. మూడో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలను చదవగలిగినవారు 2018లో 18.1 శాతం, 2022లో 5.2 శాతం, 2024లో 6.3 శాతం నమోదైందని వివరించారు. ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలను చదవగలిగిన వారు 2018లో 43.6 శాతం, 2022లో 31.7 శాతం, 2024లో 31.5 శాతం ఉందని చెప్పారు. మూడో తరగతి విద్యార్థులు రెండో తరగతి లెక్కలు చేసిన వారు 2018లో 34.5 శాతం, 2022లో 28.7 శాతం, 2024 లో 31.0 శాతం నమోదైందని అన్నారు. ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి లెక్కలు చేసిన వారు 2018లో 48.7 శాతం, 2022లో 44.6 శాతం, 2024లో 41.1 శాతం ఉందని చెప్పారు.

**10 ఏండ్లలో సర్కారు బడుల్లో 6.50 లక్షల మంది తగ్గుదల**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పదేండ్లలో (2014 నుంచి 2024 వరకు) విద్యార్థుల సంఖ్య 6.50 లక్షల మంది తగ్గారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 10 వేల మంది ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని వివరించారు. 21 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామని చెప్పారు. 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు ఎలాంటి ఆరోపణలు లేకుండా పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో 26,106 ప్రభుత్వ పాఠశాలల్లో 16,86,343 మంది విద్యార్థులున్నారని అన్నారు. వారి కోసం బడ్జెట్‌లో రూ.19,341 కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గురుకుల విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థిపై రూ.96 వేలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం ఎక్కడ విఫలమైందని ప్రశ్నించారు. ప్రయివేటు పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై వారి తల్లిదండ్రులు ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేస్తారని గుర్తు చేశారు. విద్యా ప్రమాణాలు పడిపోవడంపై కేవలం ప్రభుత్వమే కాదు తెలంగాణ సమాజం కూడా బాధ్యత వహించాలని కోరారు. విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో రూ.23,108 (8 శాతం) కోట్లు కేటాయించామనీ, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. విద్యా ప్రమాణాల విషయంలో ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరముందన్నారు. ప్రక్షాళన మొదలు పెడదామంటే రాజకీయ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. రాజకీయ కోణంలో ఆలోచన చేసినన్ని రోజులు ప్రక్షాళన చేయలేమని చెప్పారు.

**నైపుణ్యం పెంచడం కోసమే స్కిల్స్ వర్సిటీ**

సమాజంలో అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యం కొరవడుతున్నదని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యునివర్సిటీ, అకాడమీని ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలోనే స్పోర్ట్స్‌కు సంబంధించి విధివిధానాలను ప్రకటిస్తామని అన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి చెప్పి వంద నియోజకవర్గాల్లో వంద ఏటీసీలను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. త్వరలోనే మల్లెపల్లిలో దీన్ని ప్రారంభిస్తామన్నారు. విద్యావ్యవస్థపై రాతపూర్వక సూచనలను సభ్యులు ఇవ్వాలనీ, అందరి సూచనలు, సలహాలతో విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తామన్నారు. అందరి సూచనలతో విద్యావిధానం నివేదికను రూపొందిస్తామనీ, దానిపైనా చర్చిస్తామని చెప్పారు. నిర్మాణాత్మకంగా అందరూ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమగ్ర విద్యావిధానం రూపొందించడం కోసమే విద్యాకమిషన్‌ను నియమించామని వివరించారు. ఇప్పుడు నిర్ణయం తీసుకోకపోతే ఇక ఎప్పుడూ ప్రక్షాళన చేయలేమని అన్నారు. విద్యారంగాన్ని పటిష్టం చేస్తామన్నారు. విద్యారంగానికి నిధుల కేటాయింపు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం కాదనీ, ప్రజాప్రతినిధులందరూ సామాజిక బాధ్యతగా భావిస్తేనే సమస్యను పరిష్కరించగలమని అన్నారు. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని చెప్పారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా చేస్తామన్నారు. రాష్ట్రంలో విద్యావిధానం ఆందోళనకరంగా ఉందని చెప్పారు. దీన్ని ఎక్కువ కాలం కప్పిపుచ్చుకుంటే పేదలను తీరని అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. చదువు ఎన్ని అవకాశాలను ఇస్తుందో పేదలకు విద్య ఎంత అవసరమో ప్రభుత్వ పాఠశాలలో చదివిన తనకు బాగా తెలుసని అన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత కూడా విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకుని పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు.

**సర్కారు బడుల్లో పిల్లలను చదివిస్తేనే స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించిన వారే అర్హులు అన్న నిబంధనను పెట్టాలంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సూచించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇది నిర్ణయం కాదనీ, చర్చకు పెడుతున్నానని చెప్పారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రభుత్వ బడుల్లో చదవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకుని ఆ మాట తాను అనలేనని అన్నారు. ప్రజల సౌకర్యం, పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యక్తిగత ఇష్టాఇష్టాలతో సంబంధం లేదని చెప్పారు.

**ఏప్రిల్ నుంచి 12 విడతల్లో ఫీజు బకాయిలు చెల్లిస్తాం**

వచ్చే నెల నుంచి 12 విడతల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీ యాజమాన్యాలు ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని అన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెగ్యులర్‌గానే ఫీజులను ఇస్తామని వివరించారు. బీఆర్ఎస్ సభ్యులు కవిత అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎలాంటి పేరు లేదన్నారు. అందుకే జైపాల్‌రెడ్డి పేరు పెట్టామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు జైపాల్‌రెడ్డి పేరు పెడతామని అన్నారు. పివి తర్వాత ఆ స్థాయి వ్యక్తి జైపాల్‌రెడ్డి అని చెప్పారు.

## యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అరెస్టు అక్రమం : కేవీపీఎస్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఇండ్ల స్థలాలను, రోడ్లను, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం భూ కబ్జాదారని విమర్శించారు. ఆ సంస్థపై కేసు నమోదు చేయాలనీ, పేదల ఇండ్ల స్థలాలకోసం ఆ భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల హక్కుదారులను అరెస్టు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. రామోజీ ఫిలింసిటీ వద్ద నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ వాటిని ఆక్రమించి చుట్టూ గోడ నిర్మించిందని పేర్కొన్నారు. తమ స్థలాల్లోకి వెళ్ళిన 75 మంది పేదలపై అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందని గుర్తు చేశారు. పేద ప్రజలకు వారి ఇంటి స్థలాలను అప్పగించి, ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు

## నిమ్స్‌లో గుండెమార్పిడి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏండ్ల యువకుడికి నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ అమరేశ్ రావు నేతృత్వంలోని వైద్య బృందం ఈ నెల 7న శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రిలో పోస్ట్ ఆపరేషన్ సేవలతో అతను పూర్తి కోలుకుకోవడంతో డిశ్చార్జి చేసినట్టు డాక్టర్ గోపాల్, డాక్టర్ కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సిబ్బందిని అభినందించారు. ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా గుండె మార్పిడి చేశారు.



## మళ్లీ బాదుడుకు రెడీ..!

మొబైల్ రీచార్జి ధరలను టెల్కోలు పెంచొచ్చు

ఇప్పటికే ఐదేండ్లలో ఆదాయం రెట్టింపు : సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రిపోర్ట్

**న్యూఢిల్లీ :** టెలికం కంపెనీలు మరింత మొబైల్ రీచార్జి ధరలను పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఆయా సంస్థలు తమ విని యోగదారుల సగటు రెవెన్యూ (ఏఆర్‌పీయూ) పెంచుకునే ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించింది. ఇంతక్రితం 2019 డిసెంబర్, 2021 నవంబర్, 2024 జులైలో టారిఫ్‌లను పెంచిన విషయాన్ని గుర్తు చేసింది. చార్జీల పెంపునతో వినియోగదారులపై భారం పెరిగింది. మళ్లీ పెంచడం ద్వారా మరింత భారం పడనుందని విశ్లేషిం చింది. అధిక చార్జీల కారణంగా కంపెనీలకు ఆదాయం మరింత సమకూర నుందని పేర్కొంది. సెంట్రల్ రీసెర్చ్ రిపోర్ట్ ప్రకారం.. టెలికం రంగంలో పోటీ తీవ్రత తగ్గింది. పెట్టుబడి, కస్టమర్ డేటా వినియోగాన్ని పరిగణలోకి తీసుకుంటే పరిశ్రమ రాబడి తక్కువగా ఉందని మోతీలాల్ ఓస్వాల్ గతంలో చెప్పింది. ఈ క్రమంలో రాబోయే సంవత్సరాల్లో కంపెనీలు టారిఫ్ ధరలను మరింత పెంచనున్నాయి. కాగా.. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలందించే స్టార్‌లింక్ భారత్‌లోకి ప్రవేశించడానికి ఇప్పటికే ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియాతోనూ చర్చలు జరుపుతుంది. స్టార్‌లింక్ మార్కెట్‌లో నియంత్రణ అడ్డంకులు, ధరల కారణంగా భారత్‌లో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.

**తగ్గిన మూలధన వ్యయాలు..**

"గత ఐదేండ్లలో టెలికాం కంపెనీల ఆదాయం దాదాపు రెట్టింపు అయింది. కంపెనీల ఆదాయం మెరుగుపడుతోంది. నిర్వహణ ఖర్చుల స్థిరీకరణతో పాటు మార్జిన్స్ పెరుగుతున్నాయి. 5జీ సేవలు వచ్చిన తర్వాత కంపెనీలు తమ మూలధన వ్యయాలను తగ్గించాయి. 4జీ, 5జీ వినియోగదారులు పెరుగుతున్న నేపథ్యంలో 2జీ వినియోగదారుల సంఖ్య తగ్గుతోంది. రాబోయే ఐదారేండ్లలో ఈ సంఖ్య మరింత తగ్గనుంది. ప్రస్తుతం 25కోట్ల మంది 2జీ సేవలను ఉపయోగిస్తున్నారు. ఈ విభాగంలో వొడాఫోన్ ఐడియా అత్యధికంగా 40శాతం, ఎయిర్‌టెల్‌కు 23శాతం వాటా ఉంది. ఇటీవల ఇంటర్నేషనల్ రోమింగ్, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ వంటి సేవలు సైతం గణనీయంగా పెరిగాయి." అని సెంట్రమ్ రీసెర్చ్ పేర్కొంది. గతేడాది జులైలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా దాదాపు 28 శాతం వరకు టారిప్‌లను పెంచిన విషయం తెలిసిందే. మరోమారు పెంచడమంటే వినియోగదారులపై తీవ్ర భారం మోపడమేననే ఆందోళనలు వ్యక్తం అవుతోన్నాయి.

## స్వీట్ వన్ షాప్ నేడే ప్రారంభం

నిజాంపేటలో సినీనటి నాగళ్ల అనన్య చేతుల మీదుగా..

సాంప్రదాయ రుచులతో స్వీట్లు, కారా విక్రయం



**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

నిజాంపేట్ లో స్వీట్ వన్ షాప్ ప్రముఖ సినీనటి నాగళ్ళ అనన్య చే గురువారం ప్రారంభిస్తున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లా డుతూ... తమ షాపులో సాంప్రదాయ రుచితో కూడిన అన్ని రకాల స్వీట్లు కాకినాడ కాజా మడత కాజా, లడ్డు, జిలేబీ ,అరిసెలు విక్రయిస్తామన్నారు. అదేవిధంగా ప్రారంభోత్సవం సందర్భంగా 199 రూపాయలకే కిలో స్వీట్ అందిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. మా స్వీట్ వన్ షాప్ లో స్వచ్ఛతకు నాణ్యతకు మన్నికైన సీట్లను అందిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిజాంపేట్ ప్రజలు వినియోగించు కోవాలని, మేం ఇచ్చే ఆఫర్ ని అందుకోవాలని ఆయన కోరారు.

## యూనివర్సిటీ భూముల పరిరక్షణకు బీఆర్ఎస్ మద్దతు

విద్యార్థులకు సంఘీభావం తెలిపిన కేటీఆర్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు బీఆర్ఎస్ అండంగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో యూనివర్సిటీకి చెందిన పలు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఆయనతో భేటీ అయ్యారు. భూముల పరిరక్షణకు చేస్తున్న ఆందోళనకు తమ పార్టీ పూర్తి మద్దతిస్తుందని ఈ సందర్భంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే భూములను యూనివర్సిటీ వినియోగం కోసం ఇచ్చిందనీ, ఇప్పుడు అదే పార్టీ ప్రభుత్వం వాటిని వేలం వేయడం ద్వారా అన్యాయం చేస్తోందని కేటీఆర్‌కు వారు వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర సెంట్రల్ యూనివర్సిటీలకు ఉద్యమాన్ని తీసుకెళ్లాలని కేటీఆర్ వారికి సూచించారు. యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో, ఈ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లేందుకు మద్దతు అందిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. బ్యాకరి కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి జీవవైవిధ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలి

తరగతికి ఒక గది, టీచర్ ఉండాలి

కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలి : మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పారు. ప్రభుత్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. తరగతికి ఒక గది, టీచర్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణలో విద్యారంగంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య అందరికీ చదువు చెప్దామా?, కొందరికే చెప్దామా?అనేది నిర్ణయించాలని చెప్పారు. పదేండ్ల నుంచి గమనిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 24.85 లక్షల నుంచి 16.85 లక్షల మంది విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. 2018 తర్వాత విద్యారంగంపై ఇప్పుడే చర్చ జరుగుతున్నదని అన్నారు. పాఠశాలల్లో 60 లక్షల మంది విద్యార్థులున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 22 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. ప్రయివేటు బడుల్లో 34 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. హైదరాబాద్ రెవెన్యూ జిల్లాలో ఎనిమిది లక్షల మంది, రంగారెడ్డిలో 6.56 లక్షల మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6.30 లక్షల మంది చొప్పున ఈ మూడు జిల్లాల్లోనే 21 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. యువ దంపతులు పట్టణాలు, నగరాలకు వలస పోతున్నారని అన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వ విద్యాసంస్థలను నెలకొల్పాలని సూచించారు. ములుగు జిల్లాలో 40,500 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. 33 జిల్లాల్లో పది జిల్లాల్లో లక్షలోపు పిల్లలు చదువుతున్నారని వివరించారు. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలంలో 1.11 లక్షల మంది విద్యార్థులున్నారని అన్నారు. పర్యవేక్షణ వ్యవస్థ ఎలా ఉండాలో పరిశీలించాలని కోరారు. తరగతి గదినైనా సమానంగా చేద్దామా? వద్దా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్కూళ్లలో ఒకరకంగా, ప్రయివేటు పాఠశాలల్లో మరోరకంగా ఉన్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ కాలేజీలకు రూ.45 వేల నుంచి రూ.1.63 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచడంపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో మూడు నుంచి ఆరేండ్ల వరకు పిల్లలు ప్రయివేటు బడుల్లోనే 80 శాతం వరకు ఉంటారని వివరించారు. దీనిపై దృష్టిపెట్టాలని కోరారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కాలేజీలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 12 ఏండ్లుగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని భర్తీ చేయాలని కోరారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని చెప్పారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 16 రకాల వస్తువులతో రేవంత్‌రెడ్డి స్కూల్ కిట్‌ను ఇవ్వాలని సూచించారు. టీజేఎస్ సభ్యులు కోదండరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక విద్య లోపభూయిష్టంగా ఉందన్నారు. పునాది గట్టిగా లేదని చెప్పారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని చెప్పారు. విద్యారంగంలో అట్టడుగున్న ఉన్న తెలంగాణ అగ్రస్థానంలోకి వచ్చేలా ప్రయత్నం చేయాలని సూచించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఆర్టీఈని అమలు చేయాలనీ ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడలేదని వివరించారు. పదేండ్లపాటు విద్యారంగాన్ని విధ్వంసం చేయలేదని అన్నారు. విద్యాకమిషన్ రాజకీయ కమిషన్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ వచ్చాక 1,913 స్కూళ్లు మూతపడ్డాయని అన్నారు. హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్‌ను నాశనం చేసినట్టు ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చి ప్రయివేటు విద్యారంగాన్ని నాశనం చేయొద్దని కోరారు. కాంగ్రెస్ సభ్యులు జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడం వల్లే ప్రయివేటు బడులకు పిల్లలను పంపుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వాసాన్ని పెంచాలని కోరారు. భానుప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించాలని సూచించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంచడంపై దృష్టిపెట్టాలని కోరారు. ఆర్టీఈ ప్రకారం ఆరేండ్ల పిల్లలకు ప్రవేశాలు కల్పించాలన్నారు. మూడు నుంచి ఆరేండ్ల వరకు పిల్లలు ఏం చేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులకు అవకాశం లేనందున ప్రయివేటు పాఠశాలలకు పంపిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ బడి ఉన్న కిలోమీటర్‌లోపు ప్రయివేటు పాఠశాలకు అనుమతి ఇవ్వొద్దన్న నిబంధన ఉందనీ, దాన్ని ఉల్లంఘించి అనుమతులు పొందుతున్నారని చెప్పారు. ప్రాథమిక విద్యపై కేంద్రీకరించాలనీ, ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని సూచించారు.

**ప్రభుత్వ విద్యకు బ్రాండ్ కల్పిస్తాం : దామోదర రాజనర్సింహ**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి బ్రాండ్ కల్పిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. శాసనమండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యావైద్యంలో కార్పొరేట్ సంస్థల దోపిడీ పెరిగిపోయిందన్నారు. సేవ చేయాల్సిన ఆ సంస్థలు వ్యాపారం చేస్తున్నాయని అన్నారు. విద్యావైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఉగాది నుంచి సన్నబియ్యం

(మొదటిపేజీ తరువాయి)

సన్న బియ్యాన్ని అందించనున్నామని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. బియ్యంతో పాటు త్వరలో ఇతర నిత్యావసర వస్తువులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా అందించనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఏప్రిల్ నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. భౌతికంగా కార్డుల జారీలో ఆలస్యమైనా పోర్టల్‌లో పేరున్న వారికి సన్న బియ్యాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు ఉన్న వారు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. నీటి పారుదల ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో పెట్టిన నిధుల్లోంచి సగం వరకు గత ప్రాజెక్టులకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను ప్రభుత్వం సమ దృష్టితో చూస్తోందని తెలిపారు. నిధుల కేటాయింపులో ప్రాంతాల వారీగా ఎలాంటి వివక్షను పాటించడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమనీ, బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు



## టన్నెల్‌లో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

### ఊట నీటి పంపింగ్ ప్రక్రియ వేగవంతం

### పర్యవేక్షణ ప్రత్యేక అధికారి సమీక్ష

**నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో నిరంతరాయంగా మట్టితవ్వకాలు కొనసాగుతున్నాయి. ఊట నీటి పంపింగ్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఎస్కవేటర్లతో మట్టితవ్వకాలు చేస్తూ.. సహాయ చర్యలు ముమ్మరం చేశారు. ఉబికి వస్తున్న నీటి ఊటను అరికట్టడానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, పర్యవేక్షణ ప్రత్యేక అధికారి శివ శంకర్ బుధవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగిలిన ఆరుగురు కార్మికుల కోసం సహాయక చర్యల వేగవంతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు తెలిపారు. 4 ఎస్కవేటర్‌లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి తరలిస్తున్నట్టు, మట్టి తవ్వకాలకు అడ్డుపడుతున్న టీబీఎం భాగాలను తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్టు వివరించారు. టన్నెల్ లోపల 2.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 5 పంపింగ్ స్టేషన్‌ల ద్వారా నీటిని కృష్ణానదిలోకి పంపుతున్నట్టు చెప్పారు. మట్టి తవ్వకాల అనంతరం లోకో ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, జేపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కారును ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకులు మృతి

### సికింద్రాబాద్‌లో ఘటన

**నవతెలంగాణ-బేగంపేట**




సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు మహంకాళి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్ పేట డివిజన్‌కు చెందిన ప్రణయ్(18), హర్షిత్ (21) జీహెచ్ఎంసీ వేస్ట్ కంట్రోల్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 5 గంటలకు ఇద్దరూ కలిసి స్పోర్ట్స్ బైక్‌పై మహంకాళి పీఎస్ పరిధిలోని ఎస్డీ రోడ్డులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తా వద్ద అతివేగంగా స్విఫ్ట్ డిజైర్ కారును వారు ఢీకొట్టారు. దాంతో ప్రణయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. హర్షిత్‌ను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తిమ్మాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### భార్యాభర్తలు మృతి

### మృతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు







**నవతెలంగాణ-కొత్తూరు**

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద జాతీయ రహదారి-44పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్త ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు ప్రకారం.. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన పాండు(45), సక్కుబాయి(38) దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. సక్కుబాయి అమ్మగారి ఇల్లు కొందుర్గుకు వెళ్లిన వీరిరువురూ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు స్కూటీపై తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో తిమ్మాపూర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ బ్రేక్‌లు ఫెయిల్‌కావడంతో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా స్కూటీపై వెళ్తున్న దంపతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సక్కుబాయి అక్కడికక్కడే మృతిచెందింది. పాండును హైదరాబాద్‌లో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరగడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక సీఐ నరసింహారావు, ఎస్ఐలు మురళిగౌడ్, సత్యశీలరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు పాండు హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, అతని భార్య సక్కుబాయి మహేశ్వరం మండలంలోని ఎన్డీ తండాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుంది. వీరి మృతితో మహేశ్వరం మండల పంచాయతీ కార్యదర్శులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ తోటి ఉద్యోగి మృతి చెందడంతో వారు సంతాపం వ్యక్తం చేశారు.

## చేయూతకు గండి

(మొదటిపేజీ తరువాయి)

పేషెంట్స్ 4105 మంది, బీడీ టేకేదార్లు 3825 మందికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ చెల్లిస్తుంది.

**15 నెలల పాలనలో 2,16,804 పింఛన్లు రద్దు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీల్లో కొన్ని పథకాలను అమలు చేస్తూ వస్తున్నారు. అయితే పింఛన్ల విషయంలో ప్రభుత్వం కోత పెట్టిందన్న ప్రచారం జరుగుతోంది. ఇస్తామని చెబుతున్నా.. ఎప్పటినుంచి అన్నది మాత్రం చెప్పడం లేదు. ఇటీవల అసెంబ్లీలో ప్రకటన చేసినా స్పష్టత లేదు. రాష్ట్రంలో 11 రకాల పింఛన్లు కలిపి 2024 అక్టోబర్‌లో 44,49,767 మందికి చెల్లించారు. 2025 మార్చి నెలకు వచ్చే సరికి 42,51,331 మందికి మాత్రమే పింఛన్లు చెల్లిస్తున్నారు. మొదట్లో ఇచ్చిన పింఛన్లలో1,98,426 మందికి రద్దు చేశారు. అదే విధంగా 2024 అక్టోబర్ నాటికి రాష్ట్రంలో 5,14,422 మంది వికలాంగులకు ఆసరా పింఛన్లు చెల్లించారు. 2025 మార్చి నాటికి కేవలం 4,90,044 మందికే చెల్లిస్తున్నారు. ఈ ఐదు నెలల కాలంలోనూ 24,378 మంది వికలాంగుల పింఛన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని వికలాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

24.85 లక్షల మంది దరఖాస్తుదారుల ఎదురు చూపు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున తమకు పింఛన్లు మంజూరు అవుతాయని దరఖాస్తుదారులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తుల్ని స్వీకరించారు. అందులో చేయూత పథకం కిందపింఛన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 24.85 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 75 వేల మందికి పైగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసి సర్కార్ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

**పెరగని పింఛన్.. నెరవేరని ఎన్నికల హామీ**

అధికారంలోకి రాగానే పాత పింఛన్ డబ్బుల్ని పెంచి చెల్లిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో వికలాంగులకు రూ.4016 ఇస్తున్నందున అదనంగా రూ.2 వేలు కలిపి రూ.6016 చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇతర కేటగిరి పింఛన్‌దారులకు ఇస్తున్న రూ.2016కు అదనంగా రూ.2 వేలు కలిపి రూ.4016 ఇస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం.. పింఛన్ డబ్బుల్ని పెంచి చెల్లించాలని వివిధ రకాల పింఛన్‌దారులు ఆందోళనలు చేస్తున్నారు.

**పింఛన్ పెంచే వరకు ఉద్యమిస్తాం : ఎం.అడివయ్య, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

పింఛన్ డబ్బుల్ని పెంచి చెల్లించాలి. అప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగిస్తాం. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇతర పింఛన్లతో పాటు వికలాంగులకు సంబంధించిన 24,378 మందికి పింఛన్లు రద్దు చేసింది. వాళ్లంతా స్వతహాగా ఆర్థిక పరిపుష్టిలేక ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న వాళ్లే. ప్రభుత్వం వెంటనే రద్దు చేసిన పింఛన్లను పున:రుద్ధరించాలి.

# థర్డ్ పార్టీ ఏజెన్సీని రద్దు చేయాలి

## నేరుగా కమిటీల ద్వారా వేతనాలివ్వాలి

### సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

### ధర్నాచౌక్ వద్ద తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ ధర్నా




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పెరిగిన ధరలకనుగుణంగా వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, థర్డ్ పార్టీ ఏజెన్సీని రద్దు చేసి నేరుగా కమిటీల ద్వారా వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య అధ్యక్షత జరిగిన ధర్నాలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. గత ప్రభుత్వం 2016లో పీఆర్సీలో లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ.13వేలు చెల్లించాల్సి ఉండగా.. 12వేలు మాత్రమే చెల్లించడంతో సెక్యూరిటీ గార్డులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రెండో పీఆర్సీలో మినిమమ్ టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ మినిమం బేసిక్ రూ.19వేలు చెల్లించాల్సి ఉండగా 30శాతం పీఆర్సీ పేరుతో రూ.15,600 చేసి రెండోసారి తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. చంద్రబాబు, కేసీఆర్ హయాంలో ఏజెన్సీ వ్యవస్థ కాంట్రాక్టు, గుత్తేదారులు, కొందరి వ్యక్తుల వశం అయిపోయిందన్నారు. ఇవన్నీ ఎత్తేస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, వెంటనే థర్డ్ పార్టీ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయడంతోపాటు నేరుగా మార్కెట్ కమిటీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీలలో అటెండర్ నుంచి సూపర్‌వైజర్ వరకు ఖాళీగా ఉన్న పోస్టులను.. 30 ఏండ్లుగా పనిచేస్తున్న వారి సర్వీస్, విద్యార్హత ప్రకారం సెక్యూరిటీ గార్డులను రెగ్యులర్ చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పర్మిషన్ ఇచ్చినప్పటికీ ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో నాయకులను అరెస్టు చేయడాన్ని రాష్ట్ర కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న మాట్లాడుతూ.. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. ఏపీ ప్రభుత్వం అక్కడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, మహిళలకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇచ్చి వేతనం చెల్లిస్తోందని తెలిపారు. అదే పద్ధతి తెలంగాణలోనూ అమలు చేయాలని కోరారు.

తెలంగాణ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె. వెంకటేష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ 61 ఏండ్ల వయస్సు తర్వాత రిటైర్‌మెంట్ అయితే ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో వారి జీవనం కష్టంగా మారుతున్నదని చెప్పారు. చెక్‌పోస్టుల్లో గార్డులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు పి.సుధాకర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకన్న, కార్యదర్శులు వై.రామాంజయ్య, జి.వెంకటస్వామి, సుధారసం రమేష్, రాష్ట్ర నాయకులు ఎండి యాకుబ్ అలీ, ఎం.రవీందర్, చందా సతీష్, జె.శోభారాణి, బోట్ల వెంకటేష్, అభిషేక్, బి.శ్రీనివాస్, ప్రవీణ్, కె.అశోక్, జె.నరేష్, ఏ.నర్సోజి, ఎస్.చంద్రయ్య, వివిధ మార్కెట్ల సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.

# ఇంకొక్క తడికన్నా సాగు నీరివ్వండి..

### కాలంతో వచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు : సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

### చందుపట్ల, మొగ్గయ్యగూడెంలో ఎండిన పంట పొలాల పరిశీలన



**నవతెలంగాణ-చివ్వెంల**

ఇంకొక్క తడికన్నా సాగు నీరిస్తే కొందరన్నా రైతులు అప్పుల బారినుంచి బయట పడతారని, మంత్రి ఉత్తమ్ స్పందించి నీరివ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా రైతుల ఉసురు తీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని విమర్శించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని చందుపట్ల, మొగ్గయ్యగూడెం గ్రామంలో ఎండిన పంటల పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే అని అన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం.. ఈమూడే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అని ఆరోపించారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న రైతాంగాన్ని మళ్లీ కన్నీళ్ల పాలుచేసిన పాపం కాంగ్రెస్‌దేనని అన్నారు. పొట్టకొచ్చిన పంటలకు నీళు లేక పశువుల మేతకు అమ్ముకునే పరిస్థితొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రారంభించిన తర్వాత ఎకరం కూడా ఎండిపోలేదని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రెండుసార్లు యాసంగి పంటలు ఎండిపోయాయని అన్నారు. కాళేశ్వరం కాకుండా ఎస్సారెస్పీ నీళ్లే అయితే ఇప్పుడు పంటలు ఎందుకు ఎండుతున్నాయో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరాన్ని తమకు అప్పగిస్తే ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూస్తామని చెప్పారు. ఎండిపోయిన పంటపొలాలు, రైతన్నల కష్టాల గురించి ఏ ఒక్క మంత్రి కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. దావతుకు పోవడానికి హెలికాప్టర్ దొరుకుతున్నాయి కానీ ఎండిన పొలాలను పరిశీలించడానికి సమయం దొరకట్లేదని ఎద్దేవా చేశారు. ఎండిన పొలాలను, రైతన్నల కష్టాలను చూసి ఎక్కిరించడానికి ఉగాది రోజున సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్నట్టుందని అన్నారు. మంత్రులకు శాఖల గురించి అర్థం కాకపోతే కనీసం అధికారులను అడిగి తెలుసుకుంటే మంచిదని సూచించారు. కరోనా కష్ట కాలంలో కూడా రైతాంగానికి చిన్న ఇబ్బంది కలగకుండా కేసీఆర్ నాయకత్వంలో అండగా నిలిచి ఆదుకున్నామని చెప్పారు. కేసీఆర్ ముందుచూపుతో.. అద్భుత ప్రణాళికతో రాష్ట్రాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, బాబు నాయక్, నరసింహారావు, జీడీ బిక్షం, నాగు నాయక్, సత్యనారాయణ రెడ్డి, హముడ, నాగయ్య, చెరుకు నగేష్, చిన్న వెంకన్న, అనంతుల మధు, సునీల్ పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

## రూ.10 లక్షల జరిమానా

### 2023లో సంచలనం సృష్టించిన కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు

### నర్కూడలో చంపి, సరూర్‌నగర్‌లో పూడ్చివేత




**నవతెలంగాణ-శంషాబాద్**

ప్రేమ పేరుతో దగ్గరై పెండ్లి చేసుకుంటానని నమ్మించి తర్వాత ఆమెను అడ్డు తొలగించుకోవడంలో భాగంగా పథకం ప్రకారం హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష పడింది. 2023లో సంచలనం సృష్టించిన ఈ కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.నరేందర్‌రెడ్డి ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని రోడ్ నం.15 వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉండే అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణ అలియాస్ ఏ.సాయి కృష్ణ పూజారి. కారుగంటి అప్సర(30) అతను పనిచేసే గుడికి వచ్చేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆమెను నిందితుడు ప్రేమ పేరుతో పెండ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అంతకు ముందే అతనికి వేరే మహిళతో వివాహం జరిగింది. ఆ విషయాన్ని దాచిపెట్టి ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. ఇదిలా ఉండగా కొద్ది రోజులకు తనను పెండ్లి చేసుకోవాలని బాధితురాలు గట్టిగా అడిగింది. దాంతో ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలని సాయికృష్ణ పథకం వేశాడు. పథకంలో భాగంగా 2023 జూన్ 3వ తేదీన శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ రెవెన్యూలో ఉన్న నవరంగ్ వెంచర్‌లోకి తన కారులో ఆమెకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమె ముఖానికి ఒక కవరు చుట్టి ఊపిరాడకుండా చేసి ఆ తర్వాత తలపై రాయితో కొట్టి చంపాడు. అనంతరం మృతదేహాన్ని రెండు రోజులపాటు కారులోనే ఉంచుకొని తర్వాత సరూర్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనకాల ఒక గుంత తవ్వి పాతి పెట్టాడు. అప్సర కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయికృష్ణపై అనుమానం వ్యక్తం చేశారు. 05.06.2023న శంషాబాద్ పీఎస్‌లో మహిళ మృతి విషయంపై అప్పటి సీఐ శ్రీధర్‌కుమార్ నిందితునిపై క్రైమ్ నంబర్. 330/2023, యు/ఎస్ 302, 201 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. బాధితురాలి తరపున ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవికుమార్ వాదించారు. కేసుకు సంబంధించిన వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం ఆధారాలు అన్నీ పరిశీలించింది. నిందితునిపై అభియోగాలు రుజువు కావడంతో రంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిందితునికి జీవితకాల శిక్షతో పాటు రూ.10 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. మాయమాటలతో వంచించి, శారీరకంగా వాడుకొని పథకం ప్రకారం హత్య చేసిన పూజారి అయ్యగారి సూర్య సాయికృష్ణకు జైలు శిక్ష పడటంలో కేస్ ట్రయల్ సమర్థవంతంగా నిర్వహించిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లు రామిరెడ్డి, ఎండీ ఖాజా పాషాను ఇన్స్‌పెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



# రైతులనుకుంటే ప్రభుత్వాలను దించగలరు

### స్వామినాథన్ సిఫారసు ప్రకారం మద్దతు ధర కల్పించాలి : ప్రొ॥జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ అల్ధాస్ జానయ్య

### రైతుల భూములు కార్పొరేట్‌లకు అప్పగించే కుట్ర : అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

రైతులు అనుకుంటే ప్రభుత్వాలను గద్దె నెక్కించగలరు.. గద్దె దించగలరని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ అల్ధాస్ జానయ్య అన్నారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్‌లోని బీఎల్ఎన్ గార్డెన్‌లో ప్రారంభమ య్యాయి. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్స్‌లర్ అల్ధాస్ జానయ్య, అఖిలభారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ విశ్లేషకులు, సోమర్ల వ్యవసాయ శాస్త్రవేత్త దొంతి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్ధాస్ జానయ్య మాట్లాడుతూ.. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలు తిరిగి రైతుల గురించి అధ్యయనం చేశామని, అక్కడ కూడా రైతులకు ఇలాంటి పరిస్థితులే ఉన్నప్పటికీ మన దేశంలో ఇంకా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో రైతు భరోసా ఇచ్చి, రైతుకు ప్రోత్సాహక రాయితీలు అందించాలన్నారు. మొండి బకాయిల కింద 2014 నుంచి రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇచ్చిన వాటిని వసూలు చేసి రైతన్నల కోసం ఖర్చు చేస్తే వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు. అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులు పండించే పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేస్తే కోట్ల రూపాయల లాభం వస్తుందని, అలాంటిది మోడీ కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. రానురాను రైతుల భూములు పూర్తిగా లాక్కొని తామే పంట పండించుకునేలా కార్పొరేట్లు చూస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి చట్టం అమలు చేశారని ఇందులో 64 లక్షల మంది రైతులు ఉంటే 18 లక్షల మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదని 6 లక్షల ఖాతాలు తప్పుల తడకలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ భారతి చట్టం చేశారని, కానీ ఇంతవరకు చట్టానికి విధి విధానాలు లేవని, ధరణిలో 21 సెక్షన్లు ఉంటే భూభారతిలో 23 సెక్షన్లు చేశారని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను అధ్యయనం చేయాలని తెలిపారు.

## భావ ప్రకటన స్వేచ్ఛపై నిర్బంధం

### హక్కుల కార్యకర్తలపై అక్రమ కేసులు : సీపీఐ సభా పక్ష నేత కూనంనేని



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛపై అప్రకటిత నిర్బంధం కొనసాగుతోందని సీపీఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శాసనసభలో వివిద శాఖల పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని మనం గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యుడు సేచ్ఛగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసే పరిస్థితులు లేవని గుర్తు చేశారు. ఫిన్‌లాండ్, స్కాట్లాండ్, న్యూజిలాండ్ తదితర దేశాల పోలీసింగ్‌ను పరిశీలించి మరిన్ని సంస్కరణలు తేవాలని సూచించారు. అర్బన్ నక్సలైట్ల పేరిట పౌరహక్కుల నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థలో ఆర్డినరీ విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. పోలీసులపై రాజకీయ జోక్యం తగ్గితేనే వారు స్వేచ్ఛగా పనిచేస్తారని అభిప్రాయపడ్డారు.. అగ్జిలరి ప్రమోషన్లను రద్దు చేయాలనీ, జైళ్లలో మగ్గుతున్న ఖైదీలను సత్ప్రవర్తన ఆధారంగా విడుదల చేసే విషయం ఆలోచించాలని కోరారు. తెలంగాణ ఉద్యమ కారులపై నమోదైన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్వహణ భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.. కొత్తగా తేనున్న భూ భారతిలో కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలని కోరారు. సాదా బైనామాలను మరో సారి అనుమతించాలనీ, 61 ఏండ్లు నిండిన వారసత్వ వీఆర్వోలను ఉద్యోగంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## భద్రాచలంలో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

కూలీలు బలయ్యారు. వివరాల్లోకెళ్తే.. భద్రాచలం పట్టణానికి చెందిన శ్రీపతి అనే వ్యక్తి 1985-90 కాలంలో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించారు. ఆ ఇంటిపై రెండంతస్తుల నిర్మాణానికి పంచాయతీ నుంచి గతేడాది పర్మిషన్ తీసుకున్నాడు. గతేడాది కాలంగా ఆ ఇంటిపై ఐదు అంతస్తులు నిర్మాణం చేపడుతున్నారు. అప్పటికే శిథిలవస్థలో ఉన్న పాత నిర్మాణంపై కేవలం 9 అంగుళాలతో ఉన్న పిల్లర్ల సహాయంతో ఐదు అంతస్తులను నిర్మించిన ఫలితంగా బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భవనం ఒక్కసారిగా కుప్ప కూలింది. సంఘటన జరిగిన వెంటనే శిథిలాల కింద ఎంతమంది క్షతగాత్రులు ఉన్నారన్న విషయంపై కూడా స్పష్టత ఇవ్వకుండా సదరు శ్రీపతి పరారైనట్టుగా తెలుస్తోంది. కాగా, ఈ భవనం నిర్మాణం సమయంలో పలు సామాజిక, గిరిజన సంఘాలు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు నాసిరకంగా ఉన్న పాత ఇంటిపై ఐదంతస్తుల భవనాన్ని నిర్మించడం ప్రమాదమని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తన అక్రమ నిర్మాణాన్ని కాపాడుకునేందుకు శ్రీపతి జాతీయ సేవా సమితి ట్రస్ట్ పేరుతో అధికారులను అడ్డుకొని భవన నిర్మాణ పనులను చేపట్టారు. ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం నిర్మిస్తుండటం గమనార్హం.

**స్పష్టత రాని క్షతగాత్రులు సంఖ్య**

ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారని వారి కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. వారితో పాటు వలస కూలీలు కూడా ఉన్నారని చుట్టుపక్కల పలువురు చెబుతున్నారు. పట్టణానికి చెందిన ఉపేందర్ అనే భవన నిర్మాణ మేస్త్రి శిథిలాల కింద చిక్కుకున్నారని అతని భార్య చెబుతుండగా, తనతో పాటు మరో మేస్త్రి కూడా పనికొచ్చారని అతని సోదరుడు అంటున్నారు. వారితోపాటు చత్తీస్‌గఢ్ వలస కూలీలు సైతం పనిలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. భవన యజమాని మాత్రం పరారీలో ఉండటంతో బాధితుల సంఖ్యపై స్పష్టత రాని పరిస్థితి నెలకొంది.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

సంఘటన జరిగిన వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్‌తో పాటు పలు శాఖల అధికారులు, విపత్తు నివారణా అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని బుల్డోజర్లతో పాటు సింగరేణికి చెందిన పలువురు అధికారులు సహాయ చర్యలు ముమ్మరం చేశారు. ఇరుకు సందులు కావడంతో భారీ వాహనాలు రావడానికి ఇబ్బందులు తలెత్తాయి. ఆరంతస్తుల భవనం ఒకే చోట కుప్పగా కూలటంతో దాదాపు 5 స్లాబులను తొలగిస్తే తప్ప శిథిలాల కింద ఎంతమంది ఉన్నారన్న విషయం స్పష్టత రాదు. మరో 24 గంటల పాటు సహాయక చర్యలు కొనసాగే అవకాశం స్పష్టంగా కనబడుతున్నది. ఘటనాస్థలం వద్దకు వైద్యబృందాన్ని రప్పించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు కొద్ది రోజుల వ్యవధిలోనే ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడంతో మంత్రులు, అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మరో పది రోజుల్లో ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటన ఉంది.

**గత సంవత్సరమే భవనంపై ఫిర్యాదు**

పురాతన భవనంపై ఐదంతస్తుల నాసిరకపు భవన నిర్మాణం చేపట్టడంపై పలు గిరిజన సంఘాలు, సామాజిక సంఘాలు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకి, అప్పటి తహసీల్దార్‌కి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల సంఘం నేత ప్రదీప్ 2024 జులై నెలలోనే భవనంపై ఐటీడీఏ పీఓకి ఫిర్యాదు చేశారు. నాసిరకపు భవనాన్ని కూల్చకపోతే పెను ప్రమాదం తప్పదని హెచ్చరించిన నేపథ్యంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సంబంధిత భవనాన్ని కూల్చివేయాలని గ్రామపంచాయతీ ఈవోని ఆదేశించినప్పటికీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పంచాయతీ అధికారులు ముందుకు వెళ్లలేదని తెలుస్తోంది.

## ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి : సీపీఐ(ఎం)

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

భద్రాచలం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం కూలిపోయిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనలో ఏడుగురు వ్యక్తులు మరణించారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పాత భవనాన్ని దేవాలయంగా మార్చి, బలహీనమైన పునాదులు, పిల్లర్ల మీద భారీ నిర్మాణం చేపట్టడం వల్లనే ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. భవన నిర్మాణంపై స్థానిక అధికారులకు అనేక ఫిర్యాదులందినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు.

# పల్లా వర్సెస్ భట్టి మధ్యలో పొంగులేటి

**సాయుధ పోరాటం తరహాలో మరో ఉద్యమం**

**అనుభవదారుని కాలం అవసరం లేదు**

**భూభారతి కాదు..అది భూ హారతి : పల్లా**

**ధరణి దుర్మార్గమైన చట్టం**

**దాన్ని బంగాళాఖాతంలో కలుపుతామంటేనే ప్రజలు ఆదరించారు : భట్టి**

**భూభారతిని చూపెట్టే వచ్చే ఎన్నికలకు వెళ్తాం : పొంగులేటి**

**ధరణి, ఇందిరమ్మ ఇండ్లపై వాడివేడిగా చర్చ**

## ధరణి పోర్టల్ ఆధారంగానే రైతులకు పథకాలు





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో నేటికీ ధరణి పోర్టల్ ఆధారంగానే 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా, ఇతర పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ సభ్యులు పల్లారాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటం జరిగితే..అందులో నాలుగు వేల మంది అమరులయ్యారనీ, లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని గుర్తుచేశారు. బుధవారం శాసనసభలో పలు శాఖల పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణి మీద పిచ్చికుక్క ముద్ర వేసి భూభారతి చట్టాన్ని ముందుకు తెచ్చారని విమర్శించారు. 87 ఏండ్ల తర్వాత తీసుకొచ్చిన ఎల్ఆర్‌యూపీ కోసం 50 వేల పైచిలుకు సిబ్బంది పనిచేశారనీ, ఆర్వోఆర్ చట్టం 2020 తెచ్చారని తెలిపారు. ధరణితో గుండెల మీద చేతులేసుకుని రైతులు నిద్రపోతున్నారన్నారు. ధరణి మారిస్తే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మాదిరి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. 2104 కంటే మ్యూటేషన్ కోసం ఆరు నెలలు, ఏడాది తిరగాల్సి వచ్చేదనీ, ధరణి వచ్చా ఒకేసారి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ జరుగుతున్నాయని చెప్పారు. భూ భారతిలో అనుభవదారుని కాలం తీసుకురావడం తగదన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా తాము పేదల రక్తాన్ని పీల్చుతున్నామని మంత్రులు సీతక్క, భట్టి, కోమటిరెడ్డి, సీఎం, తదితరులు ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నో ఎల్ఆర్ఎస్..నో బీఆర్ఎస్ అని విష ప్రచారం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్ఆర్ఎస్ ఫ్రీగా చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గడానికీ, రియల్ ఎస్టేట్ తగ్గటానికి కారణాలేంటో చెప్పాలని అడిగారు. నిరుపేద రైతుల నుంచి భూములను గుంజుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 4,50,000 వేల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సంవత్సరకాలంలో ఒక్క ఇటుక పెట్టలేదు..ముగ్గుపోయలేదని విమర్శించారు. ఆ ఇండ్ల కోసం రూ. 47,250 కోట్లు అవసరమనీ, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12, 520 కోట్లు పెడితే ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు లక్ష రూపాయల అదనమనే విషయాన్ని ఎత్తేశారా? పొరపాటున మిస్సయిందా? అని అడిగారు. అదనపు లక్ష రూపాయలు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచే ఇస్తే బాగుటుందని సూచించారు. గృహలక్ష్మి పథకం లబ్దిదారులకూ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఇప్పటివరకూ గ్రౌండ్ చేసింది 0.6 శాతమే అన్నారు. జనగామ నియోజకవర్గంలో 33,731 దరఖాస్తులొస్తే..అందులో మంజూరు చేసింది..737, గ్రౌండ్ చేసింది 212 ఇండ్లు మాత్రమేనని చెప్పారు. ఆరు గ్యారెంటీలో అత్యంత ముఖ్యమైన దాన్ని గాలికి వదిలేయడం సరిగాదన్నారు.

**ధరణికి రెఫరెండంగా ఎన్నికలకు పోయి గెలిచాం : పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ధరణికి రెఫరెండంగా తీసుకుని ఎన్నికలకు పోయామనీ, ప్రజలకు తమను ఆశీర్వదించారని చెప్పారు. ధరణితో తమ భూములు పోయాయని అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు రోజూ తన దగ్గరకు వచ్చి మొరపెట్టుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో భూభారతి చట్టాన్ని తెస్తున్నామన్నారు. భూభారతి రెఫరెండంగా ఎన్నికలకు పోతామనీ, ప్రజలు ఎవ్వరిని ఆశీర్వదిస్తారో చూద్దామన్నారు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టే భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకూ ధరణి రూల్స్‌ను ఫ్రేమ్ చేయలేదన్నారు. ప్రతి గ్రామానికీ ఒక రెవెన్యూ అధికారిని పెడతామని స్పష్టం చేశారు. వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థల మీద వారికి ఉన్న ప్రేమ, అభిమానం ఎంత గొప్పదో వీఆర్‌ఓలను, వీఆర్ఏలను అడిగితే సరిపోతుందన్నారు. నడిరోడ్డు మీద 23 వేల మందిని వదిలేసి పోయిందన్నారు. వారిని స్ట్రీమ్ లైన్ చేసి వారికి ప్రత్యేక గౌరవం ఇస్తున్నామన్నారు. 2బీహెచ్‌కే చూపి రెండు సార్లు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. చిత్తశుద్ధితో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదవానికి ఇండ్లు ఇస్తామన్నారు. గతంలో మాదిరిగా పింక్ షర్టు వేసుకున్న వారికే ఇవ్వబోమనీ, బేషజాలకు పోకుండా ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీనిచ్చారు. గృహలక్ష్మి పథకం లబ్దిదారులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పల్లా సభను తప్పుదోవ పట్టిస్తున్నారనీ, ఇందిరమ్మ కమిటీలకు సర్పంచులను అధ్యక్షులుగా ఉంటారని చెప్పారు. ఎక్కడ ఉప ఎన్నికలు వచ్చినా గజ్వేల్‌లోని రెండు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూపి ఓట్లు అడిగారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదని చెప్పడాన్ని తప్పుబట్టారు. కండ్లు ఉండి కూడా చూడలేకపోతే దురదృష్టకరమన్నారు. ప్రతి మండలంలోనూ మోడల్ ఇండ్లు కడుతున్నామన్నానీ, ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నామన్నారు.

**ఆరు గ్యారంటీలుపేరుతో అధికారంలోకి వచ్చారు : పల్లా**

పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ధరణితో అధికారంలోకి రాలేదనీ, ఆరు గ్యారెంటీల హామీలో వచ్చిందని నొక్కి చెప్పారు. ప్రజల ముందుకు ఇదే అంశంపై వెళ్దామనీ, వారు ఎవరికి వైపు ఉంటారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో 25 ఎకరాలకు పైగా ఉన్న వారు 9 వేల మందే ఉన్నారని గుర్తుచేశారు. వందల, వేల ఎకరాలు ఎవరికున్నాయని ప్రశ్నించారు. ఇంకా అనుభవదారుని కాలం ఎందుకు అని అడిగారు. కౌలుదారులతో వివాదాలు సృష్టించడం సరిగాదన్నారు. ఫౌతీ పేరుతో వివాదాలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. భూ భారతి పెట్టి భూ హారతి చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

**జమాబంధి గురించి తప్పు మాట్లాడొద్దు : భట్టి**

డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ..జమాబంధి గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. జమాబంధి అంటే రెవెన్యూ సదస్సులు అని చెప్పారు. గ్రామంలో ఏటా రెవెన్యూ సదస్సులు పెట్టి ఎవరు భూములు అమ్ముతున్నారు? ఎవరు కొంటున్నారు? ఎవరి దగ్గర ఎంత భూముంది? రెవెన్యూ సమస్యలేంటి? అని రికార్డులను అప్‌గ్రేడ్ చేయడం, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సమస్యల్ని నాలుగు గోడల మధ్య పరిష్కరించడం కరెక్టా? ఆ భూముల గురించి తెలిసిన ప్రజల సమక్షంలో పరిష్కరించడం కరెక్టా? అని ప్రశ్నించారు. మంత్రి మాట్లాడే సమయంలో కౌశిక్‌రెడ్డి రన్నింగ్ కామెంట్ చేయడాన్ని ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి తప్పుబట్టారు. '1994 నుంచే సభలో ఉన్నాను. ప్రొసీడింగ్ గురించి తెలుసు. మంత్రులు లేచి అవకాశం అడిగితే మైకు ఇవ్వడం ప్రొసీడింగ్. పదేండ్ల కాలంలో ఈ స్థానంలో ఉన్న మీ స్పీకర్ ఇదే ప్రొసీడింగ్‌ను ఫాలో అయ్యారు. ఇది మీకు తెల్వనిది కాదు. కేటీఆర్, ఇతర సభ్యులు అడ్డుపడటం తగదు. మంత్రులకు ఎన్నిసార్లు ఇస్తారనే దాన్ని లెక్కబెట్టరు. సబ్జెక్టు మాట్లాడితే మంత్రుల జోక్యం ఉండదు' అని స్పష్టంగా చెప్పారు.

**ధరణి దుర్మార్గపూరిత చట్టం : డిప్యూటీ సీఎం భట్టి**

సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో.. దున్నేవారికి భూములపై హక్కులు ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వాలు భూ హక్కులు కల్పించాయని వివరించారు. బూర్గుల రామకృష్ణారావు గారు సీఎంగా ఉన్నప్పుడు రైతులకు, కౌలుదారులకు హక్కులు కల్పించారని వివరించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ తెచ్చిన సిఫారసులు, భూ సంస్కరణ ద్వారా 1970 లలో లక్షలాదిమందికి భూ హక్కులు వచ్చాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాదారు కాలం పెట్టి.. సాగుకాలం ఎత్తేసి దుర్మార్గమైన ధరణి చట్టం తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ సంస్కరణల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం 24 లక్షల మందికి భూములు పంచితే ధరణి చట్టం ద్వారా ఆ భూములను పార్ట్- బి లో పెట్టి అధికారుల చుట్టూ రైతులను తిప్పారని ఎత్తిచూపారు. వెరిఫికేషన్ లేకుండా భూములు రిజిస్ట్రేషన్ చేసే అధికారాన్ని తహసీల్దార్లకు కల్పించడాన్ని తప్పుబట్టారు. ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని చెబితే ప్రజలను తమను నమ్మి ఓటేశారన్నారు. నక్సల్బరీ ఉద్యమ సమయంలో భూములు అక్కరలేదని రైతుల దగ్గర ఎంతో కొంత డబ్బు తీసుకుని భూ స్వాములు తెల్ల కాగితంపై రాసి ఇచ్చి పట్టణాలకు వెళ్లిపోయారని తెలిపారు. ధరణితో ఆ భూస్వాముల వారసులు ఇప్పుడొచ్చి తమ భూములంటూ గొడవలు చేస్తున్న విషయాన్ని ఎత్తిచూపారు. సభలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన మాటలు మాట్లొద్దని హితవు పలికారు. పార్ట్-2 భూమిలోని భూములు, వెంటనే పాసుపుస్తకాలు గురించి మాట్లాడితే తప్పు జరిగితే మళ్లీ సాయుధ రైతాంగ పోరాటం వస్తుందని మాట్లాడటం తగదన్నారు. ధరణి పోర్టల్‌లో అప్పీల్ సిస్టమ్ కూడా లేదన్నారు. వెరిఫికేషన్ కూడా లేదన్నారు. అధికారం ఉందని ఎవరిపేరైనా ఎక్కించవచ్చుననీ, అసలు భూమి వ్యక్తి తనది కొట్లాడే హక్కు కూడా లేదని చెప్పారు. అనుభవదారుని కాలం తీసేసి ఎంతో మందిని భూమికి దూరం చేశారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ వారితోనే వేశారని విమర్శించారు.

---

## ఉప'పోరు'పై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వాగ్వాదాం

- కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ఎలా మాట్లాడుతారు : హరీశ్‌రావు
- సీఎం న్యాయస్థానం పేరు తీయలేదు : శ్రీధర్‌బాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారం, ఉప ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బుధవారం అసెంబ్లీలో పెద్ద దుమారాన్ని లేపాయి. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం కోర్టులో ఉన్నప్పుడు ఆ అంశాన్ని సీఎం సభలో ఎలా మాట్లాడుతారని బీఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. శాసనసభ నిబంధనావళిని చదివి వినిపించారు. అయితే సీఎం మాట్లాడుతున్న సమయంలో 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తకుండా ఇప్పుడు అడిగితే ఎలా అంటూ అధికార పార్టీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. ఆ సమయంలో స్పీకర్ మైక్ ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. అయితే ఏ సబెక్టుపై చర్చ జరుగుతుందో అదే సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడగాలని శాసనసభా వ్యవహారా శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నిబంధనను ఉటంకించారు. దీనికి నిరసననగా స్పీకర్ పోడియం ముందు బీఆర్ఎస్ నిరసన తెలిపారు. మిగతా సభ్యులు మాట్లాడటం పూర్తయిన తర్వాత మైక్ ఇస్తానంటూ స్పీకర్ వారికి సూచించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు కొద్దిసేపు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రతిపక్షాల నిరసనలను శ్రీధర్‌బాబు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పు గురించి మాట్లాడలేదని స్పష్టం చేశారు. కేవలం ఫిరాయింపుల విషయంలో గతంలో మాదిరిగానే వ్యవహరిస్తామని చెప్పారని, ఆయన వివరణ ఇచ్చారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదన్నారు. ఉప ఎన్నికలు వస్తాయంటూ బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే ముఖ్యమంత్రి మాట్లాడారని స్పష్టత ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యూడీషియర్‌ను విమర్శించే హక్కు పార్లమెంట్‌లో కూడా ఉంటుందని అన్నారు. అంతకుముందు సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజూ ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేమూ కొనసాగిస్తాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేమూ ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేము నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ ప్రచారం చేస్తున్నది. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది. తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు... అభివృద్ధిపైన్నే ఉన్నది' అని చెప్పారు.

## వారిని కొనసాగిస్తూ తక్షణమే ఉత్తర్వులివ్వండి

- సీఎస్‌కు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలోని సాధారణ పరిపాలనాశాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ప్రాసెసింగ్ ఆఫీసర్ల గడువు ఈనెలాఖరుతో ముగుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో వారిని కొనసాగిస్తున్నామని పేర్కొంటూ తక్షణం ఉత్తర్వులివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి బుధవారం సీఎస్ శాంతి కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఆయా సిబ్బంది గత 20 ఏండ్లుగా అతి తక్కువ వేతనాలతో నిబద్ధతతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి ప్రతీనెలా వేతనాలు ఆలస్యంగా అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధ సౌకర్యాలు లభించటం లేదనీ, పని భారం పెరుగుతున్నదని వాపోయారు. ఇప్పుడు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వకపోతే వారు మరింత ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

## 'ఎమ్ఎమ్‌టీఎస్' ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల ఎమ్ఎమ్‌టీఎస్‌లో సికింద్రాబాద్ నుంచి మేడ్చల్‌కు వెళుతున్న మహిళలపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సీఐటీయూ) కన్వీనర్ ఎస్వీ రమ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగంతకుడి నుంచి తప్పించుకునే క్రమంలో గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు నుంచి దూకి, తీవ్ర గాయాలపాలైన యువతి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

---

# డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం: పొంగులేటి
- లక్ష కోట్ల కాళేశ్వరం కూలింది:ఉత్తమ్

## 24 గంటలూ అందుబాటులో : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతున్నా అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన కరెంటును సరఫరా చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 2021 నాటికి 13668 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉండగా, 2021-22 నాటికి 14160 మెగావాట్ల పీక్ డిమాండ్ కు చేరుకున్నదన్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు పెరిగినప్పటికీ ముందస్తుగా తీసుకున్న చర్యలు, సంస్కరణల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ట్రిప్పు కాకుండా, కట్ లేకుండా, నిరంతరంగా సరఫరా చేస్తున్నామన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయా బిల్లులపై చర్చ సందర్భంగా మంత్రులు సమాధానమిచ్చారు. విద్యుత్ లబ్దిదారులకు 24 గంటలూ విద్యుత్తును సరఫరా చేయడానికి కృషి చేస్తున్న సిబ్బందికి అభినందనలు చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన క్లస్టర్స్ ఏర్పాటు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, హైటెక్ సిటీ పరిధిలో విస్తరిస్తున్న ఐటీ సెక్టర్, రాష్ట్రానికి కొత్తగా వస్తున్న డేటా సెంటర్ల ఏర్పాటుతో భవిష్యత్తులో రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు మరింత పెరగనున్నాయని వివరించారు. 2029-30 నాటికి గరిష్ట డిమాండ్ 24,215 మెగావాట్లు, 2034-35 నాటికి 31,809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉండనుందని కేంద్రం నుంచి వచ్చిన అంచనాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్ మిషన్, డిస్కంల బలోపేతానికి అనేక కార్యక్రమాలు తీసుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. పీక్ అవర్‌లో జల విద్యుత్ ను పెంచుకోవడానికి రివర్స్ పంపింగ్ ద్వారా రాష్ట్రానికి కావలసిన అవసరాలు తీర్చుతున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ జెన్కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష చేసి వేసవి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సబ్సిడీ, ఉచిత కరెంటుకు సంబంధించిన డబ్బులను ప్రతినెలా డిస్కం లకు చెల్లించి వాటిని బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి న్యూ ఎనర్జీ పాలసీని ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. 2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి 40 వేల మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదని గుర్తు చేశారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేకుండా 20,000 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, 21 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామన్నారు. ఈ డబ్బులను వ్యాపారంలో పెట్టడానికి ప్రభుత్వమే వారికి మార్గం చూపిస్తున్నదని చెప్పారు.

**20 లక్షల ఇండ్లను నిర్మిస్తాం : రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు వస్తాయని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు లేకున్నా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అమలుచేస్తామని ప్రకటించారు. ధరణి చట్టాన్ని భూమాతగా మారుస్తున్నామన్నారు. గతంలో నిబంధనలు లేవనీ, వాటిని 10 నుంచి 15 రోజుల్లో తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. 36 మాడ్యూళ్లను ఆరు మాడ్యూళ్లుగా మార్చి అమలుచేయనున్నట్టు వివరించారు. అవకతవకలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు రెండు నెలలుగా శిక్షణ ఇచ్చి 5500 నుంచి 6000 మంది సర్వేయర్లను నియమించనున్నామని చెప్పారు. ఈ సంఖ్య కర్నాటకలో 17 వేల మంది, మహారాష్ట్రంలో 23 వేల మందిగా ఉన్నారని గుర్తు చేశారు. త్వరలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు కొత్త విధానం ద్వారా ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ప్రత్యేక కమిటీని నియమించామని తెలిపారు. ఆరోగ్య భద్రత విషయాలపైనా సమాలోచనలు చేస్తున్నట్టు తెలిపారు. సమాచార శాఖ ద్వారా అడ్వర్‌టైజ్‌మెంట్లను ఈనాడు, ఇతర పెద్ద పత్రికలను మించి బీఆర్ఎస్ పత్రిక నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేకు ఇచ్చుకున్నారని చెప్పారు. టారీఫ్ రేట్లను విపరీతంగా పెంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ఇచ్చారని వివరించారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా రూ. 560 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు.

**లక్ష కోట్ల కాళేశ్వరం కూలింది : సాగునీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



రూ. లక్ష కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని సాగునీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ప్రాజెక్టులు నిర్మించలేదన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ సర్కారు ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని అన్నారు. అద్భుతాలు ఏమీ సాధించలేదని చెప్పారు. కృష్ణా జలాల్లో ఏపీకి అనుకూలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిదని అన్నారు. దీంతో దీర్ఘకాలికంగా తెలంగాణ అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ రూ. 14 వేల కోట్ల మేర సాగునీట ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. అస్తవ్యవస్థంగా ప్రాజెక్టులు కట్టారని చెప్పారు. మేము తీసుకున్న చర్యలతోనే ప్రజలకు మేలు జరుగుతున్నదన్నారు. అందరికీ రేషన్ బీపీఎల్, ఏపీఎల్ కార్డులను ఇస్తామన్నారు. అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. గత ఏడాది కాలంగా సన్నాలకు బోనస్ అమలుచేశామని చెప్పారు. గత ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కుమ్మక్కయి తెలంగాణకు కేసీఆర్ సర్కారు అన్యాయం చేసిందని చెప్పారు. సభ్యుల సందేహాలకు ఆయా శాఖల మంత్రులు సమాధానమిచ్చారు. ఒకానొక సందర్భంలో మంత్రులు, సభ్యులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. రాత్రి 9.35 గంటలకు స్పీకర్ బి. ప్రసాద్‌కుమార్ సభను గురువారానికి వాయిదా వేశారు.

---

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్ అక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తితో పాటు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకుల అరెస్ట్ అక్రమమని ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో విమర్శించింది. ఉస్మానియా యూనివర్శిటీలో గవర్నర్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టుల పేరుతో నిర్బంధించారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపాలన, ప్రజ స్వామ్య పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, గత బీఆర్ఎస్ సర్కార్ తరహాలోనే పని చేస్తోందని విమర్శించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావప్రకటన స్వేచ్ఛ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కనీ, దాన్ని ఉల్లంఘించి ముందస్తు అరెస్టు చేయడం తగదని పేర్కొంది.

## టెన్త్ పరీక్షకు 2,006 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన మ్యాథమెటిక్స్ సబ్జెక్టుకు 2,006 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,97,827 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,96,594 (99.75 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 1,233 (0.25 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 4,808 మంది దరఖాస్తు చేశారనీ, 4,035 మంది పరీక్ష రాశారని తెలిపారు. 773 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు కలిపి 2,006 మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. రాష్ట్రంలో ఒక్క విద్యార్థిపై కూడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఇద్దరు ఇన్విజిలేటర్లను విధులను తొలగించామని పేర్కొన్నారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

## నేడు 9 మంది ఎమ్మెల్సీలకు సన్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొమ్మిది మంది శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) ఈనెల 29న పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కావాలని కోరారు. అనంతరం సభను గురువారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈనెల 29న పదవీకాలం ముగియనున్న ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, టి జీవన్‌రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, యెగ్గె మల్లేశం, శేరి సుభాష్‌రెడ్డి, మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీతోపాటు మే ఒకటిన ఎంఎస్ ప్రభాకర్‌రావు పదవీకాలం ముగియనుంది.

## గర్భిణీ స్త్రీల పథకానికి నిధుల కొరత

- కేంద్రం పట్టించుకోవటం లేదు : రాజ్యసభలో సోనియా గాంధీ ఆరోపణ



న్యూఢిల్లీ : కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణీ స్త్రీల పథకంపై రాజ్యసభలో లేవనెత్తిన ఆమె.. దీనికి తీవ్ర నిధుల కొరత ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ), 2013, గర్భిణీస్త్రీల పథకంపై ఆమె ప్రసంగించారు. ప్రభుత్వం ఈ పథకానికి చాలా తక్కువ నిధులు ఇచ్చిందని ఆమె ఆరోపించారు. లబ్దిదారుల సంఖ్య ఎందుకు చాలా తగ్గిందని ప్రశ్నించారు. రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ఎన్ఎఫ్ఎస్ఏ, 2017లో ప్రారంభమైన ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) కింద ప్రసూతి హక్కులను నెరవేర్చకపోవటం చాలా ఆందోళనకరమైన విషయమని చెప్పారు. 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో ఆమోదించబడిన ఎన్ఎఫ్ఎస్ఏ.. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనకు పునాదిగా మారిందని అన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన తల్లికి రూ.6 వేలు ప్రసూతి ప్రయోజనాలు అందుతాయనీ, ఇవి రెండు విడతలుగా చెల్లిస్తారని చెప్పారు. రెండోసారి ఆడ బిడ్డ అయితే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కానీ, ప్రస్తుతం ఈ పథకం కుంటుపడిందనీ, దీనికి నిధులు లేవని చెప్పారు. పీఎంఎంవీవై మొదటి బిడ్డకు రూ.5000 మాత్రమే అందిస్తుందనీ, అది ఆడపిల్ల అయితే రెండో బిడ్డకు పొడిగింపు ఉంటుందని చెప్పారు.జాతీయ ఆహార భద్రతా చట్టం అమలుకు రూ. 12వేల కోట్లు అవసరమని తెలిపారు. కానీ, రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేవలం రూ.2500 కోట్లు మాత్రమే కేటాయించారని సోనియా చెప్పారు. అయితే, పీఎంఎంవీవై కోసం కేటాయింపులపై ప్రత్యేక సమాచారం లేదని సోనియా అన్నారు. గర్భిణీ స్త్రీలకు రెండు విడతలుగా అందాల్సిన నగదు అందటం లేదన్నారు. 2022-23లో దాదాపు 68 శాతం మంది గర్భిణీలు తమ మొదటి ప్రసవానికి కనీసం ఒక విడత పీఎంఎంవీవైని పొందారనీ, మరుసటి ఏడాదికి అది 12 శాతానికి పడిపోయిందని చెప్పారు. ఇలా ఎందుకు జరిగిందని కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు.

## పోలీసు స్టేషన్ల నిర్వహణకు డబ్బులివ్వండి : పల్లా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోలీసు స్టేషన్ల నిర్వహణకు ప్రతినెలా ఇచ్చే రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.75 వేలు ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. శాసనసభలో హోంశాఖ పద్దుపై ఆయన మాట్లాడుతూ..తమ బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్లలో పోలీస్ వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దిందన్నారు. లక్ష సీసీ కెమెరాలను ఒకేసారి పరిశీలించేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించిందని తెలిపారు. పోలీస్ స్టేషన్లను ఐటీ ఆఫీసుల్లా ఆధునీకరించామనీ, వాహనాలను సమకూర్చిందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని..గత చరిత్ర అవసరం లేదనీ సబ్జెక్టుకు పరిమితమై మాట్లాడాలని సూచించారు. ఐదు గంటల వరకు సభ ముగిసేలా సహకరించాలనీ, వరుసగా రెండు,మూడు రోజుల నుంచి అర్ధరాత్రి 12, ఒంటి గంట అవుతున్నదనీ, దీనివల్ల ఉద్యోగులకు ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..తమకే వర్తిస్తాయా? వారికి వర్తించవా? 15 నెలల నుంచి ఎవరికి మైకు ఇచ్చినా గత ప్రభుత్వం..గత ప్రభుత్వం అంటుంటే చప్పుడు చేయరుగానీ తాము లేవగానే అడ్డుకోవడం తగదని హితవు పలికారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..నెహ్రూ, ఇందిరాగాంధీ నుంచి చరిత్ర చెబుతున్నది కాంగ్రెస్ వాళ్లేనని విమర్శించారు. రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో మహిళపై లైంగిక దాడి జరిగితే పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తరుచూ ఎస్ఐ, సీఐ, డీఎస్పీ, ఏసీపీలను బదిలీ చేయడాన్ని తప్పుబట్టారు. సెలవులు కూడా సరిగా ఇవ్వడం లేదని ప్రస్తావించారు. ఆరోగ్యబీమా కింద పోలీసుల జీతం నుంచి రూ.1600 ప్రతి నెలా కట్ చేస్తారనీ, వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్తే మాత్రం వైద్య సేవలు అందట్లేదని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు, టీఏలు, లోన్లు ఇవ్వట్లేదన్నారు. సీసీ కెమెరాలు 10,50,000 పెట్టుకున్నామనీ, వాటి పర్యవేక్షణ సరిగా లేదని ప్రస్తావించారు. రైతులు ఏదైనా మాట్లాడి వీడియోలు పెడితే అరెస్టు చేసి జైళ్లలో పెడుతున్నారని వివరించారు. పోలీస్ వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్ల మీద పనిచేస్తున్నదని వాపోయారు. సచివాలయం ముందు పోలీసుల కుటుంబాలు, సచివాలయంలో కాంట్రాక్టర్లు ధర్నా చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. అధికార పక్షంలోని అసంతృప్తులను, ప్రతిపక్ష నేతలను కట్టడి చేయడానికి పోలీసు వ్యవస్థను ప్రభుత్వం వాడుకుంటున్నదని విమర్శించారు. జనగామలో మహిళా పోలీస్‌స్టేషన్‌ను, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరారు.

**నిందితుల్ని అరెస్టు చేశాం : మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..సభకు తప్పుడు సమాచారం ఇవ్వొద్దనీ, ఎంఎంటీఎస్ ఘటనలో నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ధర్నాలను అణచివేయడానికి, ప్రజాస్వామ్యాన్ని తొక్కిపెట్టేందుకు పోలీసులను వాడుకున్నదని విమర్శించారు.



# సెమీస్‌లో సబలెంక

## మియామి ఓపెన్ 2025

**మియామి (యుఎస్‌ఏ) :** బెలారస్ భామ, టాప్ సీడ్ అరినా సబలెంక మియామి ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో చైనా అమ్మాయి, తొమ్మిదో సీడ్ క్విన్‌వెన్ జెంగ్‌పై 6-2, 7-5తో వరుస సెట్లలో సబలెంక గెలుపొందింది. ఓ ఏస్ కొట్టిన సబలెంక.. ఏడు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. జెంగ్ సైతం మూడు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించినా.. ఆశించిన పోటీ ఇవ్వలేదు. పాయింట్ల పరంగా 73-52తో సబలెంక పైచేయి సాధించింది. మరో క్వార్టర్‌ఫైనల్లో పొలాండ్ స్టార్ మగ్ద లినెటె 3-6, 6-2తో ఆరో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ) చేతిలో పరాజయం పాలైంది. మగ్ద మూడు ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకోగా.. పావొలిని రెండు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో సత్తా చాటింది.

పురుషుల సింగిల్స్‌లో నాల్గో సీడ్, టైటిల్ ఫేవరేట్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) అలవోక విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రీ క్వార్టర్స్‌లో ఇటలీ ఆటగాడు లొరెంజో ముసెటిపై 6-2, 6-2తో జకోవిచ్ సునాయాసంగా గెలుపొందాడు. రెండు సెట్లలో ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన జకోవిచ్... పాయింట్ల పరంగా 62-40తో తిరుగులేని ఆధిపత్యం చూపించాడు. మాటో బెరాటిని (ఇటలీ) 6-3, 7-6(9-7)తో అలెక్స్ (ఆస్ట్రేలియా)పై వరుస సెట్లలో విజయం సాధించి క్వార్టర్స్‌లో కాలుమోపాడు.

# డికాక్ ధనాధన్

- రాయల్స్‌పై నైట్‌రైడర్స్ గెలుపు
- రాజస్థాన్ 151/9, కోల్‌కత 153/2

**డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ బోణీ కొట్టింది. రాజస్థాన్ రాయల్స్‌పై 8 వికెట్ల తేడాతో అలవోక విజయం సాధించింది. ఛేదనలో క్వింటన్ డికాక్ (97 నాటౌట్, 61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. దీంతో కోల్‌కత చెమటపట్టకుండా తొలి విజయం అందుకుంది. ధ్రువ్ జురెల్ (33), యశస్వి జైస్వాల్ (29), రియాన్ పరాగ్ (25) మెరవటంతో రాజస్థాన్ తొలుత 151/9 పరుగులు చేసింది.**

నవతెలంగాణ-గువహటి

క్వింటన్ డికాక్ (97 నాటౌట్, 61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సులు) దుమ్మురేపాడు. అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కిన డికాక్ కోల్‌కత నైట్‌రైడర్స్‌కు మెరుపు విజయాన్ని కట్టబెట్టాడు. అజింక్య రహానె (18, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రఘువంశీ (22 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు) సైతం రాణించటంతో 152 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కత నైట్‌రైడర్స్ 17.3 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ మోయిన్ అలీ (5) నిరాశపరిచినా... ఓ ఎండ్‌లో దూకుడుగా ఆడిన డికాక్ ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 36 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ముందుండి కోల్‌కత నైట్‌రైడర్స్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఇది తొలి విజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు రెండో పరాజయం.



అంతకుముందు, కోల్‌కత నైట్‌రైడర్స్ బౌలర్లు వరుణ్ చక్రవర్తి (2/17), మోయిన్ అలీ (2/23) సహా పేసర్లు హర్షిత్ రానా (2/36), వైభవ్ అరోర (2/33) సమిష్టిగా మెరువగా.. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 151 పరుగులే చేసింది. ధ్రువ్ జురెల్ (33, 28 బంతుల్లో 5 ఫోర్లు), రియాన్ పరాగ్ (25, 15 బంతుల్లో 3 సిక్సులు), యశస్వి జైస్వాల్ (29, 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) ఫర్వాలేదనిపించారు.

**రాయల్స్ తడబాటు :**

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్‌లో 242 పరుగులు చేసిన రాజస్థాన్ రాయల్స్.. సొంతగడ్డపై పేలవ ప్రదర్శన చేసింది. టాస్ నెగ్గిన కోల్‌కత నైట్‌రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్‌గా వచ్చిన సంజు శాంసన్ (13) నిరాశపరిచాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (29) రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదినా.. ఆశించిన వేగంతో పరుగులు సాధించలేదు. కెప్టెన్ రియాన్ పరాగ్ (25) మూడు సిక్సర్లతో రెచ్చిపోయాడు. కానీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మాయకు వికెట్ కోల్పోయాడు. నితీశ్ రానా (8), వానిందు హసరంగ (4)లు తేలిపోయారు. ధ్రువ్ జురెల్ (33) మిడిల్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఇంపాక్ట్ ప్లేయర్ శుభమ్ దూబె (9) సైతం రాణించలేదు. టెయిలెండర్ జోఫ్రా ఆర్చర్ (16) చివర్లో రెండు సిక్సర్లతో రాయల్స్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. పిచ్ నుంచి బ్యాటర్లకు అనుకూలత ఉన్నప్పటికీ.. రాజస్థాన్ రాయల్స్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. కోల్‌కత నైట్‌రైడర్స్ స్పిన్నర్లు చక్కటి మాయజాలంతో రాయల్స్‌ను కట్టడి చేశారు.

# జోరు కొనసాగేనా..!

**సూపర్‌జెయింట్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు**
**రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**

నవతెలంగాణ-హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ తొలి రౌండ్ ముగిసింది. లీగ్ ఆరంభమై తొలి వారం ముగియకుండానే..పరుగుల వేటలో వాతావరణం వేడెక్కింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ దారిలోనే ఇతర జట్లు దూకుడు మంత్ర పఠించటంతో సీజన్ గణాంకాలు మారిపోయాయి. తొలి బంతి నుంచి ఆఖరు బంతి వరకు బౌండరీ లైన్ లక్ష్యంగా ఎదురుదాడి చేస్తున్న బ్యాటర్లు.. బౌలర్లకు నిద్రపట్టకుండా చేస్తున్నారు. ఉప్పల్‌లో తొలి మ్యాచ్‌లోనే 286 పరుగుల భారీ స్కోరు బాదిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. లక్నో సూపర్‌జెయింట్స్‌తో నేడు సన్‌రైజర్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు సైతం పరుగుల పిచ్ సిద్ధం.

**ఎదురుందా? :** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు అత్యంత దూకుడుగా ఆడుతున్నారు. అభిషేక్ శర్మ, ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి గత సీజన్‌లో రికార్డులు బద్దలు కొట్టింది. ఇషాన్ కిషన్, అభినవ్ మనోహర్, అనికెత్ వర్మ సైతం ఈ సీజన్‌లో జతకలవటంతో సన్‌రైజర్స్ విధ్వంసానికి ఆకాశమే హద్దుగా మారింది. ఇషాన్ కిషన్ గత మ్యాచ్‌లో అజేయ సెంచరీతో చెలరేగాడు. ట్రావిశ్ హెడ్ తనదైన జోరు చూపించాడు.



హెన్రిచ్ క్లాసెన్ భీకర ఫామ్‌లో ఉన్నప్పటికీ భారీ స్కోరు వేటలో కనిపిస్తున్నాడు. బంతితో పాట్ కమిన్స్, మహ్మద్ షమి, ఆడం జంపా, సిమర్‌జిత్ సింగ్‌లు ఆఖరు ఓవర్లలో పరుగుల నియంత్రణపై దృష్టి నిలపాల్సిన అవసరం ఉంది.

**పంత్‌కు పరీక్ష :** లక్నో సూపర్‌జెయింట్స్ తరఫున తొలిసారి ఆడుతున్న రిషబ్ పంత్‌కు ఉప్పల్‌లో కఠిన పరీక్ష ఎదురు కానుంది. వైజాగ్ మ్యాచ్‌లో చేజేతులా గెలుపు చేజార్చుకున్న సూపర్‌జెయింట్స్‌ను నేడు గెలుపు బాట పట్టించటం పంత్‌కు సవాల్. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా తొలి మ్యాచ్‌లో నిరాశపరిచిన పంత్‌కు వ్యక్తిగతంగానూ నేడు కీలకం. పేసర్ అవేశ్ ఖాన్ అందుబాటులోకి రావటం లక్నోకు ఊరట. నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్, ఆయుశ్ బదాని, ఆకాశ్ దీప్‌లు సూపర్‌జెయింట్స్‌కు కీలకం.



# నేటి నుంచి కరాటే పోటీలు

**హైదరాబాద్ :** 4వ కెఐఓ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నేటి నుంచి గచ్చిబౌలి స్టేడియంలో ఆరంభం కానున్నాయి. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1500 మంది క్రీడాకారులు పోటీపడుతున్న మెగా ఈవెంట్‌ను నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ చైర్మెన్, పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి తెలిపారు.



# గంభీర్ నీ సంగతేంది?

## చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీపై గవాస్కర్

**ముంబయి :** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత జట్టు, సహాయక సిబ్బంది, సెలక్షన్ కమిటీకి ఇటీవల భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూ.58 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. ప్రైజ్‌మనీ మొత్తంలో చీఫ్ కోచ్, సహాయక సిబ్బందికి ఎవరికి ఎంత దక్కుతుందనే వివరాలు బయటకు రాలేదు. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు సైతం బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు అదనంగా రూ.2.5 కోట్ల ప్రైజ్‌మనీ ఆఫర్ చేసింది. కానీ సహచర సహాయక కోచ్‌లతో సమానం ప్రైజ్‌మనీ తీసుకుంటానని చెప్పిన ద్రవిడ్.. అదనపు నగదు బహుమతిని తిరస్కరించాడు. ద్రవిడ్ నిర్ణయం జట్టులో ఫెయిర్‌నెస్, ఐక్యత పట్ల అతడి అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. రాహుల్ ద్రవిడ్ తరహాలోనే గౌతం గంభీర్ ఆదర్శంగా నిలుస్తూ సహాయక కోచ్‌లతో



సమానంగా ప్రైజ్‌మనీ తీసుకుంటాడా? బీసీసీఐ నుంచి అదనంగా నగదు బహుమతి అందుకునేందుకు సిద్ధపడతాడా? అనేది తేలాలి అని మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశ్నించాడు. 'టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత ద్రవిడ్ అదనపు ప్రైజ్‌మనీ తిరస్కరించి.. కోచింగ్ సిబ్బందితో సమానంగా నజరానా తీసుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ ప్రకటించి పక్షం రోజులు గడుస్తున్నా.. ప్రస్తుత కోచ్ నుంచి ఎటువంటి స్పందన లేదు. ద్రవిడ్‌ను గంభీర్ అనుసరిస్తాడా? ఈ సంప్రదాయం ఒక్క ద్రవిడ్ వరకేనా? ఈ అంశంలో ద్రవిడ్ మంచి రోల్ మోడల్ కాదా?' అని సునీల్ గవాస్కర్ ప్రశ్నించాడు.

# ఆ ఆలోచన లేదు!

## డబ్ల్యూపీఎల్‌లో కొత్త జట్లపై బీసీసీఐ

**ముంబయి :** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు ఆదరణ గణనీయంగా పెరుగుతోంది. అభిమానుల్లో ఆసక్తి, టెలివిజన్ వీక్షణలు సహా స్టేడియంలో హాజరు గణాంకాలు గొప్పగా కనిపిస్తున్నాయి. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో 22 మ్యాచులకు 150 మిలియన్ వీక్షణలు వచ్చినట్టు మార్కెట్ వర్గాల సమాచారం. సీజన్ ఆరంభ మ్యాచ్, టైటిల్ పోరుకు అత్యధికంగా వీక్షణలు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఐదు జట్లతో నడుస్తున్న డబ్ల్యూపీఎల్‌లో కొత్త జట్లను చేర్చే ప్రణాళికలపై చర్చ మొదలైంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో కొత్త జట్లను చేర్చే ఆలోచన లేదని ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ కుమార్ ధుమాల్ తెలిపారు.



'డబ్ల్యూపీఎల్‌లో జట్ల సంఖ్యను పెంచడానికి ముందు.. లీగ్‌ను మరింత బలోపేతం చేయటంపై దృష్టి పెడుతున్నాం. కొత్త జట్లను చేర్చాలనే ఆలోచన, ప్రణాళిక ఇప్పటికైతే లేదు. మూడు సీజన్లలోనే డబ్ల్యూపీఎల్ మంచి సక్సెస్ సాధించింది. మహిళల క్రికెట్‌కు ఇది కొత్త గమనాన్ని నిర్దేశించింది' అని అరుణ్ అన్నారు. డబ్ల్యూపీఎల్ 2025 ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ముంబయి ఇండియన్స్ గెలుపొందిన సంగతి తెలిసిందే. డబ్ల్యూపీఎల్‌లో వరుసగా మూడు సీజన్లలో ఫైనల్‌కు చేరిన ఢిల్లీ క్యాపిటల్స్..మూడుసార్లు రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.


# పృథ్వీశ్వర్ ఆల్‌రౌండ్ షో

## టీడీసీఏ అండర్-17 వన్డే ట్రోఫీ

**హైదరాబాద్ :** తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వన్డే ట్రోఫీలో పృథ్వీశ్వర్ ఆల్‌రౌండ్ షోతో మెరిశాడు. 76 బంతుల్లో 104 పరుగులతో శతకం సాధించిన పృథ్వీ.. బంతితో (3/30) మూడు వికెట్లు పడగొట్టాడు. పృథ్వీశ్వర్ సహా అభినవ్ (65), మణీశ్వర్ (58) మెరవటంతో రైజర్స్‌తో మ్యాచ్‌లో పాంథర్స్ తొలుత 45.1 ఓవర్లలో 296/10 పరుగులు చేసింది. ఛేదనలో రైజర్స్ 36.5 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో అమెరికా యూత్ టీమ్ (ఏవైసీఏ) 6 వికెట్ల తేడాతో వారియర్స్‌పై గెలుపొందింది. వారియర్స్ 36.1 ఓవర్లలో 105 పరుగులకు కుప్పకూలగా.. ఏవైసీఏ 16 ఓవర్లలోనే 108/4 పరుగులు చేసింది. శతకం సాధించిన పృథ్వీశ్వర్‌ను టీడీసీఏ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.



# 8 భాషల్లో 'ది ప్యారడైజ్'


నాని

హీరో నాని నటిస్తున్న ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. దీని రా స్టేట్‌మెంట్ టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ గ్రిప్పింగ్ టీజర్ అందరి దృష్టిని ఆకర్షించి, రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ సంపాదించింది. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సెకండ్ కొలాబరేషన్‌ని బలంగా సూచిస్తుంది.

ఈ సినిమా మార్చి 26, 2026న సరిగ్గా 365 రోజుల్లో తెరపైకి రానుంది. భారతీయ సినిమా ఈ మ్యాడ్నెస్‌ను చూడటానికి సరిగ్గా ఏడాది ఉంది. కౌంట్‌డౌన్‌ను గుర్తుచేసుకోవడానికి, పేలుళ్ళ, వార్ బ్యాక్ డ్రాప్‌లో తుపాకీని పట్టుకుని ఉన్న పవర్ ఫుల్ కొత్త లుక్‌లో నానిని ప్రజెంట్ చేసే ఇంటెన్స్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. హైదరాబాద్ హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌తో సెట్ చేయబడిన ఈ సినిమా నానిని మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేయనుంది.

ఎస్‌విఎస్ సినిమాస్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యున్నత స్థాయి నిర్మాణ విలువలతో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇంగ్లీష్, స్పానిష్ సహా 8 భాషలలో విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

# నవచిత్రం

## బ్లాక్‌బస్టర్ ఖాయం : నితిన్



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ సందర్భంగా హీరో నితిన్ మాట్లాడుతూ,'ఫైనల్ కాపీ చూసాం. చాలా హ్యాపీగా ఉంది. సినిమా చేసినప్పుడు ఎంత కాన్ఫిడెంట్‌గా ఉన్నానో, చూసుకున్నప్పుడు కూడా అంతే కాన్ఫిడెంట్‌గా అనిపించింది. వెంకీ, నా కాంబినేషన్లో వచ్చిన 'భీష్మ' కంటే ఈ సినిమా చాలా బాగుంటుంది. నా క్యారెక్టర్ ఇందులో వెరీ బిగ్ మానిప్లేటర్. చాలా స్మార్ట్ మైండ్. ఫిజికల్ స్ట్రెంత్ కంటే మెంటల్ స్ట్రెంత్ ఎక్కువగా ఉండే క్యారెక్టర్. ఫస్ట్ టైం ఇలాంటి క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. క్లైమాక్స్‌లో నా క్యారెక్టర్ రౌండప్, వచ్చే ట్విస్టులు, షాకులు చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. భీష్మ సినిమాలో కంటే నా క్యారెక్టర్ వెరీ స్ట్రీట్ స్మార్ట్ గా ఉంటుంది. వెరీ ఇంటలెక్చువల్ క్యారెక్టర్. కచ్చితంగా ఆడియన్స్ అందరికీ సినిమా నచ్చుతుందని నమ్మకం ఉంది' అని అన్నారు.

'ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాం. అవుట్ పుట్ చూసుకున్నాం. వెరీ హ్యాపీ. ఆడియన్స్ అందరూ సినిమా చూసి, బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ చేస్తారని ఆశిస్తున్నాం' అని డైరెక్టర్ వెంకీ కుడుముల చెప్పారు. నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ,'సినిమా అన్ని ఫార్మాలిటీస్‌ని పూర్తి చేసుకుంది. పబ్లిసిటీ పరంగా కూడా చాలా బాగా ఆడియన్స్‌కి చేరింది. సినిమా మంచి ఫన్ ఎంటర్‌టైనర్. ఖచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.

# త్వరలోనే షూటింగ్ ..


చిరంజీవి, అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సాహు గారపాటి నిర్మించబోతున్నారు. ఈ సినిమాకి సంబంధించి సర్వం సిద్ధమైంది. చిరంజీవికి దర్శకుడు అనిల్ రావిపూడి ఫైనల్ నెరేషన్ చేశారు. స్క్రిప్ట్‌తో మెగాస్టార్ థ్రిల్ అయ్యారు. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెగాస్టార్ ఆశీస్సులు లభించడంతో, ఈ చిత్ర బృందం ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో వర్క్ చేస్తోంది. గ్రాండ్ లాంచ్‌కు ముందే మిగిలిన నటీనటులు, సిబ్బందిని ఖరారు చేయనున్నారు.

ఈ చిత్రానికి ప్లే ఫుల్ ట్విస్ట్‌ని జోడిస్తూ శంకర్ వరప్రసాద్ పాత్రను చిరంజీవి పోషిస్తున్నారు. మెగాస్టార్ అసలు పేరు కొణిదెల శివ శంకర వరప్రసాద్. చిరంజీవి పూర్తి స్థాయి కామెడీ అవతార్‌లో కనిపిస్తారు. అనిల్ రావిపూడి, చిరంజీవిల కాంబో ఎంటర్‌టైన్మెంట్‌ని రీ డిఫైన్ చేయనుంది. ఎప్పటికీ గుర్తుండిపోయే నవ్వుల వినోదాన్ని అందిస్తుంది. ఈ మెగా ఎంటర్‌టైనర్‌కి సంబంధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేయనున్నారు.

# మరో భిన్న సినిమా



ప్రదీప్ రంగనాథన్ తను దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ 'లవ్ టుడే'తో నటుడిగా అరంగేట్రం చేశారు.

ఆ తర్వాత తమిళం, తెలుగు రెండింటిలోనూ విజయం సాధించిన తన రీసెంట్ హిట్ 'డ్రాగన్'తో మ్యాసీవ్ పాపులారిటీ సాదించారు.

వరుస విజయాలతో ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నారు. పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా తమిళం-తెలుగు ద్విభాషా ప్రాజెక్టును అనౌన్స్ చేసింది. గతంలో అనేక సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కీర్తిశ్వరన్ ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం కానున్నారు.

ఈ చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు వేడుకలోని ఫస్ట్ విజువల్స్ ప్రదీప్ రంగనాథన్ నటించిన ఆసక్తికరమైన సన్నివేశాన్ని రివీల్ చేశాయి. ఇది న్యూ ఏజ్ కథాంశంతో కంప్లీట్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. 'ప్రేమలు' చిత్రంతో అందరినీ అలరించిన మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని, సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్: లతా నాయుడు, కాస్ట్యూమ్ డిజైనర్: పూర్ణిమా రామస్వామి, ఎడిటర్: బరత్ విక్రమన్.

# రెట్టింపు వినోదం..



బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర ట్రైలర్ విడుదలైంది.

ఈ సందర్భంగా నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. ఈనెల 28న థియేటర్‌కి వెళ్ళి చూసి, ఎంజాయ్ చేయండి. ఇది పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రం. ఈ వేసవి సెలవుల్లో పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు. టికెట్ కొని థియేటర్‌కి వచ్చిన ప్రతి ఒక్కరూ తాము పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని భావిస్తారు' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ చెప్పారు. కథానాయకుడు నార్నే నితిన్ మాట్లాడుతూ, "ఏడాదిన్నర క్రితం మ్యాడ్ సినిమాతో మీ ముందుకు వచ్చాము. మేము కొత్తవాళ్ళం అయినప్పటికీ మాకు మంచి విజయాన్ని అందించారు. ఇప్పుడు మ్యాడ్ స్క్వేర్ తో వస్తున్నాం. ఈసారి వినోదం రెట్టింపు ఉంటుంది' అని తెలిపారు.

'ట్రైలర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. సినిమా కూడా మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది' అని మరో హీరో సంగీత్ శోభన్ తెలిపారు. ఇంకో హీరో రామ్ నితిన్ మాట్లాడుతూ, 'మ్యాడ్'కి మించి అనేలా వినోదం ఉంటుంది' అని అన్నారు.ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరించారు.

# వరల్డ్‌వైడ్‌గా రిలీజ్

డా. సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహెూ రామానుజ'. సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సుమన్, ప్రవళ్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా సాంగ్స్ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దర్శకుడు, హీరో డా.లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, 'మన తెలుగు రాష్ట్రాల్లో రామానుజా చార్యుల గురించి పెద్దగా తెలియదు.


సాయి వెంకట్

కానీ తమిళనాట ప్రతి ఒక్కరికీ ఆయన ఎవరో తెలుసు. కమల్ హాసన్ సోషల్ మూవీలో 10 పాత్రలు చేశారు. కానీ పౌరాణికంలో ఎవరూ 11 పాత్రల్లో నటించలేదు. నేను ఈ చిత్రంలో 11 పాత్రలు చేసి వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేస్తున్నా. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయండి అని మిత్రులు ఇచ్చిన సలహాతో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, సంస్కృతంతో పాటు మిగతా ప్రపంచ భాషల్లో రిలీజ్ చేయబోతున్నాం. నా బర్త్ డే సందర్భంగా సాంగ్స్ రిలీజ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ క్రమంలో నాకు నా మిత్రులు ముత్యాల రాందాస్‌తో పాటు ఇతర ఫ్రెండ్స్ డిస్ట్రిబ్యూషన్‌లో సపోర్ట్ చేస్తున్నారు. నా కూతురు ప్రవళ్లిక సినిమా నిర్మాణంలో ఎంతో పట్టుదలగా పనిచేస్తోంది. త్వరలో ఓటీటీ కూడా ప్రారంభిస్తున్నాం' అని అన్నారు.

# 30న చెన్నైలో ఉగాది పురస్కారాలు

ఏటా ఉగాది పురస్కారాలు అందిస్తూ చెన్నైలో తెలుగు వారి కీర్తిని చాటుతున్న శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఈ ఏడాది ఉగాది పురస్కారాల కార్యక్రమానికి సన్నద్ధమవుతోంది.

ఈ నెల 30వ తేదీన చెన్నై రాయపేటలోని మ్యూజిక్ అకాడెమీలో ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ ఏడాది హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, సాక్షి వైద్యకు బుట్టబొమ్మ అవార్డ్ ఇవ్వబోతున్నాం. అలాగే హీరో దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మకు బాపు, రమణ పురస్కారం అందించనున్నాం. అలాగే ఉత్తమ సంచలన చిత్రంగా పుష్ప 2, ఉత్తమ చిత్రంగా హనుమాన్, ఉత్తమ నటులుగా ప్రభాస్, అల్లు అర్జున్, ఉత్తమ నటీమణులుగా ఇంద్రజ, నివేదా థామస్.. ఇలా పలు విభాగాల్లో ఉగాది పురస్కారాలు ఇవ్వబోతున్నాం' అని తెలిపారు.

'ఒక జర్నలిస్ట్‌గా నేను అనేకసార్లు ఈ అసోసియేషన్ వారి కార్యక్రమ కవరేజ్‌కు



వెళ్లాను. ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక సంస్థ నుంచి ఉగాది ప్రత్యేక పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. మన తెలుగు వారి కీర్తిని చాటుతున్న శ్రీకళా సుధ తెలుగు అసోసియేషన్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని సినీ జర్నలిస్ట్ ప్రభు చెప్పారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణు, పర్వతనేని రాంబాబు, డా.మీనాక్షి, కేశవ చారి, ముఖ్య అతిథులుగా వై.జే.రాంబాబు, రఘు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగులకు చేయూత : దెంది శశిధర్ రెడ్డి



నవతెలంగాణ- హస్తినాపురం

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక నిరుద్యోగుల కోసం ఉద్యోగ నోటిఫికేషన్లతో పాటు స్వయం ఉపాధి పథకాలను ప్రవేశ పెట్టడం హర్షణీయమని కొనియాడారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీ ఋణాలను, ఆయా యూనిట్లకు తగినట్లుగా రూ. 3 లక్షల వరకు అందిస్తున్నారని, ఈ పథకం ద్వారా వెనక బడిన వర్గాల యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయితనిస్తుందని తెలిపారు. యువత ఆర్థిక కార్యకలాపాలలో వృద్ధి సాధించడానికి అవసరమైన యూనిట్లను సిద్ధం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడంతో పాటు నిరుదోగాన్ని అధిగమించడమే కాంగ్రెస్ లక్ష్యమని చెప్పారు. యువత భవిష్యత్ కోసం సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకొని, టార్చ్ బేరర్ లా దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-చంపాపేట్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని బైక్ షోరూం సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి (సుమారు 45) ఫుట్ పాత్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 సిబ్బంది సహాయంతో ఆ వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అతడు మృతి చెందాడని నిర్ధారించారు. తర్వాత ఆయన మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## అర్హులకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలని ధర్నా



- కుక్కలు, పందులకు నివాసమైన వనస్థలిపురం నందవనం ప్రాంతంలో పూర్తైన డబుల్ బెడ్ రూం ఇండ్లు
- సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ సర్కిల్ ఆఫీసు ఎదుట అర్హులైన పేదలందరికీ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇండ్ల సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని సర్వే చేయించి.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలందని గుర్తుచేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ డబుల్ బెడ్ రూమ్స్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వనస్థలిపురం నందవనం ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయ్యాయని, కానీ ఇప్పటికి ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఆ ఇండ్లల్లో కుక్కలు, పందులు సంసారం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. పేదలు ఇల్లు కిరాయి, పిల్లల ఫీజులు కట్టలేక బతకలేని పరిస్థితిలో జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్లో ఇండ్ల స్థలాలు, ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికీ విచారించలేదని అన్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉందన్నారు. వెంటనే వనస్థలిపురంలో, నందనవనంలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి.. ఇల్లు లేని పేదలందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, పెన్షన్ సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు అన్నారు. ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని గుర్తించి.. రాబోయే రోజుల్లో భూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు పోట్టేపాక రామస్వామి, కాశయ్య, రాధమ్మ, సరూర్ నగర్, సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సర్కిల్ సభ్యులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇఎస్‌సీఐలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులకు శిక్షణ

### మంత్రి సీతక్కకు కాలేజ్ డైరెక్టర్ వినతిపత్రం సమర్పణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సుమారు నాలుగు దశాబ్దాల కిందట హైదరాబాద్‌లో స్థాపించిన (ఇఎస్‌సీఐ) ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా ద్వారా దేశంలోని వివిధ శాఖల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది ఇంజనీర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. ఇటీవలే ఆంధ్ర ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్ ఘర్, కేరళ, మధ్య ప్రదేశ్, మణిపూర్, రాష్ట్రాలకు చెందిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల్లోని కమ్యూనిటీ లెవెల్ ట్రైనింగ్ లెవెల్ -3 అధికారులకు కూడా శిక్షణ ఇచ్చామని, ప్రభుత్వం అంగీకరిస్తే తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలోని మిషన్ భగీరథలో పని చేస్తున్న అధికారులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ఇచ్చారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలోని సెంచనరీ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన స్త్రీనిధి 12వ సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్కకు సమర్పించిన వినతిపత్రంలో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ జల్ శక్తి లోని జాతీయ జల్ జీవన్ మిషన్ ప్రధాన శిక్షణా కేంద్రంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా రిజిస్టర్ అయి ఉన్నందున తెలంగాణా లోని పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగంతో పాటుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ మరియు నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు నిపుణులతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి తెలంగాణలో మొదటి దశ కింద 20 జిల్లాల్లో బ్యాచ్‌కు 60 మంది చొప్పున ఒక్కో జిల్లాలో అయిదు ట్రైనింగ్స్ నిర్వహించడం వలన ఏడాదికి 12 కోట్లు ఖర్చు అవుతాయని, ఈ విధంగా రాష్ట్రం మొత్తంలో కేవలం ఒక ఏడాది కాలంలో వేలాదిమంది గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రికి డైరెక్టర్ ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని డైరెక్టర్ శాలువాతో సన్మానించారు. వినతిపత్రం సమర్పించిన బృందంలో డైరెక్టర్‌తో పాటుగా అధికారులు ఎం. రాజశేఖర రెడ్డి, అనిత అగర్వాల్, డాక్టర్ చంద్రకళ, శ్రీధర్ బాబు, లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి. రాజారావు పద్మావతి, కవిత, జయ నరేష్ తదితరులున్నారు.

## అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

- ఏటీఎంలో నగదు చోరీ ..
- రూ.9,50,000 నగదు స్వాధీనం



నవతెలంగాణ -హయత్‌నగర్

ఏటీఎంలో ఉన్న నగదును చోరీ చేసిన అంతరాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీ షరీఫ్‌కు చెందిన రాహుల్ అలియాస్ రాహుల్ ఖాన్ ఇతని స్వస్థలం రాజస్థాన్. పటాన్‌చెరువులో నివాసం ఉంటున్న ముస్తాకీం ఖాన్.. ఇతని స్వస్థలం రాజస్థాన్. షారుబషీర్ ఖాన్ అలియాస్ సారూప్.. స్వస్థలం రాజస్థాన్. హర్యానాలో నివాసం ఉంటున్న సాబుద్దీన్ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ నెల 2న మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని రావిరాల గ్రామంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంకులో ఉన్న ఏటీఎం చోరీకి వీరంతా పథకం పన్నారు. విజయం సాధించారు. చోరీ తర్వాత మరోసారి నిందితులు మొదట ఉపయోగించిన కారుని ఈ నెల 24వ తేదీన ఏటీఎం చోరీకి నగరానికి వచ్చి కొంగరకలాన్‌లో వారంతా రెక్కీ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు.. వారితోపాటు రాహుల్ ఖాన్, ముస్తకి ఖాన్, షకీల్ ఖాన్, వాహీర్ ఖాన్, షారుబషీర్ ఖాన్‌లను అదుపులో తీసుకున్నారు. మొత్తం తొమ్మిది లక్షల 50 వేల నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్టు సీపీ తెలిపారు. ఆయన వెంట మహేశ్వరం డీసీపీ, ఎస్ఓటిడిసిపి, సిసిఎస్ పోలీసులు, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

## 'భూదానకర్త ధర్మ బిక్షం'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

భూమి లేని పేదలకు భూదానం చేసిన గొప్ప త్యాగ శీలి కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం అని సీపీఐ నాయకులు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 14వ వర్ధంతి వేడుకలను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు హాజరై ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రా చారి, ముత్యాల యాదిరెడ్డి లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రూపుమాపెందుకు ప్రజా పోరాటం చేశారన్నారు. భూమి లేని వారికి వందలాది ఎకరాల సాగు భూమిని పంచిన త్యాగ మూర్తి కామ్రేడ్ ధర్మ బిక్షం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని జైలు జీవితం అనుభవించిన కమ్యూనిస్టు యోధుడన్నారు. పేద విద్యార్థులకు స్వచ్ఛందంగా హాస్టల్ నిర్వహించి, వారికి సేవలు అందించిన గొప్ప సేవా దృక్పథం కల్గిన నాయకుడు అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు నాటికి, నేటికీ ఏనాటికైనా వెల కట్టలేనివన్నారు. నిరంతరం ప్రజల మనిషిగా ప్రజల్లో ఉంటూ చిరస్మరణీయులుగా చరిత్ర పుటల్లో నిలిచారన్నారు. అలాంటి గొప్ప నాయకుల ఆలోచనకు అనుగుణంగా యువత నడవాల్సిన అవసరం ఉందన్నారు. నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా, కాటి అరుణ, వట్టి నవనీత, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు తైలి మధు, మండల పార్టీ నాయకులు పొన్నాల యాదగిరి, ఆమనగంటి వెంకన్న, రాములు, పుల్లయ్య, నిరంజన్, నాగవల్లి యాదగిరి పాల్గొన్నారు.



నవతెలంగాణ -నాగోల్

సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం, ఎస్ఏ. దాంగే భవన్లో బుధవారం ప్రజల మనిషి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, నల్లగొండ పార్లమెంటు మాజీ సభ్యులు బొమ్మగాని ధర్మ బిక్షం 14వ వర్ధంతిని ఉడుత్తల మల్లేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు, మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ సమాజంలోని అసమానతులను తొలగించడానికి, విద్యాభ్యాసం కోసం ఆనాడు స్వచ్ఛందంగా పాఠశాలలు ఏర్పాటు చేసి, యువతరానికి విద్యా జ్ఞానాన్ని ధర్మ బిక్షం అందించారని అన్నారు. ప్రత్యక్షంగా పోరాటాలకు సంఘాలను స్థాపించి, నిజాం ముష్కరుల మీద ఎన్నో దాడులకు నాయకత్వం వహించిన వీర యోధుడు ధర్మబిక్షం అని వివరించారు. బాంచన్ నీ కాలుమొక్త అనే తెలంగాణ మట్టి మనుషులకు బందుకులు, గుతపాలు పట్టించి, భూమి, బుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం, నిజం రాజరికాన్ని అంతమోదించడంలో కీలక పాత్ర పోషించిన మహాయోధుడని కొనియాడారు. ఆయన స్వాతంత్రానంతరం కూడా బడుగు, బలహీన వర్గాలు, చేతివృత్తుల, కార్మిక కర్షకుల, సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో అనేక పోరాటాలు నిర్మించి.. నాయకత్వం వహించి ముందుండి పోరాడిన గొప్ప ప్రజా నాయకుడిగా, ప్రజల మనిషిగా, చట్టసభలలో తన గొంతును వినిపించి అనేక సమస్యల పరిష్కారం కోసం తన కొన ఊపిరి వరకూ పోరాడిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రదీప్ కుమార్, రవికుమార్, పి. ఆమని, ఎం. అఖిల, చెరుకు నాగభూషణం, ఈశ్వర్ బి. రాములు, ఎస్.సైదారావు, కే.జగన్ యాదవ్, గోపాల్, ఉషారాణి పాల్గొన్నారు.

## 'బైగల్ల' జ్ఞాపకార్థం చలివేంద్రం



నవతెలంగాణ - చంపాపేట్

స్వర్గీయ బైగల్ల బాబయ్య పోన్నమ్మల జ్ఞాపకార్థకంగా చంపాపేట్ చౌరస్తా నందు బైగల్ల రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమణ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు అందరు కలసి ఇటువంటి సేవా కార్యక్రమాలను 13 సంవత్సరాలుగా చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బైగల్ల రవీందర్ సోదరులు అశోక్, జగదీశ్వర్, మాతంగి నరసింహ, మాతంగి యాదగిరి, యాచారం ఈశ్వర్, పాశం శ్రీశైలం, ఆనంద్ నాయుడు, వెంకట్ నారాయణ, జగదీష్, బీజేపీ సీనియర్ నాయకులు పాశం శ్రీశైలం, రాంపురం శ్రీనివాస్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాలలో 'క్రీడో' కార్యక్రమం




నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ ఆర్ఎన్‌రెడ్డి నగర్‌లోని లార్డ్స్ పాఠశాలలో ప్రాథమిక విద్యార్థుల ప్రత్యేక శిక్షణ(క్రీడో) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు చేసిన ప్రయోగాలు, ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు చిన్ననాటి నుండి చదువు మీద సంపూర్ణ అవగాహన, ఆసక్తి కలుగజేస్తే విద్యార్థులకు భవిష్యత్ లో మంచి స్థాయిలో ఉంటారని అన్నారు. ఆ విద్య మరచిపోవడం జరగదని అందుకే లార్డ్స్ విద్యాసంస్థ ప్రీ ప్రైమరీ చిన్నారులకు వినూత్న విద్యా విధానాన్ని (క్రీడో ) అవలంభిస్తుందని తెలియజేశారు. చిన్నారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం తల్లీదండ్రులు మాట్లాడుతూ.. లార్డ్స్ పాఠశాలలో నేర్పే చదువును చూస్తే, పిల్లల భవిష్యత్ మీద సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. అనంతరం స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ స్కూల్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ ఎస్ కిషన్ రావు, ఇంచార్జి ప్రియాంక ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్ మృతిపై న్యాయపోరాటం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పరిధిలో జరిగినటువంటి పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై న్యాయ విచారణ చేయాలని కోరుతూ బుధవారం ఎల్బీనగర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావుల విగ్రహాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ ఫాస్టర్స్ వనస్థలిపురం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాగోల్ పాస్టర్ అసోసియేషన్ తెలంగాణ పాస్టర్స్ మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్‌ది హత్యనా, రోడ్డు ప్రమాదామా అని దర్యాప్తు చేయించి.. సమగ్ర విచారణ చేయాలని కోరారు. గత కొన్ని రోజులుగా క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వారికి భరోసా కల్పిస్తూ న్యాయం చేయాలని కోరారు.

## 'ట్రైకార్ రుణాలను ఎత్తివేసే కుట్రకు వ్యతిరేకంగా పోరాడుదాం'



నవతెలంగాణ - చంపాపేట్

బకాయి పడ్డ 219 కోట్లు ట్రైకార్ రుణాలను ఎత్తివేసే కుట్రకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై పోరాడుదాం అని తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా సమితి జాతీయ నాయకులు ఆర్. శంకర్ నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. రఘు అన్నారు. గిరిజన సమైక్య, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం, గిరిజన సంఘం సంయుక్త సమావేశాన్ని యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఐఎస్‌సదన్ చౌరస్తా వద్ద సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం. బాలునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిందన్నారు. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 30 వేల మంది గిరిజన యువతీ యువకులకు రుణాలను మంజూరు చేసిందని, చెక్కులు సైతం సిద్ధం చేసి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. గత ఆరు నెలల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేసి, లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇస్తూ వస్తుందన్నారు. అకస్మాత్తుగా ఈ నిధులను విడుదల చేయకుండానే రాజీవ్ యువ వికాసం పేరుతో బకాయి పడ్డ రుణాలను పూర్తిగా రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. గిరిజన లబ్దిదారులకు ఇవ్వాల్సిన రూ.219 కోట్లను తక్షణం విడుదల చేయాలని గిరిజన సంఘాల జేఏసీ పక్షాన చలో మాసబ్‌ట్యాంక్ గిరిజన సంక్షేమ భవన్‌లో వచ్చే నెల 7న పిలుపునివ్వడం జరిగిందన్నారు.

కొత్తగా రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకోవాలని హడావిడిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు మూడు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లలో లక్షలాదిమంది రుణాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి.. ఒక్కో కార్పొరేషన్ నుండి అర్హుల లిస్టును ప్రకటించాయని తెలిపారు. గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ 30 వేల మందిని లబ్దిదారులుగా గుర్తించి మంజూరైన లిస్ట్‌తో పాటు 219 కోట్ల రూపాయల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందన్నారు. ట్రైకార్ తో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లలో సైతం వేలాదిమంది లబ్దిదారుల శాంక్షన్ లిస్టు చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపాయని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల బకాయిలను విడుదల చేయకుండా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లలో శాంక్షన్ అయినా లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన కలుగుతోందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి కూడా తీవ్ర ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎందుకంటే రుణం తీసుకోకపోయినా శాంక్షన్ అయినట్టు ఒక్కసారి ఆన్ లైన్లో దరఖాస్తు అయినా తర్వాత తిరిగి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రిజెక్ట్ అవుతుందని చెప్పారు. దీంతో లక్షలాదిమంది యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా గిరిజన సమైక్య నాయకులు కార్యదర్శులు జే శివ నాయక్, ఎన్ రూప్సింగ్ నాయక్, ఈ. శ్రీను నాయక్, వి రమేష్ నాయక్, ఎన్. రాజు నాయక్, ఆర్. బంగారి బాయి, హైదరాబాద్ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏ కృష్ణ నాయక్, శ్రీను నాయక్, హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు ఎం. రామ్ కుమార్, గిరిజన జిల్లా అధ్యక్షులు ఎం. గోపీ నాయక్, గిరిజన జిల్లా నాయకులు జే. కష్మి బాయి, గిరిజన సమైక్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వసతులు కల్పించాలని వినతి



నవతెలంగాణ - చంపాపేట్

హైదరాబాద్ సౌత్ పరిధిలో భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాల మీద మౌలిక వసతులు, ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని కోరుతూ జాయింట్ లేబర్ కమిషనర్‌కు బుధవారం అధ్యక్షులు మీనా, కార్యదర్శి ఎం శ్రవణ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సౌత్ పరిధిలో వేలమంది వలస కార్మికులు ఉండే 21 అడ్డాలున్నాయని తెలిపారు. ఈ అడ్డాల మీద కనీస సదుపాయాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి నెలలో సీఐటీయూ కార్మికుల సమస్యలపై చేసిన సర్వేలో మొత్తం 7 నియోజకవర్గాలు, 50 బస్తీలు, అనేక నివాస ప్రాంతాల్లో వేలాది మంది వలస కార్మికులు వివిధ రాష్ట్రాల నుండి హైదరాబాద్‌కు వచ్చి అడ్డాల మీద రోజువారి పని కోసం ఎదురు చూస్తున్నారని వివించారు. అడ్డాల మీద నిలువ నీడలేక, తాగునీరు కూడా లేదనే విషయాన్ని గమనించినట్టు తెలిపారు. వీరందరికీ నియోజకవర్గాల వారీగా బస్తీల్లో, నివాస ప్రాంతాల్లో కౌంటర్లు పెట్టి భవన నిర్మాణ కార్మికులు ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవడానికి నియోజక వర్గాలలో ఉన్న మా సీఐటీయూ బాధ్యులు ప్లాన్ చేస్తున్నారని తెలిపారు. దానికి అనుగుణంగా నియోజక వర్గాల వారీగా ఉన్న మీ ఎఎల్వోలను పంపించి, అక్కడనే థంబ్ తీసుకుని అక్కడికక్కడే అప్రూవల్ చేయడానికి మీ ఎఎల్వోల ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. వారికి ఈ వెసులుబాటు కల్పించి, ఇన్సూరెన్స్ కార్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

## ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం




నవతెలంగాణ- చంపాపేట్

చంద్రాయణగుట్టలోని చారిత్రక స్వయంభు లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవ స్థానం ధర్మకర్తల మండలిని దేవా దాయశాఖ విస్తరించింది. ఏడుగురు సభ్యులు ఉండాల్సిన ధర్మ కర్తల మండలిలో కొద్ది రోజుల కిందట ఐదుగురు సభ్యులు నియమితులయ్యారు. అసంపూర్తిగా ఉన్న కమిటీలో మిగతా స్థానాలను భర్తీ చేస్తూ దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. సభ్యులుగా కె. బబిత, పి. మల్లికార్జున్ గౌడ్లను నియమిస్తూ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నవతెలంగాణ

10

సమగ్ర తెలుగు దినపత్రిక

## మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com


## 'పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలి'

**నవతెలంగాణ-శామీర్ పేట**



ధరణిలో పెండింగ్ దరఖాస్తులు త్వరగా క్లియర్ చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డిని ఆదేశించారు. బుధవారం మూడు చింతలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణిలో పెండింగ్ వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణిలో ఎన్ని పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని ఎంఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. అంతకుముందు నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వెంకట నర్సింహారెడ్డి, ఆర్ఐలు రజనీకాంత్, సరస్వతి, సర్వేయర్ కవిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మల్లాపూర్ లోని స్వాగత్ కన్వెన్షన్ హాల్ లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఆలేటి రమేశ్ కుమారుడు నిహాన్ష్ మొదటి జన్మదిన వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.-నవతెలంగాణ - చర్లపల్లి

## బ్రహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



**నవతెలంగాణ-కాప్రా**

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీ శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జంపాల్‌రెడ్డి, మోర మల్లారెడ్డి, చారి, ఉల్లెమ్ బాలరాజు, నగేష్, మురళీ చారి, పూస రమేష్, నరేందర్ మరియు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా అభివృద్ధికి కృషి చేయాలి



- బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ

**నవతెలంగాణ - చర్లపల్లి**

రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సూచించారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీలో ఇటీవల జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్షుడిగా గెలుపొందిన రిటైర్డ్ ఎస్ఎఫ్‌సీ ఉద్యోగి కోతి యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి దామెర అంజయ్యలను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పూల బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర సమన్వయకర్త విష్ణు, దళిత సంఘాల జేఏసీ నాచారం డివిజన్ కమిటీ కన్వీనర్ కరాటే శ్రీరామ్, ఎంఆర్‌పీ ఎస్ నాయకులు అంజి, కొమ్మగాళ్ళ వెంకటేష్, సోమయ్య, సంతోష్ తదితరులున్నారు.

## మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

**నవతెలంగాణ - జవహర్ నగర్**



మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాల ప్రకారం కొత్తపల్లి ఇందుమతి, ఆమె సోదరుడు, తల్లిదండ్రులతో కలిసి గబ్బి లా లపేటలో నివసిస్తున్నారు. గత మూడేండ్లుగా ఆమె తల్లి కె. మంజుల (46) మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ నెల 20 వ తేదీన ఇందుమతి తండ్రి మరియు సోదరుడు డ్రైవింగ్ పనికి వెళ్లారు. ఇందుమతి ఉదయం స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసేందుకు ఇంటర్నెట్ సెంటర్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆమె తల్లి ఇంట్లో కనిపించలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం క్రితం ఇలానే ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లి యాదగిరిగుట్టలో కనిపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మేరు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు మాడిశెట్టి దివ్యలత మేరు

**నవతెలంగాణ-జవహర్ నగర్**

మేరు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు మాడిశెట్టి దివ్యలత మేరు అన్నారు. హైదరాబాద్ కోఠిలోని బీసీ సాధికారిత భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రిజిస్టర్ మేరు సంఘాల ఐక్యవేదిక జేఏసీ కార్యవర్గ సమావేశంలో 2025- 2027 రెండేండ్ల కాలానికి మెజార్టీ సభ్యుల అభిప్రాయంతో ఏకగ్రీవంగా మేరు జేఏసీ రాష్ట్ర మహిళా కమిటీని ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలుగా మాడిశెట్టి దివ్యలత మేరు, ప్రధాన కార్యదర్శిగా జిల్లెల్ల శ్రీవాణి మేరు, అడ్వైజరీ కమిటీ చైర్మెన్‌గా బాయక్క మేరు, గ్రేటర్ హైదరాబాద్ ట్విన్ సిటీ మహిళ అధ్యక్షురాలుగా పోలంపల్లి సంధ్యారాణి మేరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాడిశెట్టి దివ్యలత మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో ప్రాధాన్యం మరింతగా పెంచాలని, కుల సంఘాల్లో మహిళలకు అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. తనకు అవకాశం ఇచ్చిన జేఏసీ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు ఎన్నికైన నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యవర్గ సభ్యులు, మహిళ నాయకురాళు, వివిధ రిజిస్టర్ సంఘాల అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వాటర్ సమస్యను పరిష్కరించండి



- వాటర్ వర్క్స్ డీజీఎంకు బీజేఆర్ కాలనీవాసుల వినతి

**నవతెలంగాణ-కాప్రా**

జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో గవర్నమెంట్ హాస్పిటల్ పక్కనే ఉన్న రోడ్డు నెంబర్ 19లో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని బీజేఆర్ కాలనీవాసుల వాటర్ వర్క్స్ డీజీఎం బుధవారం వినతిపత్రం అందజేశారు. సమస్యను ఇటీవల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన వాటర్‌వర్క్స్ డీజీఎంతో మాట్లాడి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో బీజేఆర్ కాలనీ వాసులు ఎస్.ఏ. రహీం, గగన్ కుమార్, నర్సింహ్మా చారి, రవి నాయక్, నాగేష్ ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. డీజీఎం స్పందిస్తూ మంచినీటి సమస్యను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తామని తెలిపారు.

## ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- ఇఫ్తార్ విందులకు ప్రభుత్వ చెక్కుల పంపిణీ

**నవతెలంగాణ - చర్లపల్లి**



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మసీదులకు ఇఫ్తార్ విందు కొరకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.2 లక్షల చెక్కులను మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ముస్లిం పెద్దలకు అందజేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఆరు మసీదులకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటుకు చెక్కులను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ బాషిత్ ఖాన్, ఎండీ అల్తాఫ్, ఎండీ మునీర్, ఎండీ అక్బర్, ఉస్మాన్ ఈగని మసీద్ అధ్యక్షులు ఎండీ జాకీర్ అలీ, మసీద్ ఈ జమాల్ అధ్యక్షులు ఎండీ నయీమ్, జమా మసీద్ అధ్యక్షులు ఎండీ హబీబ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎండీ హఫీజ్, జమా మసీద్ ఈ అష్రఫ్ అధ్యక్షులు ఎండి హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఎండి ఖాసిం, మహమ్మదీయ మసీద్ అధ్యక్షులు ఎండి అక్బర్, ఈద్గా మసీద్ అధ్యక్షులు ఉమర్, తదితరలున్నారు.

## శివాలయం పున:నిర్మాణానికి సహకరిస్తా : ఎమ్మెల్యే బండారి

**నవతెలంగాణ-ఉప్పల్**



నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. చిల్కానగర్ డివిజన్ లో నిర్మిస్తున్న శివాలయం పున:నిర్మాణ మహోత్సవ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్కానగర్ శివాలయం పున:నిర్మాణంలో తన భాగస్వామ్యం పూర్తిగా ఉంటుందన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు సహకరిస్తానని తెలిపారు. అనంతరం శివాలయం కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌లు శివాలయం పున:నిర్మాణం మొదటి స్లాబ్‌కి కావాల్సిన కాంక్రీట్, ఆర్ఎంసీని సొంత నిధులతో ఇస్తున్నారని తెలిపారు. బన్నాల గీత ప్రవీణ్ మొదటి స్లాబ్‌కు కావాల్సిన స్టీల్ మొత్తాన్ని తమ సొంత నిధులతో సమకూరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అన్ని డివిజన్ల అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి కృషి చేస్తున్నారు



- మా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతుల ఎమ్మెల్యే కాదు..
- అభివృద్ధి వైపు నడిపే ఎమ్మెల్యే
- బీఆర్ఎస్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరి నియోజకవర్గంలో అన్ని డివిజన్ల అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి చేస్తున్నారని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్ బాగ్‌లోని బృందావన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకులు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలిచిన 15 నెలలో నే కోట్లాది రూపాయల నిధులతో మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమస్యలపై వినతి పత్రాలను అందజేస్తూ, నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఆర్ కే పురం బ్రిడ్జి, వాజ్‌పేయి నగర్, గౌతమ్ నగర్‌ల వద్ద ఆర్‌యూబీ నిర్మాణాలకు నిధులను తెచ్చిన ఘనత ఎమ్మెల్యే మర్రికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధిని మర్రి చేస్తున్నారని అన్నారు. మా ఎమ్మెల్యే వినతుల ఎమ్మెల్యే కాదని, అభివృద్ధి వైపు నడిపే ఎమ్మెల్యే అని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం, ఫైర్ స్టేషన్‌కు స్థలం, పీహెచ్‌సీల ఏర్పాటు, కోర్టు బిల్డింగ్‌కు రూ.48 కోట్లను మంజూరులో ఎమ్మెల్యే కృషి ఉన్నదన్నారు. ఎమ్మెల్యే కృషితో మంజూరైన పనులను కొంతమంది తామే చేయించినట్టు ప్రచారం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మేమే అభివృద్ధి చేస్తున్నాం అని చెప్పుకునేటోళ్లు ఏమి అభివృద్ధి చేశారో ఆధారాలతో ప్రజలకు చూపెట్టాలన్నారు. తమ ఎమ్మెల్యే ఏం సాధించారో పూర్తి వివరాలు ప్రజలకు వివరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవాస్తవాలను ప్రచారం చేసుకోవడాన్ని ప్రజలే గుర్తిస్తారని, తమ ఎమ్మెల్యే పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురాం రెడ్డి, మురుగేష్, మేకల రాము యాదవ్, అనిల్ కుమార్, నర్సింగ్ రావు, భాగ్యనందరావు, ఉస్మాన్, గుత్తి రామచందర్, వంశీ ముదిరాజ్, జీకే సాయి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి



- హైడ్రా అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేసి, అక్రమ నిర్మాణాలను తొలగించాలి
- మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నామని తమ కాలనీవాసులపై అసెంబ్లీలో ఆరోపించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కాలనీలో రోడ్డు ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలను తొలగించాలన్నారు. హైడ్రా అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేసి, తమ కాలనీకి న్యాయం చేయాలని, రోడ్డు ఆక్రమణతో కాలనీలోకి అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు, వాహనాల రాకపోకలకు, వర్షాకాలంలో నీరు నిలబడడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ప్రజాప్రతినిధులు కావాలని అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజాప్రతినిధులుగా ఉండి అలా మాట్లాడటం సరికాదని, ఇప్పటికైనా ఏరియాను పరిశీలించి, అక్రమ నిర్మాణాలను తొలగించి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ జె. శ్రీరామ్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభారాణి, జాయింట్ సెక్రెటరీ బాలోజీ నాయక్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ శ్రీనివాస్, వెంకటాద్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సెక్రటరీ విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నెంబర్‌లు దేవరాజ్, రవీందర్, అసోసియేషన్‌ల సభ్యులు, పాల్గొన్నారు.

## సూర్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్

**నవతెలంగాణ - జవహర్ నగర్**



సూర్యనారాయణ మృతి కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటని మేడ్చల్ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. 20 ఏండ్లుగా కమ్యూనిస్ట్ పార్టీకి ఎనలేని సేవలందించిన సూర్య నారాయణ బుధవారం గిరిప్రసాద్ నగర్‌లోని తన సొంత నివాసంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ నాయకులు సూర్యనారాయణ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, సహాయ కార్యదర్శి మోతే రాజేశ్వరి, ఏఐటీసి మండల అధ్యక్షులు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి కొండ సత్యం, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, మహిళా సమైక్య నాయకురాలు కొత్తపెల్లి కవిత, అనసూయ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ ప్రబోధకులు ప్రవీణ్ పగడాల మరణం బాధాకరం



- సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలి
- దమ్మాయిగూడ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు డాక్టర్ పల్లె హర్షవర్ధన్

**నవతెలంగాణ-కీసర**

క్రైస్తవ ప్రబోధకులు ప్రవీణ్ పగడాల మరణం బాధాకరమని దమ్మాయిగూడ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు డాక్టర్ పల్లె హర్షవర్ధన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మృతి చెందిన ప్రవీణ్ పగడాల అకాల మరణంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా అక్కడక్కడ ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. ప్రభుత్వాలు క్రైస్తవ సంఘాలకు, క్రైస్తవ సంస్థలకు చట్టపరంగా భద్రత కల్పించాలన్నారు. దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్ పగడాల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. వారి కోసం అందరూ ప్రార్థించాలని ప్రెసిడెంట్ పి. హర్షవర్ధన్ సెక్రెటరీ, పాస్టర్ ఫిలిప్ మాదాసు, కమిటీ సభ్యులు రెవరెండ్, ఎంపాల్ డేవిడ్ కోరారు.

## అర్హులు 'రాజీవ్ యువ వికాసం పథకం' దరఖాస్తు చేసుకోవాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జిల్లాలో అర్హత, ఆసక్తి గల బీసీ, ఎంబీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ htpp;//tgobmmsnew.cgg.gov.in ద్వారా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. అర్హతా ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరాలు htpp;//tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ ఏప్రిల్ 5వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి ఆదాయ పరిమితి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది జులై 1వ తేదీ నాటికి వయో పరిమితి 21 నుంచి 55 ఏండ్లు ఉందని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర సంబంధిత రంగాల వారికి వయో పరిమితి 21 నుంచి 60 ఏండ్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం ( తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది), డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం వారికి), పట్టాదార్ పాస్ పుస్తకం (వ్యవసాయ రంగం వారికి), సదరం సర్టిఫికెట్ (వికలాంగులకు), పాస్ పోర్టు సైజ్ ఫొటో ధ్రువపత్రాలు అవసరం ఉంటాయని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోంది : కౌకుంట్ల చంద్రారెడ్డి

**నవతెలంగాణ-కీసర**



కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలు విభిన్నంగా ఉన్నాయని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. "లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద నాగారం ప్రాంతంలో ఒక ప్లాట్ రెగ్యులరైజేషన్ ఫీజు రూ.2లక్షల నుండి మూడు లక్షలు వసూల్ చేస్తోందన్నారు. ఇది సాధారణ ప్రజలపై ఆర్థిక భారమైందన్నారు. అనధికారిక లే అవుట్లను క్రమబద్ధీకరించడానికి ఈ పథకం కింద ప్లాట్ యజమానులు రెగ్యులరైజేషన్ ఫీజులను చెల్లించాలన్నారు. ఈ ఫీజులు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాగారం వంటి ప్రాంతాల్లో ఈ ఫీజులు భారీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటం చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- గుండ్లపోచంపల్లి మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి



**నవతెలంగాణ-మేడ్చల్**

గుడ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కూర్చిస్తున్నట్టుగా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి అన్నారు. ఇటీవల జరిగిన మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆదిలక్ష్మి దాదాపు 1500 సభ్యత్వాలు చేపించి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావుకు అందజేసినట్టుగా తెలిపారు. ఈ సందర్భంగా వారికి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమక్షంలో బహుమతి అందజేసినట్టుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబ, రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందుకు మంత్రికి ఆహ్వానం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇఫ్తార్ విందు కార్యక్రమానికి, ముఖ్య అతిథులు గా తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ని, టీపీసీసీ అధ్యక్షులు, మహేష్ కుమార్ గౌడ్‌లను, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి, ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తాలో ఉన్న ఈద్గా వద్ద శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, ఇస్మాయిల్, సుల్తాన్, షబ్బీర్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలకు ఆహ్వానం



నవతెలంగాణ-నిజాంపేట్

రంజాన్ వేడుకలకు హాజరవ్వాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హనుమంత రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి రఫీయా బేగం బుధవారం ఆహ్వానిం చారు. అనంతరం కొలన్ మాట్లాడుతూ మైనార్టీ సోదరులందరూ రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ తరఫున తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, బక్షా తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి తీరుతామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పలు ఆహ్వానాలు, వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజులలో నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పేరు గొప్ప ఊరు దిబ్బ లాగా తయారు చేసిన ఈ ప్రాంతాన్ని సుందరీకరణ చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

## ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవులు ఎమ్మెల్యే



● కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజలకు ఆపద కలిగితే ఆపద్బాంధవుడిలా అభయమిచ్చే గొప్ప నాయకుడు బీఆర్ఎస్ విప్,స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ అన్నారు. గాజులరామారం డివి జన్ బాలయ్యనగర్ ప్రాంతానికి చెందిన కొరవర నర్సమ్మ భర్త బాసప్ప, రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్‌లు గత రెండు రోజుల క్రితం వారి ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యేను ఆశ్రయించారు. వారి ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిపై చలించిన ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొరవర నర్సమ్మ భర్త బాసప్ప రూ.2,00,000, రంగారెడ్డినగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్ రూ.2,00,000.లక్షలకు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కార్పొరేటర్, అయా డివిజన్‌ల ప్రజాప్రతి నిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎల్‌ఓసీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం సహాయనిధి అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, గాజులరామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నగేష్, ఓంకార్ రెడ్డి, సుధాకర్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రుణాలు వైశ్యులు సద్వినియోగించుకోవాలి

● ఆర్యవైశ్య సంఘం జగద్గిరిగుట్ట ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్ర ప్రభుత్వం వైశ్య కులస్తుల కోసం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్(రాజీవ్ యువ వికాసం) (ఎకనామికల్ వీకర్ స్కీం) రుణాలను ప్రతి పేద వైశ్య కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జగద్గిరిగుట్ట ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత నేతృత్వంలో గొప్ప విజయం సాధించడం శుభసూచికమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైశ్య కులస్తులతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్టలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో బుధవారం వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మెన్ రేగూరి ప్రవీణ్ గుప్త మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ ద్వారా తమ కులస్తులకు రూ.6000 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ రుణాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. వైశ్య కులస్తులు సామాజికంగా, రాజకీయంగా ఎదగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమీపంలోని మీ సేవ కేంద్రాలలో సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, అగ్ర నేతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి దొంతుల అన్నయ్య గుప్తా, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లింగా వేణుగోపాల్ గుప్తా, లెన్స్ కేర్ నాగరాజు గుప్తా, వైశ్య సంఘం కమిటీ సభ్యులు గోలి శంకర్ లింగం గుప్తా, గోలి రాజయ్య గుప్తా, అంగడి సత్యనారాయణ గుప్తా, పాండురంగం గుప్తా, బిజ్జాల నాగరాజు గుప్తా, ఏ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కారం



● కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధి అంజయ్యనగర్ ప్రాంతంలో సమస్యలపై స్థానికులతో కలిసి పాదయాత్ర చేశారు. జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన రోడ్డులను త్వరలోనే వేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేందర్, మురళి, బుచ్చిబాబు, గణేష్, సోమేశ్, వీరేశం, కృష్ణ, మారుతి, భోగేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్య లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం.

సమస్యలు లేని డివిజన్‌గా జగద్గిరిగుట్ట డివిజన్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధి, సోమయ్య నగర్ ప్రాంతంలో స్థానిక ప్రజలు మంచినీటి, డ్రయినేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానిక కార్పొరేటర్‌కు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ గ్రేటర్‌లోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ రిజ్వాన్, డివిజన్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్, సోమయ్య నగర్ వాసులు నరేష్, సురేష్, రవి, తిరుమలేష్, సంగమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## నేడే స్వీట్ వన్ షాప్ ప్రారంభం

● నిజాంపేట్‌లో ప్రముఖ సినీనటి నాగళ్ళ అనన్యచే ప్రారంభం ● ప్రత్యేక ఆఫర్ .. రూ.199లకే కిలో స్వీట్ ● మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ వెల్లడి



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట్‌లో స్వీట్ వన్ షాప్‌ని నేడు ప్రముఖ సినీనటి నాగళ్ళ అనన్యచే ప్రారంభిస్తున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ... తమ షాపులో సాంప్రదాయ రుచితో కూడిన అన్ని రకాల స్వీట్లు కాకినాడ కాజా మడత కాజా, లడ్డు జిలేబి అరిసెలు అదేవిధంగా ప్రారంభోత్సవం సంద ర్భంగా 199 రూపాయలకే కిలో స్వీట్ అందిస్తున్నామని తెలిపారు. మా స్వీట్ వన్ షాప్ లో స్వచ్ఛతకు నాణ్యతకు మన్నికైన సీట్లను అందిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిజాంపేట్ పరిసర ప్రాంత ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

## నిధులు మంజూరు చేయాలి

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యల పరి ష్కారానికి, సత్వరం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో కలిసి ఎమ్మెల్యే వినతి పత్రాన్ని అందజేశారు. అందులో భాగంగా నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్‌ల నిర్మాణం, పార్కులు, స్మశాన వాటికల నిర్మాణం (మిగిలిన పనులకు) సుమారుగా రూ. 25-30 కోట్ల నిధులను సత్వరం మంజూరు చేయాలని కోరారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని, హైదర్ నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163లలో నిర్మాణ అనుమతులను నిలిపి వేసి, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ, ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశారని తెలిపారు. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులపై, రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులపై నెపం దాట వేస్తున్నరని తెలిపారు.

అదేవిధంగా జేఎన్‌టీయూ వెనుక ఉన్న సాయి నగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని, 2014కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

### కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ఫిక్స్ డిపాజిట్ బాండ్లు..

కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలకు బాలానగర్‌కు చెందిన మధుకర్, కూకట్‌పల్లికి చెందిన లోకేష్, ప్రశాంత్ నగర్‌కు చెందిన సాయి ప్రదీప్‌లకు ఒక్కొక్కరికి రెండున్నర లక్షలు ఫిక్స్ డిపాజిట్ బాండ్లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూఓ పాండు, మేడ్చల్ జిల్లా, హెచ్‌డబ్ల్యూఓ కొండల రావు, వి.నరసింహ జె.పండు తదితరులు పాల్గొన్నారు.



## బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలి



● సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరామయ్య డిమాండ్

నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని అత్యంత రద్దీ గల ప్రగతి నగర్‌లో వంద ఫీట్ల రోడ్డు నందు బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబీర్ అలీకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రగతి నగర్‌లో గతంలో మూడు బస్సు షెల్టర్లు ఉండేవి. అందులో ఒకటి కోతుల బొమ్మ సెంటర్లో, రోడ్డు వెడల్పుల్లో భాగంగా తొలగించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య, ట్రిప్పుల సంఖ్య పెరగడం బస్సు ప్రయాణికుల సంఖ్య కూడా పెరగడంతో ప్రగతి నగర్లో రద్దీ విపరీతంగా పెరిగిందని ఆయన తెలిపారు. ఈ కారణంగా బస్సు ప్రయాణికులకు కావలసిన బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బస్సు షెల్టర్లు లేని కారణంగా వృద్ధులు రోడ్లపై నిలబడలేక అస్వస్థతకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రగతి నగర్‌లో ప్రధాన చౌరస్తాలైన అలీప్ చౌరస్తా, కాకతీయ హిల్స్ చౌరస్తా, మూడు కోతుల బొమ్మల చౌరస్తాలలో నూతన బస్సు షెల్టర్‌లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన వివరించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఆర్టీసీ వారికి ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సీపీఐ(ఎం) కమిటీ సభ్యులు ఆర్.సంతోష్, సీపీఐ(ఎం) బాచుపల్లి మండల నాయకులు బాల వెంకటేశ్వర, ఎస్.బాలపీరు పాల్గొన్నారు.

## మహిళలకు వృత్తి నైపుణ్యాల శిక్షణకు జెఎస్ఎస్..



● వరంగల్ జిల్లా జన శిక్షణ సంస్థాన్ చైర్మెన్ రాంభాగ్ ప్రకాష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

జన శిక్షణ సంస్థాన్ అక్షరాస్యులు, నిరక్షరాస్యులైన ప్రతి మహిళకు, వృత్తి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి మహిళలకు వ్యాపారాలు చేసుకోవడానికి జెఎస్ఎస్ సంస్థ మద్దతు ఇస్తుందని రాంబాగ్ ప్రకాష్ తెలిపారు. జన శిక్షణ సంస్థాన్ (జెఎస్ఎస్) ఆధ్వర్యంలో, హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా పారిశ్రామిక ఉత్పత్తి ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా జన శిక్షణ సంస్థాన్ చైర్మెన్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మెన్ నల్ల సంజీవ రెడ్డి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సప్పిడి భాస్కర్, కాస నర్సింహ యాదవ్, గోకర్ల లక్ష్మి నారాయణ, సిరిపురం నారాయణ, బాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాంభాగ్ ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నడిచే జన శిక్షణ సంస్థాన్ అక్షరాస్యులు, నిరక్షరాస్యులైన ప్రతి మహిళకు, వృత్తి నైపుణ్యాలను సాధించి ఆర్థికంగా బలపడడం సాధించడంలో జన శిక్షణ సంస్థాన్ సహాయపడుతుందన్నారు. ప్రపంచంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే మహిళలు వరంగల్ జిల్లా మహిళలు మాత్రం మార్చి 8 తో పాటు ఈ రోజు 26 మార్చ్ వరకు జరుపుకుంటారన్నారు. సుమారు 1000 మంది శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. తరువాత జన శిక్షణ సంస్థాన్ ఉద్యోగులు , బోర్డ్ మెంబెర్స్ ఆధ్వర్యంలో రాంబాగ్ ప్రకాష్‌కి సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థా న్ వైస్ చైర్మెన్ డాక్టర్ టి. శ్రీనివాస్ రఘు, పాల్గొన్నారు.

## నవజీవన్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామ్మోహన్



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రామ్మోహన్ ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 230 ఓట్లు ఉండగా 299 ఓట్లు పోలయ్యాయి. ఇందులో భాస్కర్ రెడ్డికి 118 ఓట్లు రాగా రామ్మోహన్‌కు 179 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారులుగా లక్ష్మీనారాయణ, రమేష్ నాయుడు వీరేశం, దయానంద్ వ్యవహరించారు. అనంతరం విజయం సాధించిన రామ్మోహన్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను గెలిపించిన కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని నియమిస్తామని తెలియ చేశారు. ఈ మేరకు ప్రజల ఆశీస్సులతో ఘన విజయం సాధించారు. అందులో భాగంగా బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ భారీ మెజారిటీతో గెలిచిన రామ్మోహన్‌ను శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా కాలనీలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాది రెడ్డి యుగేందర్ రెడ్డి, కాలనీ వాసులు ఉన్నారు.

## జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సంకల్ప్ పథకం కింద ఉపాధి, శిక్షణ శాఖ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) రాధిక గుప్తా అధ్యక్షతన అన్ని డీఎస్సీ సభ్యులు, జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక సమన్వయకర్త సంకల్ప్‌తో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించారు.

## నేడు కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి కోర్టు బార్ సోసియేషన్ కు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పోలింగ్ జరగనుండగా బార్ సోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన 720 సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, లైబ్రరీ సెక్రటరీ, లేడీ రిప్రజెంటేటివ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ పదవితో సహా ఏడు కార్యవర్గ సభ్యుల పదవుల కోసం గాను 36 మంది బరిలో నిలిచారు. ఏడాది పదవీకాలంకు గాను ఆశావాహులు ఎవరికి వారుగా గెలిచేందుకు ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు గత మూడు నాలుగు రోజులుగా గేట్ టూ గేదర్ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు తమకు అవకాశం కల్పిస్తే కోర్టులో పలు సౌకర్యాలు కల్పిస్తామని హామీలతో ఆకట్టుకునేందుకు ఒకరికి మించి మరొకరు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ సాధారణ ఎన్నికలను తలపిస్తుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక



● కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

మతసామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని కార్పొరేటర్ రవీందర్ రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు పాటించే కఠిన ఉపవాస దీక్షల సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ ఖుష్ నగర్ మసీదు కమిటీ, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో "దావత్ - ఏ - ఇఫ్తార్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ముస్లిం సోదరులకు ఖర్జూర పండు తినిపించి ఇఫ్తార్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ హుసైన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, దేవులపల్లి కృష్ణమూర్తి, షేక్ కరీముల్లా, సయ్యద్ సలీం, వెంకటాచారి, ముస్లిం మత పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల నీటి కష్టాలు తీర్చిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హమాలీ కార్మికుల నీటి కష్టాలను స్థానిక మూసా పేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తీర్చారు. గూడ్స్ షెడ్ రోడ్డులోని హమాలీ యూనియన్ ఆఫీస్ వద్ద ఉన్న బోర్ వెల్ గత కొన్ని నెలలుగా పాడైంది. సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ, వారు మా శాఖలో నిధులు లేవు అంటూ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో హమాలీ కార్మికుల సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ ఒక ప్రముఖ కంపెనీతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులు తెచ్చి, నూతన మోటార్ ఫిట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బలయ్య, శివరాజ్ యాదవ్, పోలంకి కిషోర్, కృష్ణ యాదవ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'డ్రయినేజీ సమస్యను పరిష్కరించండి'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 జీడిమెట్ల డివిజన్‌లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి తెలిపారు. బుధవారం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎస్.ఏ.ఆర్ రాఘవేంద్ర కాలనీలో భరత్ సింహారెడ్డి స్థానికులతో కలిసి డ్రయినేజీ మ్యాన్ హోల్స్‌ను పరిశీలించారు. సమస్యలను ఆయన తెలుసుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నరేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ షేటు, శంకరయ్య షేటు, కె.శంకరయ్య, బాలరాజు, 132 బీజేపీ జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటన సందర్భంగా విద్యార్థుల అరెస్ట్



**నవతెలంగాణ-ఓయూ**

ఓయూలో బుధవారం గవర్నర్ పర్యటన సందర్భంగా ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మంద నవీన్, పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.ఆసీఫ్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, ఎఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నేలి సత్య, ఎఐఎస్ఎఫ్ ఓయూ నాయకులు ఉదయ్ అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు.

## బ్రదర్ ప్రవీణ్ హత్య కేసులో నిందితులను శిక్షించాలి

- ఓయూ విద్యార్థులు



**నవతెలంగాణ-ఓయూ**

బ్రదర్ పగడాల. ప్రవీణ్‌ను హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఓయూ విద్యార్థులు కోరారు. బుధవారం రాత్రి ఆర్ట్స్ కళాశాల ఎదుట ఓయూ స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రవీణ్‌కి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ప్రవీణ్ ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించరాని ఇలా అవ్వడం బాధాకరమన్నారు. మేము కూడా భారతీయులమే అని ఇలా హత్యలు చేయడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. క్రైస్తవులు ఏకం అయి పోరాటం చేయాలని కోరారు. మతోన్మాద శక్తులను హెచ్చరించారు. దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు ఖండించారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ అధ్యక్షుడు గడ్డం అశోక్, ఎన్‌సీసి నేత బక్క ఎలియ, గొంగల సునీల్, పాకాల దానియల్, స్వాతి, ఏసుమణి విద్యార్థులు కళాకారులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా




- కార్మికులకు ప్రతినెలా ఏడో తేదీలోపు వేతనాలివ్వాలని సీఐటీయూ డిమాండ్

**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చట్టప్రకారం 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలి, ఈఎస్ఐ కార్డులు అందరికీ ఇవ్వాలి, పీఎఫ్ ప్రతినెల కార్మికుల అకౌంట్లో జమ చేయాలని హాస్పిటల్ ముందు సీఐటీయూ నాయకులతో కలిసి మంగళవారం, బుధవారం కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావర్తి అశోక్ పాల్గొని మాట్లాడుతూ.. ఆల్ సర్వీసెస్ గ్లోబల్ కాంట్రాక్ట్ వారు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో కార్మికులకు జీతాలు సరైన సమయంలో ఇవ్వడం లేదని, ఈనెల 26 రోజులు గడిచిపోయినప్పటికీ ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదన్నారు. మార్చి నెల పండగల దినం ఉగాది, రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగలు ఉన్న సందర్భంగా కూడా, కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోవడం చాలా దారుణమైనటువంటి పరిస్థితి, కాబట్టి వెంటనే చట్టప్రకారం ప్రతినెల 7వ తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. కాంట్రాక్ట్ వచ్చి మూడు ఏండ్లు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఈఎస్ఐ కార్డులు అందరికీ ఇవ్వలేదు. ఇచ్చినటువంటి కార్డుల్లో చాలా తప్పులు ఉన్నాయి. పీఎఫ్ కార్మికుల అకౌంట్లో 7 నెలలుగా జమ చేయడం లేదు. వెంటనే జమ చేయాలని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, లింగయ్య లక్ష్మీ, చంద్రకళ, లతా తదితరులు పాల్గొన్నారు.

## 500గ్రాములతో పుట్టిన పసికందు.. కాపాడిన వైద్యులు



**నవతెలంగాణ-బేగంపేట్**

ఐదు వందల గ్రాములతో పుట్టిన పసిగుడ్డును కాపాడిన అరుదైన రికార్డును బసంత్ సాహ్నా ఆస్పత్రి వైద్యులు సాధించారని వెస్ట్ మారేపల్లి బసంత్ సాహ్నా ఆస్పత్రి డైరెక్టర్ పద్మావతి చెప్పారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం 34 ఏండ్ల తర్వాత అరుదైన చికిత్స చేసామని ఆమె తెలిపారు. డాక్టర్లు గిరిజ కృష్, వినయ్, మానస, పసికందును కాపాడారు. తొబై రోజుల పాటు చికిత్స ఎఫ్ అందించి ఆరోగ్య వంతమైన బాబాను అప్పజేప్పడంపై తల్లి దండ్రులు ఆనందంతో వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో ఐదు వందల గ్రాముల బరువుతో జన్మించిన బాబు కేసును సవాలుగా తీసుకున్న వైద్యులు..నిత్యం పర్యవేక్షించి, అరుదైన ట్రీట్ మెంట్ ఇచ్చి పూర్తి ఆరోగ్యవంతంగా మారిన తరువాత డిశ్చార్జ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఈ ప్రయివేట్ ఆస్పత్రిలో ఈ అరుదైన చికిత్స జరగగా..తక్కువ బిల్లుతో, సోసైటీ ద్వారా సహాయం అందించి వారికి సురక్షితంగా బాబును అందించడంపై తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. బయటి ఆస్పత్రుల్లో లక్షల్లో ఖర్చు చేసిన బ్రతికే అవకాశలు మాత్రం చాలా తక్కువగా ఉంటయని కానీ ఈ కేసును స్పేషల్‌గా తీసుకోని తము విజయం సాధించమంటూ బసంత్ సాహ్నా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్లు మురళి దర్, నర్సులు, వెంకటరామారెడ్డి, ఆస్పత్రి ఎంతో కష్టపడ్డారని ఆమె తెలిపారు.

## టౌన్ ప్లాన్ అధికారులతో జేసీ సమావేశం



**నవతెలంగాణ-ఓయూ**

సికింద్రాబాద్ జోనల్ కమిషన్ ఎస్.రవి కిరణ్ బుధవారం ఆయన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జోనల్ పరిధిలో జరుగుతున్న పలు అనధికార నిర్మాణలపై; అక్రమణలపై వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ శ్రీనివాస్, ఏసీపీ విట్టల్, డీసీపీ శుష్మిత, ఏసీపీ శ్రీనివాస్, సికింద్రాబాద్, బేగంపేట్ సెక్షన్ ఆఫీసర్స్, మున్షిలు పాల్గొన్నారు.

## మోటివేషన్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకున్న దీపిక




**నవతెలంగాణ-కంటోన్మెంట్**

ఇంపాక్ట్ ఫౌండర్ ప్రముఖ మోటివేటర్ గంప నాగేశ్వరరావు చేత ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని గడ్డమీద దీపిక రాము అన్నారు. ఈనెల 22. 23 తేదీలలో రెండు రోజులపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో జరిగిన రెండు రోజుల మోటివేషనల్ స్పీకర్స్ ట్రైనింగ్ క్లాసులలో వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన దీపిక మొదటి బహుమతి పొందారు. అదేవిధంగా ఇంపాక్ట్ వనపర్తి జిల్లా క్లబ్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. క్లాసులు ముగింపు రోజు దీపిక మొదటి బహుమతితోపాటు ఇంపాక్ట్ ప్రశంసా పత్రాన్ని ఇంపాక్ట్ ప్రెసిడెంట్ రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి, ప్రముఖ సినిమా ఆర్టిస్ట్ ప్రదీప్‌కుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళలపై అత్యాచారాలు, ఇవి టీజింగ్, డ్రగ్స్, తదితర అభివృద్ధి నిరోధక అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రజల్ని చైతన్యవంతం చేస్తానని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు విద్యార్థులు, యువకులే అని అలాంటి వారి జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారని, వాళ్లలో వాళ్లకు తెలియకుండా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మోటివేషన్ క్లాస్‌లు ఎంతో దోహద పడుతాయని, రానున్న కాలంలో జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలను తిరిగి విద్యార్థులను ఉత్తమ భవిష్యత్తు నిర్మాణం కోసం చైతన్యం చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవార్డుకి ఎంపిక చేసిన ఇంపాక్ట్ సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు.

# సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధన జరగాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పరిశోధనల్లో ఓయూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతోంది
- ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం




**నవతెలంగాణ-ఓయూ**

సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం ఓయూ ఫిజిక్స్ విభాగం 'మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ సొసైటల్ అప్లికేషన్' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిజిక్స్ విభాగం నిర్వహిస్తున్న ఈ సదస్సు విజయవంతం కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. పరిశోధన ఫలితాలు సాధారణ పౌరులు, ముఖ్యంగా గిరిజనులను అందాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విభిన్న విభాగాలు కలిసి పనిచేయటం అత్యంత ముఖ్యమని, అప్పుడే చౌకగా నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఆరోగ్యం, వైమానిక రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, తద్వారా ఆర్థికాభివృద్ధికి బాటలు పడతాయని వివరించారు. ఓయూ ఫిజిక్స్ విభాగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ఓ వేదికగా మలచుకుని అనేక పరిశోధనలకు సంబంధించిన చర్చ జరగాలన్నారు. మరిన్ని కొంగ్రొత్త ఆలోచనలకు అంకురార్పణ జరగాలని ఆకాంక్షించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. పరిశోధనల్లో ఓయూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతోందని అన్నారు. ఆధునిక సంకేతికాభివృద్ధిలో ఫిజిక్స్ కీలక భూమిక పోషిస్తుందన్న ప్రొ. కుమార్ వైమానిక రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలను వివరించారు. బోయింగ్ లాంటి విమానాల తయారీలో మెటీరియల్ ఆవిష్కరణల కారణంగా 700 టన్నుల బరువుండాల్సిన విమానాలు అదే సామర్థ్యంతో 350 టన్నులతో నిర్మించిన విమానాలు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని వెల్లడించారు. ఆధునిక సాంకేతికతలో ఫిజిక్స్ ఆవిష్కరణలు అగ్రగామిగా ఉంటాయని తెలిపారు. స్మార్ట్ మెటీరియల్ ఆవిష్కరణల ద్వారానే మార్కెట్ పరివర్తనను అందుకోవచ్చని అన్నారు. కొత్త ఆలోచనలు, విమర్శనాత్మక దృక్పథం, ఆవిష్కరణల దిశగా ప్రయత్నించటం ద్వారా యువ పరిశోధకులు అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. 21వ శతాబ్దం మెటీరియల్ విప్లవానికి సూచికగా నిలుస్తుందని ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డైరెక్టర్ డా. ఆర్. విజయ్ అన్నారు. నూతన మెటీరియల్ ఆవిష్కరణలు భవిష్యత్తు ఆధునిక సమాజంలో కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు. సరికొత్త ఆవిష్కరణల మార్గంలో స్థిరత్వం, పర్యావరణ అనుకూలత దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. పునరుత్పాదక విధానాలపై దృష్టిపెట్టాలని ప్రస్తుత ఎలక్ట్రిక్ ప్రపంచంలో బ్యాటరీ అప్లికేషన్స్, సెల్ఫ్ క్లీనింగ్ అప్లికేషన్స్, హైడ్రోజన్ కేంద్రక పరిశోధనల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు సరికొత్త ఆవిష్కరణల దిశగా పరిశోధనలు జరగాలని అటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండీ) హైదరాబాద్ డైరెక్టర్ ధీరజ్ పాండే అన్నారు. వేగంగా జరుగుతున్న సాంకేతికాభివృద్ధిలో ఫిజిక్స్ పరిశోధనలు ముందువరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా ఫిజిక్స్‌లో పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయని సదస్సు కన్వీనర్, ఫిజిక్స్ హెడ్ ప్రొ. ఎం. శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ఫిజిక్స్ అనుబంధ విభాగాల్లోని నిష్ణాతులైన ప్రముఖులు, దేశంలోని ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు పాల్గొని ఈ సదస్సులో ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేంద్ర కుమార్ నాయక్, పలువురు మాజీ వీసీ, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్‌లు, డైరెక్టర్లు, ప్రొఫసర్స్, పరిశోధకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీగా అభివృద్ధి

- మేయర్‌ను కలిసిన ఇండియానా పోలో ప్రతినిధుల బృందం




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జీహెచ్ఎంసీతో అమెరికా దేశానికి చెందిన ఇండియనా స్టేట్‌తో 2010 సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఆ చెందిన ప్రతినిధి బృందం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆ బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియనా ప్రతినిధులు మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం హైదరాబాద్ గతంలో కంటే అభివృద్ధి చెందినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంతే కాకుండా హైదరాబాద్ చుట్టూ మరొక ట్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఉత్తరం వైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ప్రజా పాలన రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీలో మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణకు రూ. 7032 కోట్లతో రోడ్డు వెడల్పు, ఫ్లై ఓవర్లు నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఇట్టి పనులు పూర్తయితే గ్లోబల్ సిటీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నగరంలో పాఠశాల విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రతినిధులను మేయర్ కోరగా సానుకూలంగా స్పందించి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు మేయర్‌కు హామీనిచ్చారు. ఇండియానా పోలీస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ డియాగో మోరల్స్, చింతాల రాజు, చీఫ్ అడ్వైసర్ ఆఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం రాష్ట్ర రాష్ట్ర పర్యటనకు మేయర్‌ను ఆహ్వానించారు. తప్పకుండా తమ గెలిగేట్‌తో వస్తామని ఆహ్వానించినందుకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఆస్తి పన్ను బకాయిని వసూలు చేసిన జీహెచ్‌ఎంసీ



**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

ఎర్రగడ్డలోని నేషనల్ రీసెర్చ్ ఆఫ్ యునాని మెడిసిన్ యాజమాన్యం నుంచి బకాయి ఉన్న మూడు కోట్ల 28 లక్షల రూపాయలను బుధవారం సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, హాస్పిటల్ యాజమాన్యం వద్ద నుంచి చెక్కు తీసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 29వ తారీకులోపు ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను బకాయిలను చెల్లించాలని, ఈనెల 30 ఆదివారం 31 ఉగాది సందర్భంగా వరుస సెలవులు ఉన్నందున 29 వరకు బకాయిలు చెల్లించాలని, ఏప్రిల్ ఒకటవ తారీఖు నుంచి పెండింగ్ బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయటం జరుగుతుందని, అందువలన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

## ప్రశ్నించే గొంతుకలను ఎన్నేండ్లు నొక్కేస్తారు




- ప్రొ. గాలి వినోద్, మేడే రాజీవ్ సాగర్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

మతాల పేరుతో రాజకీయాలు మానుకొని ప్రజాస్వామ్య దేశంలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చే లౌకికత్వానికి కట్టుబడి పాలన చేయాలని, ప్రశ్నించే గొంతుకాలను ఎన్నేండ్లు నొక్కేస్తారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్, ప్రొ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ సోమాజిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏపీలో ఇటివల జరిగిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఆ రాష్ట్రానికి దళిత మహిళ హోం మంత్రిగా ఉన్నారని, ఆమె మానవత దృక్పథంతో పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఏపీలో 32, తెలంగాణలో 25 మంది క్రిస్టియన్లు ప్రాణాలు కోల్పోయారనీ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హత్యా రాజకీయాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది దళిత క్రైస్తవులు నివాసిస్తున్నారని, ఇటీవలే జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటలో కూడా అవకాశం ఇవ్వలేకపోవడం క్రిస్టియన్‌ల పట్ల నిర్లక్ష్య వైఖరి తేటతెల్లమైందన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా క్రిస్టిస్ట్ జేఏసీ నాయకులు సాల్మన్ రాజ్, విద్యాసాగర్, మోసెస్, ప్రణీ కుమార్, లియో తదితరులు పాల్గొన్నారు.

## నీటి పైపులైను పనులకు శంకుస్థాపన



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8 వార్డులోని పలు కాలనీలాలో నీటి సమస్య పరిష్కరించేందుకు బుధవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున్ రూ.25 లక్షల కంటోన్మెంట్ బోర్డ్ నిధులతో పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైప్‌లైన్ పూర్తి అయితే వార్డ్‌లోని సరస్వతి కాలనీ, సాయి బాబా కాలనీ, వేంకటేశ్వర కాలనీ, అన్నా నగర్, చింత బాయి, రుద్రనగర్ పంపు హౌస్ కాలనీలకు ఇబ్బంది ఉండదని అన్నారు. మల్కాజ్గిరి పార్లమెంటరీ సభ్యులు ఈటల రాజేందర్ కృషితో ఇప్పటికే కంటోన్మెంట్‌లో చాలా సమస్యలకు చెక్ పెట్టారని చెప్పారు. రాబోయే రోజులో కూడా వారి సహకారం తమకి ఉంటుందని చెప్పారు. కాగా కంటోన్మెంట్ బోర్డ్‌కు రోజు నీటిని సరఫరా చేసే సామర్థ్యం తగిన స్టోరేజ్ కెపాసిటీ కూడా ఉందని రాష్ట్ర ప్రభుత్వం దీని పై దృష్టి పెట్టి మరో 20 లక్షల గలోన్స్ నీటిని ఇవ్వాలని నర్మదా కోరారు.

## అనంతా రిహాబిలిటేషన్ సెంటర్‌లో పలు సేవలు ప్రారంభం



**నవతెలంగాణ-బేగంపేట్**

అనంత రిహాబిలిటేషన్ సెంటర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా మరో అడుగు ముందుకేసి అడ్వాన్స్ త్రీడీ గేయిట్ అనాలసిస్ అండ్ త్రీడీ పోచ్చర్ అనాలసిస్, స్పాస్టిసిటిని అనంత స్పెషాలిటీ క్లినిక్, పీడియాట్రిక్ ఆర్థో అండ్ న్యూరో రీహబిలిటేషన్ సేవలను నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. బేగంపేటలోని ప్రకాష్ నగర్ ఫ్లైఓవర్ పక్కన ఉన్న అనంత రిహాబిలిటేషన్ సెంటర్లో ఈ సేవలను బుధవారం సీనియర్ కన్సల్టెంట్ న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ అనిరుద్ కుమార్ పురోహిత్, అనంత రీహబిలిటేషన్ సెంటర్ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 75 బెడ్ రీహబిలిటేషన్ సెంటర్‌గా సేవలందిస్తున్న మల్టీ స్పెషాలిటీ అనంత రిహాబ్‌లో పల్మనాలజీ, కార్డియాలజీ, న్యూరో, ఆర్థోపెడిక్, మస్కిలో స్కెలిటన్, క్యాన్సర్లతోపాటు గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ అనిరుద్ కుమార్ పురోహిత్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో గాయాల పాలైన వారికి మానసిక ధైర్యాన్ని ఇచ్చి తిరిగి వారిని జీవితంలో నిలబడాలా చేసేందుకు అనంత రిహబ్ అందించే ఆధునిక వైద్య సేవలు ఎంతోమందికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. దేశంలోనే ఇలాంటి రీహబిలిటేషన్ సెంటర్లు ఎక్కడ లేవని, నిపుణులైన స్పెషలిస్టులు డాక్టర్ల పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన అనంత రిహబ్ పేషెంట్లను త్వరగా కోలుకునే విధంగా చేయడంలో ఎంతో ముందుంది అన్నారు. ఈ కార్యక్రమంలో డా. సచ్చిదానందరావు, పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. ఎం. వి. ఆనంద్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిషోర్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డా. నాగచైతన్య, పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డా. ఆనంద్, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్, ఫుట్ అండ్ యాంకిల్ స్పెషలిస్ట్ డా. పవన్ కుమార్ సద్వానీ, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషన్ అండ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డా. శివరంజని సంతోష్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డా. తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
13
గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com


## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎమ్మెల్యేకు నోటీసులు



**నవతెలంగాణ- హయత్ నగర్**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎల్బీనగర్ ఎమ్మెల్యేకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఈనెల 18న ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు మీడియా సమక్షంలో హస్తినపురం మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్‌పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దాంతో తనను అవమానించే విధంగా, తన కుటుంబం పరువు భంగం కలిగే విధంగా, తన పరువు పోయే విధంగా మాట్లాడినందుకుగాను అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అదే రోజు హస్తినాపురం కార్పొరేటర్ ఎల్బీనగర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు.మరుసటి రోజు(19న) ఎమ్మెల్యే పై కేసు నమోదు నమోదైంది. ఈ మేరకు కేసులో వివరణ కోరేందుకుగాను బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి నోటీసులు అందజేసేందుకు గాను అసెంబ్లీ వద్దకు వెళ్లి ఎల్బీనగర్ పోలీసులు నోటీసులు అందజేసినట్టు తెలిసింది.

## రాజీవ్ యువ వికాసం పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి



- ఎంపీడీఓ మమతాభాయి

**నవతెలంగాణ-శామీర్ పేట**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన వారు సమీప మీ- సేవ కేంద్రాలలో ఏప్రిల్ 5వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని శామీర్ పేట ఎంపీడీఓ మమతాభాయి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక లక్ష యాభైవేల రూపాయల లోపు ఆదాయం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ/ఈ డబ్ల్యూ ఎస్ కమ్యూనిటీకి చెందిన వారై ఉండాలని, వ్యవసాయేతర పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి వయసు 21 నుంచి 55 సం.లోపు ఉన్నవారు అర్హులన్నారు. అలాగే వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల పథకాల కోసం 21-60 లోపు వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. మీ సేవ లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఒరిజినల్ దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించగలని ఆమె కోరారు.

# విద్యాశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏప్రిల్ 11న తలసేమియా బాధితులకు అండగా రక్తదాన శిబిరం
- మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్
- టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

విద్యాశాఖ ఉద్యోగుల సమస్యలు షరిష్కరించడంతో పాటు వారికి అన్నివేళలా టీఎన్జీవోస్ విద్యాశాఖ సెంట్రల్ ఫోరం అండగా ఉంటుందని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) తెలిపారు. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్‌కు అనుబంధంగా పాఠశాల విద్యాశాఖ సెంట్రల్ ఫోరం ఏర్పాటుతో పాటు ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు బుధవారం నాంపల్లిలోని ఆ సంఘం కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఫక్రుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.దేవేంద్ర కుమార్, కె.పవన్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి విద్యాశాఖ సెంట్రల్ ఫోరం సభ్యులు పాల్గొని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను గజమాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా టీఎన్జీవోఎస్ సెంట్రల్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధానంగా విద్యాశాఖలో జోనల్, మల్టీ జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయుటకు, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు మల్టీ జోనల్ అలాట్‌మెంట్ కోసం కృషి చేస్తామనీ హామీఇచ్చారు. విద్యాశాఖ సిబ్బందికి జరుగుతున్న ఇబ్బందులను పరిష్కారం చేసేవరకు అండగా ఉంటామన్నారు. మధ్యాహ్నం భోజన పథకం మిడ్ డే మీల్ పోస్టులు, మోడల్ స్కూల్స్ పోస్టులు, ఆర్ఎంఎస్ఏ పోస్టులు



మంజూరయ్యేలా చూస్తామన్నారు. మ్యూచువల్ స్పౌస్ కేసులు, 317 బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే విధంగా ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్ నాయకత్వంలో ఏప్రిల్ 11న తల సేమియా బాధితులకు ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామనీ, ఈ కార్యక్రమానికి విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్ కుమార్ తక్షణమే స్పందించి హనుమకొండ జిల్లాలో కారుణ్య నియామకం రామ్మూర్తి కుమారునికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులో నియామకం చేయాలని అక్కడి డీఈవో అధికారికి ఫోన్ చేసి కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్.రాజకుమార్ ,కార్యదర్శి ఫక్రుద్దీన్, అసోసియేట్ అధ్యక్షులు ఎం.దేవేంద్ర కుమార్ ,కోశాధికారి కె.పవన్ బాబు, ఉపాధ్యక్షులు ఎం. భాస్కర్, ఆర్. అశోక్, దిలీప్, ప్రశాంత్, గౌసిద్దీన్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, ఉస్మాన్, దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు ముజాహిద్ అలీ, జాయింట్ సెక్రటరీ. రమేష్ , సుదర్శన్ , శ్రీనివాస బాబు , ఆర్గనైజింగ్ సెక్రటరీ. శివ, పబ్లిసిటీ సెక్రటరీ, అరుణ జ్యోతి, కల్చరల్ సెక్రటరీ. అఖిలుద్దీన్, బబ్లూ, పరమేష్, దామోదర్, బిపిన్ తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్‌ను సందర్శించిన జిప్మార్ బృందం





**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పాండిచ్చేరి జిప్మార్ హాస్పిటల్ నుంచి ప్రొఫెసర్ లత చతుర్వేదుల (ఆఫీసర్ ఇన్‌చార్జి డైటిక్స్), వారి బృందం పంజాగుట్ట నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ను బుధవారం సందర్శించారు. మొదట నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్, డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్‌ను, నిమ్స్ డైటిషన్ శాలినిని కలిసి తర్వాత నిమ్స్ డైటిక్స్ డిపార్టుమెంట్‌ను సందర్శించి వంటశాల, స్టోర్స్‌ను పరిశీలించి, ఆరోగ్య శ్రీ ద్వారా రోగులకు అందుతున్న భోజన సదుపాయల గురించి నిమ్స్ డైటిషన్ శాలినిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

## హత్య కేసులో ఆరుగురు అరెస్ట్..

**ఐదు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కత్తి, గొడ్డలి, ఒక కారు స్వాధీనం....**



**నవతెలంగాణ- హయత్‌నగర్**

హత్య కేసులో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్బీనగర్ లోని భరత్ నగర్ లో నివాసం ఉంటున్న బొడ్డు మహేష్ స్వస్థలం వెలిశాల గ్రామం, తిరుమలగిరి మండలం, సూర్యపేట జిల్లా. మీర్‌పేటలో నివాసముండే పగిళ్ల పురుషోత్తం, భరత్ నగర్‌లో నివాసం ఉండే నోముల నాగార్జున స్వస్థలం నకిరేకల్ మండలం, నల్గొండ జిల్లా. భరత్ నగర్ లో నివాసం ఉండే మంద సందీప్. స్వస్థలం తిరుమలగిరి మండలం సూర్యాపేట జిల్లా. సికింద్రాబాద్‌కు చెందిన గంధమోని రాము స్వస్థలం జడ్చర్ల మండలం,మహబూబ్నగర్ జిల్లా. మలక్ పేటకు చెందిన రాజా రాకేష్ అలియాస్ చింటూ, మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కు చెందిన కుంచాల ఓంకార్ లు ఒకప్పుడు వీరంతా ప్రాణ స్నేహితులు. మహేష్ యాదవ్ ను బీరు బాటిల్ తో తలపై బాధడంతో తీవ్ర గాయాలైన ఘటనలో పురుషోత్తం, రాము ల పై హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు అయింది. తన వెంట తిరిగిన వ్యక్తి తననే కొడతాడా తన పరువు పోయిందని అక్కసు, తానంటే భయం ఉండాలి అని ఉద్దేశంతో గత ఏడాది చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో బొడ్డు మహేష్ తో పాటు మరి కొంతమంది కలిసి పురుషోత్తం, రాములను హత్య చేసేందుకు ప్రయత్నించారు. అయితే తృటిలో తప్పించుకున్న పురుషోత్తం ఆ తర్వాత బొడ్డు మహేష్ తో పాటు మరో అయిదుగురిపై చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేయగా హత్యాయత్నం కేసు నమోదు అయింది. జైలు పై విడుదలైన మహేష్ తనను హత్య చేస్తాడని భావించిన పురుషోత్తం తాను బ్రతకాలంటే మహేష్ ను హత్య చేయాల్సింది అని భావించాడు. గత కొన్ని రోజులుగా మహేష్ వెంట ఉన్న అనుచరులతో సమాచారం లాగి అతని కదలికలను గమనించాడు. ఈనెల 23న శివగంగ కాలనీ వద్ద మాటు వేసి, కాపు కాసి మొదట మహేష్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీకొనడంతో మహేష్ కింద కిందపడిపోయాడు. వెంటనే వేట కొడవలితో, కత్తులతో అతి దారుణంగా చాతీపై, ఎడమ చేతి మడిమ, చెవి, బాగాలపై కత్తులతో దాడి చేశాడు. మహేష్ చనిపోకపోవడంతో గొడ్డలితో తల భాగంలో బాది హత్య చేశాడు. దీంతో మహేష్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఆరుగురిని అదుపులకు తీసుకుని వారి వద్ద నుంచి ఒక కత్తి,ఒక గొడ్డలి, అయిదు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. వారిని బుధవారం రిమాండ్ కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంట ఎస్సైలు నరసింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కలుషిత తాగు నీటిని నివారించాలి..

- సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ..

**నవతెలంగాణ - ధూల్ పేట్**

తాగు నీటిలో సరఫరా అయ్యే కలుషిత నీటిని నివారించాలని సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంచినీళ్ల సమస్యలపై జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జంగంమేట్ డివిజన్‌లో రవీందర్ నాయక్ నగర్ కాలనీ నగోల్ బండ, జంగంమేట్ మార్కెట్, అంబేద్కర్ నగర్ పలు ప్రాంతాల్లో తాగే మంచి నీళ్ళు గత 15రోజులపైగా కలుషిత నీళ్ల సరఫరా అవుతున్నాయన్నారు. దీంతో ప్రజలు తాగే మంచినీళ్ల మురికి వాసన రావడం తో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ మురుగు నీటి తో అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో నీళు స్నానం, బట్టలు ఉతుకోవడానికి వాడలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కలుషిత నీటి సమస్య వెంటనే పరిష్కారించాలని కోరారు. సీపీఐ(ఎం) నాయకులు కిషన్, శ్రీను, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

**నవతెలంగాణ - ధూల్ పేట్**

సీపీఐ(ఎం) ఆవాజ్ నాంపల్లి కమిటీల ఆధ్వర్యంలో హైమద్ డివిజన్లో రంజాన్ సందర్భంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, ఏఐపీఎస్ఓ నగర కార్యదర్శి జె కె శ్రీనివాస్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి జావీద్, ఆవాజ్ అలీ, హర్షద్, పార్టీ సభ్యులు శంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





## కబ్జా చేసిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- అబ్బాసీ లా ఫోరం డిమాండ్


**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

ఒక ఎమ్మెల్సీ తండ్రి కబ్జా చేసిన భూమిని హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకుని వక్ఫ్, ఎఫ్ టీఎల్‌కు అప్పగించాలని అబ్బాసీ లా ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ మాట్లా డుతూ 1996లో రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ వద్ద వక్ఫ్ బోర్డుకు సంబంధించిన 3 ఎకరాల భూమి, ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన 3 ఎకరాల పది గుంటల భూమిని ఆ ఎమ్మెల్సీ తండ్రి కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూముల కబ్జాపై 2022లో తాము హైకోర్టును ఆశ్రయించామని, దీనిపై జీహెచ్ఎంసీ, రెవిన్యూ, ఇరిగేషన్, వక్ఫ్ బోర్డు విచా రణ జరిపి ఈ భూములు కబ్జాకు గురైనట్లు తెల్చాయని తెలిపారు. 25న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసు కోవాలని పేర్కొందని తెలిపారు. ఆ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే హైడ్రా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయ వాదులు రిజ్వాన్ ఆఫ్మీ, జునేద్ బాసిక్, ఇంక్వి లాబ్ పార్టీ నాయకులు సమీల్లా అజాద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు నాటకం ప్రాచుర్యాన్ని కొనసాగిస్తున్న రస రంజని

**నవతెలంగాణ-కల్చరల్**

తెలుగు నాటకం ప్రాచుర్యాన్ని రస రంజని సంస్థ గత ముప్పై రెండేండ్లుగా కొనసాగిస్తోందని రంగస్థల ప్రముఖులు పేర్కొన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రముఖ నాటక సంస్థ రస రంజని ముప్పై రెండవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన సభా కార్యక్రమంలో అతిథులు గా ఆంధ్ర నాటక కళా పరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ గతం లో ఆంధ్ర నాటక కళా పరిషత్ తెలుగు నాటక పోటీలు నిర్వహణలో ప్రసిద్ధి పొందినదని చెప్పారు. సినీ మాటలు రచయిత దివాకర్ బాబు మాట్లాడుతూ సురభి నాటక సమాజాల తరువాత రస రంజని అంత ప్రసిద్ధి పొందినదని ఇది నిరంతరం కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు నటుడు సుబ్బరాయ శర్మ సినీ రచయిత సాయి మాధవ్ తదితరులు పాల్గొనగా కార్యదర్శి నట రాజ్ నివేదిక సమర్పించారు అరుణ కుమార్ రామ కోటేస్వర రావు నారాయణ స్వామి రాధా కృష్ణ పర్యవేక్షణ చేశారు అనంతరం మోహన్ సేనాపతి దర్శకత్వం లో కొడాలి గోపాల రావు రచించిన చైర్మెన్ సాంఘీక నాటకం రస రంజని సమర్పణ లో ప్రదర్శించారు. ఆరు దశాబ్దాల క్రితం రాజకీయాలు కుటుంబ వ్యవస్థ ల గురించి రాజకీయాలలో అవక తవకలు ప్రజను బాధించటం వంటి అంశాలు గా సాగిన నాటకం కథ నేటికీ అన్వయించుకొనేలా ఉంది. ప్రతి నటుడు పాత్రకి తగ్గ న్యాయం చేయగా దర్శకుడు మోహన్ సేనాపతి ప్రతిభ ద్యోతకమైంది



## భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల త్యాగం విద్యార్థులకు స్ఫూర్తి



- షాహిఇనాయత్ గంజ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రామ శాస్త్రి

**నవతెలంగాణ - ధూల్ పేట్**

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవు ల త్యాగం విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని టీపీఎస్‌కే హైదరాబాద్ సౌత్ జిల్లా కన్వీనర్ పి.నాగేశ్వర్, షాహిఇనాయత్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామ శాస్త్రి అన్నారు. టీపీఎస్‌కే హైదరాబాద్ సౌత్ కమిటీ, షాహిఇనాయత్ గంజ్ ఉన్నత పాఠశాల సంయుక్తంగా గోషామహల్ నియోజకవర్గంలోని జుమ్మేరత్ బజార్ షాహిఇనాయత్ గంజ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సామూహికంగా భగత్ సింగ్, రాజ్ గురు,సుఖదే వ్ లకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ 94 వ వర్ధంతి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తిని గుర్తుచేశా యన్నారు. ఈ సందర్భంగా గత 3 రోజులుగా నిర్వహించిన బహుముఖ కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా ప్రతిభను కనబరిచారు. భగత్ సింగ్ వేషధారణ, భగత్ సింగ్ ఏక పాత్రాభినయం, భగత్ సింగ్ మార్చ్, ముగ్గురు శహద్ వీరులకు మౌనం పాటిస్తూ సామూహిక నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా దేశస్వాతంత్ర్యకోసం భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్ లు జరిపిన పోరాటం ,ఆనాటి జాతీయోద్యమాన్ని పరుగులు పెట్టించిందన్నారు. వారి పోరాటం మన దేశంలో సమ సమాజ స్థాపనకు వారు కన్న కలలను నిజం చేసేందుకు ఐక్యంగా కృషిచేయాలని వారు ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్బోధించారు.



## ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి



- సురేష్ నాయక్

**నవతెలంగాణ-ఓయూ**

డోర్నకల్ ఎమ్మెల్యే రామ్ చంద్రు నాయక్‌కి మంత్రి పదవి ఇవ్వాలని ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీని కోరారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోవు మంత్రివర్గ విస్తరణలో బంజారా బిడ్డలకు అవకాశం ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల్లో బంజారాలు వన్‌సైడ్‌గా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఓటు వేసి అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. బంజారాలకు మంత్రి పదవి రాలేదని కొంచెం నిరాశలో ఉన్నారని తెలిపారు. బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ డా. వృత్తిలో ఉండి ప్రజలకు సేవ చేసి ప్రజా జీవితంలోకి వచ్చి కూడా ఎనలేని సేవ చేస్తున్నాడని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గిరిజనులను ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారవత్ సురేష్ నాయక్, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షుడు కాంత్రావత్ చందూలాల్ రాథోడ్, నాగు నాయక్, ప్రవీణ్, నవీన్, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్షయ్ అత్యుత్తమ ప్రతిభ..

- ప్రదర్శన కళల పట్ల తనకున్న అంకితభావాన్ని గుర్తించడం సంతోషం
- డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మెన్ కె.నవనీతరావు



**నవతెలంగాణ - చర్లపల్లి**

అక్షయ్ అనే విద్యార్థి అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శన కళల పట్ల తనకున్న అంకితభావాన్ని గుర్తించడం, తమకు చాలా సంతోషంగా ఉందని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె.నవనీతరావు అన్నారు. బుధవారం నాచారం లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ 9వ తరగతి ప్రతిభావంతుడైన సింగిరికొండ సాయి అక్షయ్ ప్రపంచ రికార్డులలో కొత్త రికార్డును సృష్టించి చరిత్ర సృష్టించాడు. ఫిబ్రవరి 27న అక్షయ్ థియేటర్ ఆర్ట్స్ అనే అంశంపై మూడు భాషలలో ఒకేసారి ఐదు నిమిషాల పాటు అద్భుతమైన నాటకరంగంపై స్వగత భాషణము "ఏకపాత్రాభినయం, మూకాభినయం" ప్రదర్శించాడు. ఈ అపూర్వమైన అద్భుతమైన విజయం అక్షయ్ అసాధారణ నైపుణ్యం, సృజనాత్మకతను ప్రదర్శిస్తుంది. అతని రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శన అతనికి ప్రపంచ రికార్డులలో మంచి స్థానాన్ని సంపాదించి పెట్టింది.



ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ "అక్షయ్ విజయం యువ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆయన చేసిన కృషి కి థియేటర్ ఆర్ట్స్ ప్రపంచానికి గుర్తించడం తమకు గౌరవంగా ఉందని, అక్షయ్ అద్భుతమైన ఘనత థియేటర్ ఆర్ట్స్ పట్ల ఆయనకున్న మక్కువను ఎల్లలు లేని సరిహద్దులను అధిగమించే సామర్థ్యాన్ని ప్రదర్శించారన్నారు. ఈ విజయం అతని కృషి, పట్టుదల సహజ ప్రతిభకు నిదర్శనం అన్ని పాఠశాల కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి ప్రిన్సిపాల్ సుమా మీనన్ అభినందించారు.

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

# హైదరాబాద్

గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com




## వివిధ రంగాలలో సేవలందించిన వారికి విశేష పురస్కారాలు



**నవతెలంగాణ-ముషీరాబాద్**

సమాజంలో వివిధ సేవలందిస్తూ పురస్కారాలు అందుకున్న వారికి మరింత బాధ్యతను పెంచుతాయని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. సర్వేజనా సుఖినోభవంతు సంస్థ 8వ వార్షికోత్సవం, ఉగాది పండుగ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి.. వారికి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవా స్వర్ణనంది, విశ్వావసు ఉగాది జాతీయ స్థాయి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, డిస్ట్రిక్ట్ 320-ఏ లయన్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డికి వైద్య సేవా రత్న జాతీయ పురస్కారంను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మందడి కృష్ణారెడ్డి, కొరియోగ్రాఫర్ సూర్య తేజ సు భ్రాంత్ , కుచిపుడి నాటి గురువు భారతి, లయన్ సైనా దేవి, ఉమా శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 27 ఏండ్ల కల సాకారం..
## సెపక్ తక్ర వరల్డ్ కప్ 2025లో ఇండియా విజయం



**నవతెలంగాణ-అంబర్‌పేట**

సెపక్ తక్ర వరల్డ్ కప్ 2025లో ఇండియా విజయం సాధించడంతో తమ 27 ఏండ్ల కల సాకారమైందని సెపక్ తక్రా ఫెడరేషన్ ఆల్ ఇండియా సెక్రెటరీ పెరిక సురేష్ అన్నారు. బుధవారం సెపక్ తక్రా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్ రాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఐఎస్‌టీఏఎఫ్ సెపక్ తక్ర వరల్డ్ కప్ 2025లో ఇండియా తన సత్తా చాటిందని పురుషుల్లో విన్నర్‌గా మహిళల జట్టు రన్నర్ గా నిలిచి సిల్వర్ మెడల్, డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించి బృహత్తర విజయాలు నమోదు చేసిందని తెలిపారు. గత 1983లో ఇండియా క్రికెట్ వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశంలో క్రికెట్ కు క్రేజ్ పెరిగిందని, అదేవిధంగా నేడు సెపక్ తక్రా వరల్డ్ కప్ గెలవడం ద్వారా దేశంలోని నలుమూలల సెపక్ తక్రా క్రీడలకు ప్రాచుర్యం లభిస్తుందని సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.




# వర్సిటీల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**



**నవతెలంగాణ-ముషీరాబాద్**

యూనివర్సిటీల్లో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైం స్కేల్, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్, సిబ్బంది వేతనాలు పెంచాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను టైం స్కేల్ సిబ్బందిగా మార్పు చేయాలని ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. జేఎన్టీయు , డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలలో ఈపీఎఫ్ అమలు కావడం లేదని దీనిపై సత్వర చర్య చేపట్టాలని రాష్ట్రంలో ఇంటెరిమ్ (ఐఆర్) రిలీఫ్ 5 శాతం అన్ని యూనివర్సిటీల్లోనూ అమలు జరిగే విధంగా గతంలో మాదిరిగా చెల్లించాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీలో పెండింగ్‌లో ఉన్న నాన్ టీచింగ్ సిబ్బంది 81 మంది పీఆర్సిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. యూనివర్సిటీల్లోని నాన్ టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర కేడర్లకు రెగ్యులర్ ఉద్యోగుల మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలని అప్పటిలోగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. 10 సం.లు సర్వీస్ దాటిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్ అయిన సిబ్బందికి రూ.5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి. గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని హెల్త్ కార్డులు, బస్ పాస్ సౌకర్యం, మహిళా ఉద్యోగులకు 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జే.వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ, అమీ ర్, రాష్ట్ర కోశాధికారి మహమ్మద్ సలార్, రాష్ట్ర కార్యదర్శి మహేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులున్నారు.

## వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో మోసాలు

- ఢిల్లీకి చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- నిందితులపై దేశవ్యాప్తంగా 17కేసులు




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధికలాభాలొస్తాయంటూ దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సీసీఎస్ డీసీపీ తెలిపిన వివరాల మేరకు ఢిల్లీ ద్వారాఖాకు చెందిన అమర్‌నాథ్ సింగ్, రణ్‌వీర్ సింగ్‌లు సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. సోషల్‌మీడియా వేదికగా ప్రచారం చేసేవారు. ఆన్‌లైన్‌లో ఫోన్‌నెంబర్లు సంపాదించి బాధితులను ఫోన్‌లోనే సంప్రదించేవారు. తాము చెప్పిన వ్యాపారంలో పెట్టుబడులు పెట్టాలని, తమ ప్రొడక్ట్ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుందని చెప్పేవారు. నమ్మిన వారిని నుంచి రిజిస్ట్రేషన్ ఇతర ఖర్చుల పేరుతో డబ్బులు లాగేవారు. అనంతరం లింక్‌లను కట్‌చేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసేవారు. ఇదే తరహాలో నగరానికి చెందిన ఓ వ్యాపారిని టార్గెట్ చేసిన నిందితులు ఫోన్‌చేశారు. మంచివ్యాపారం ఉందని నమ్మించారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఓ లింక్‌ను పంపించారు. లింక్‌లో రిజిస్ట్రేషన్ చేయడంతో కొన్ని మేసేజ్‌లు వచ్చాయి. వాటిని పూర్తిగా నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా రూ.9,50,531లు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత సైబర్‌నేరస్తులు స్పందించక పోవడంతో పాటు ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా నిందితులపై 17కేసులున్నాయని తెలిపారు.

## వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహ పునఃప్రతిష్టాపన

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**సొంత నిధులు రూ.15లక్షలతో నిర్మాణం**



**నవతెలంగాణ-అంబర్‌పేట**

బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో చెంచు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభంగా జరిగింది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన సొంత నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన ఈ దేవాలయాన్ని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం చెంచు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.హన్మంతు, ప్రధా న కార్యదర్శి ఎన్.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎన్.నాగులు, కోశాధి. కారి తిరుపతయ్య, సహాయ కార్యదర్శి వెంకన్న, సభ్యులు యు.కుర్మయ్య, ఎస్.కృష్ణ, ఎం.కుర్మయ్య, ఎన్.మహేష్, జగన్, వెంకటేశ్ తదితరులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులను కార్పొరేటర్ దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు సీహెచ్. చంద్రమోహన్, పి.గెల్వయ్య, టి.రమేష్ నాయక్, ఎం.అరుణ్ కుమార్ రెడ్డి, మిర్యాల రవీందర్, సునీల్, పి.చంద్రశేఖర్, శ్రీహరి, నరహరి, సాయి,శేఖర్, బంగారు శ్రీను, యూసుపోద్దీన్, మిర్యాల శ్రీను, వెంకటరమణ రాజు, స్వర్ణ, అమరావతి, భాస్కన్‌గౌడ్ తదితరులున్నారు.

## టెలికమ్యూనికేషన్స్ రంగాలలో ట్రాయ్ పాత్ర కీలకం




**నవతెలంగాణ-ధూల్‌పేట్**

టెలికమ్యూనికేషన్స్ రంగాలలో ట్రాయ్ పాత్ర కీలకమ ని, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)లో రిజిస్టర్ అయిన టెలికాం వినియోగదారుల సంస్థల సామర్థ్యం పెంపుదల కోసం సెంట్రల్ జోన్ రీజినల్ వర్క్ షాప్‌ను హోటల్ అబోడ్‌లో నిర్వహించారు. సైఫాబాద్, సైఫాబాద్‌లోని లక్డికాపూల్ మెట్రోస్టేషన్ తదితర ప్రాం తాల్లో జరిగిన కార్యక్రమాల వివరాల చర్చించారు. టెలి కమ్యూనికేషన్స్, ప్రసార నియమాలు, వినియోగదారుల హక్కులు, ఇటీవలి సూచనలు, సంప్రదింపులు ట్రాయ్ నిబంధనలు, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన టెలికాం వినియోగదారుల సంస్థల ప్రతినిధులు, ఈ నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ టెలికాం కంపెనీలైన ఎయిర్ టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్, ఐడియా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని వినియోగదారుల సంస్థలు, టెలికాం కంపెనీల ప్రతినిధులు ప్రదర్శనలు ఇచ్చారు. ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ వైయస్ రాజు గ్రామీణ వినియోగదా రులకు అవగాహన కల్పించడంలో వినియోగదారుల న్యాయవాద సమూహాల పాత్రపై ప్రస్తావించారు. కార్యక్రమానికి ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి. ప్రవీణ్ కుమార్ ఐటీఎస్ అధ్యక్షత వహించారు. తన ప్రసంగంలో టెలికాం ప్రసార వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, టెలికాం పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ట్రాయ్ చేపట్టిన ప్రయత్నాలు వివిధ కార్యకలాపాలను వివరించారు. ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయం జాయింట్ అడ్వైజర్ కేవి సురేష్ బాబు ప్రజెంటేషన్‌లో పలు అంశాలను నొక్కి చెప్పారు. ప్రసార నిబంధనలు, వినియోగదారుల రక్షణ, వినియోగదారులకు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయాచిత కమర్షియల్ కమ్యూనికేషన్స్ (యుసీసీ)ని అరికట్టడం, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ, అదనంగా ఈ ప్రదర్శన టెలికాం, ప్రసార రంగాలలో ట్రాయ్ పాత్రను హైలైట్ చేస్తుందన్నారు. సేవల నాణ్యత, టారిఫ్ రెగ్యులేషన్, ఇంటర్‌కనెక్షన్ ఒప్పందాలు, న్యాయమైన పారదర్శకతను నిర్ధారించడానికి ట్రాయ్ తీసుకున్న వివిధ కార్యక్రమాలపై ప్రత్యేక ప్రాధాన్య తనిస్తుందన్నారు. సి-డాక్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. జగదీష్ బాబు సైబర్ మోసాలు-భద్రత అవగాహనలో ఉందన్నారు. వారు నిర్వహించే ప్రాక్టికల్ కేసులను వివరించారు. సెక్యూరిటీ డైరెక్టర్ అరవింద్ కుమార్ సైబర్ మోసాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దానిని నిరోధించడానికి టెలికమ్యూ నికేషన్స్ శాఖ చేసిన ప్రయత్నాలపై చర్చించారు. టెలికాం సంస్థల ప్రతినిధులు తదితరులున్నారు.

## 'కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి'



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డా.బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కళాకారుడు డా.ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో వందలాది కళాకారులచే ధూం ధాం సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కలిశెట్టి అప్పల నాయుడు, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ లేకుంటే నేడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదని, కావున ఆ మహనీయుడి ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించుటకు ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని ఆయన మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరశురాం, కళాకారులు పొల్లాల వాణి, రేలారే గంగా, రామంచ భరత్, మల్లిక స్వరం, మా పల్లె శంకర్, గట్టగల్ల సంజీవ, రాచకొండ రంగన్న, గ్యాదరి యాకన్న తదితరులు పాల్గొన్నారు.



బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు ర్యాగ అరుణ్ కుమార్ ని ఆయన నివాసంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బీఆర్ ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు కట్ట బబ్లు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయాలు బీసీ బిల్లు పై ప్రత్యేకంగా చర్చించారు.

**నవతెలంగాణ-ముషీరాబాద్**

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం



- బీసీ సంక్షేమ సంఘం

**జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం**

**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అన్నారు. ఈ బిల్లు అమలు వెంటనే చేపట్టాలని అలాగే ప్రభుత్వ భూములను అమ్మకుండా ప్రభుత్వ హాస్టల్స్‌కు గురుకులాల స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ బీసీ బిల్లు చట్టం చేయాలని, వెంటనే ఈ బిల్లులకు ప్రభుత్వం రెండు జీవోలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదన్నారు. బీహార్, తమిళనాడు ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధాన ప్రక్రియను ఇక్కడ పాటించాలని కోరారు. ఈ ధపా సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్ళినా బీసీల కేసు గెలుస్తుందని, ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నాయని, అసెంబ్లీ చట్టం చేసిందన్నారు. స్వంత భవనాలు లేకపోవడం వల్ల అద్దె భవనాలలో చాలీచాలనీ వసతులతో విద్యార్థులు కిక్కిరిసి ఉన్నారని, దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువు దెబ్బ తింటుందని, పైగా ఏటా అద్దె కింద కోట్ల రూపాయలు ఖర్చవుతుందన్నారు. అన్ని వసతులతో హాస్టల్, పాఠశాల స్వంత భవనాలు నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు జి.అంజి, వేముల రామకృష్ణ, సూర్యనారాయణ , అనంతయ్య , రఘుపతి, జె.నరేందర్, నాగేంద్రబాబు, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

## 'మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి'




**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెం.60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ స్కీమ్ లో దాదాపు 17 వేల మంది కాంట్రాక్టు కార్మికులు గత అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంస్థలో మెగా కన్స్ట్రక్షన్, ఎల్ అండ్ టీ కంపెనీ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఉన్నప్పటికి వీరికి రాష్ట్రంలో ఉన్న ఏ కనీస వేతనాల జీవోను అమలు చేయకుండా శ్రమదోపిడీకి గురి చేసున్నారని ఆరోపించారు. ఈ సంస్థలో పంప్ ఆపరేటర్లు, లైన్మెన్లు, హెల్పర్లు, పిట్టర్లు, ఎలక్ట్రీషన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాచ్ మెన్, స్వీపర్లు అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.60 ప్రకారం వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, కార్మికులు ఎం.రఘు, సి.శేఖర్, టి.సత్యనారాయణ, పి.శ్రీనివాస్, ఎం.ప్రభాకర్ రెడ్డి, ఎండి.జానీ, ఎస్.రాంప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడిగా జె.నిరంజన్ యాదవ్



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

భారతీయ జనతా పార్టీ భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జె.నిరంజన్ యాదవ్‌ను శాలువా, పూలమాలలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకుడు గోవింద్ నారాయణ్ రాఠీ, డా.భగవత్ రావు, సుమీత్ రాఠీ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనాథ్, వినోద్‌గౌడ్ తదితరులున్నారు.

## పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సీబీఐ చేత విచారణ జరిపించాలి

- పలు క్రైస్తవ సంఘాల నాయకులు,

**బిషప్, పాస్టర్ల డిమాండ్**



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై వెంటనే సీబీఐ చేత, హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పలు క్రైస్తవ సంఘాలు, బిషప్, పాస్టర్లు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం హైదర్ గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు క్రైస్తవ సంఘాల నాయకులు, బిషప్, పాస్టర్లు డిన్ని, ముల్కల భాస్కర్, కెనడీ, శ్రీకాంత్ క్రిస్, సింగం, సుధీర్ కుమార్, అశోక్ తదితరులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని త్వరలో రెండు రాష్ట్రా ప్రభుత్వాల సీఎంలు, కేంద్ర హోం శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు. ఆయన మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, ముఖ్యంగా హిందూ మతోన్మాదుల నుంచి చంపుతామని బెదిరింపు కాల్స్ వచ్చాయని, ఈ విషయాన్ని ఆరు నెలల క్రితమే ఆయన ఏపీలో ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టిం చుకో లేదని ఆరోపించారు. ప్రవీణ్‌కుమార్ పోస్టుమార్టం రిపోర్ట్ న్యాయబద్ధంగా జరగాలని, జాప్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కోరారు. మతాలకు సంబంధించిన విషయాలను చానల్స్ డిబేట్లు పెట్టరాదని, సోషల్ మీడియాలో డిబేట్స్ పెట్టడం వల్లనే ఈ సంఘటన జరిగిందని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో పాస్టర్లు, బిషప్ రవీందర్, విలియం, దర్శన్, అభిషేక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ దేవి పుష్కరాలకు అన్నదాన ఏర్పాట్లు పూర్తి



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

ఉత్తరకాండలోని బద్రీనాథ్(చారధామం) దేవాలయం ప్రాంగణంలో సరస్వతీ దేవి పుష్కరాలను పురస్కరించుకొని మే 15 నుండి మే 26వ తేదీ వరకు 12 రోజులపాటు జరిగే పుష్కరాలకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు క్యాథమ్ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేష్, కోశాధికారి సీఏ అనిల్ నాయర్‌లు పేర్కొన్నారు. ఈబుధవారం ఉస్మాన్ గంజ్‌లోని సంస్థ కార్యాలయంలో అన్నదానం సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమ పై శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్న ట్రస్ట్, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ( బాస్)లు, ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి నది పుష్కరాలకు దేశ విదేశాల నుండి వచ్చే భక్తులకు, ప్రతిరోజు నిత్య అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని ఈ బృహత్తరం వంటి కార్యక్రమంలో పాల్గొనే భక్తులు, www.bass group. Com వెబ్‌సైట్‌లో సంప్రదించి మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చని వారు తెలిపారు. ఈ సరస్వతి దేవి పుష్కరాలకు, భక్తులు కుటుంబ సమేతంగా తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్న ట్రస్టు అధ్యక్షులు, యాద అశోక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పి.మల్లికార్జున రావు, కోశాధికారి, జె.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పారామిలిటరీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో పారామిలిటరీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని అలయన్స్ ఆఫ్ ఆల్ మాజీ పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హెచ్ ఆర్ సింగ్ అన్నారు. మాజీ ఎడీజీ, సీఆర్ పీఎఫ్ ఆధ్వర్యంలో 15 మంది వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధుల బృందం పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీని న్యూ ఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనంలో కలసి విజ్ఞాపన పత్రం అందజేశారు. తేది 23-11-2012 నాడు భారత ప్రభుత్వం, హోమ్ మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేయబడిన ఆఫీస్ మెమొరాండం ప్రకారం మాజీ సైనికులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలోను మాజీ కేంద్ర సాయుధ పోలీస్ ఫోర్సెస్ సిబ్బందికి ( సీఆర్‌పీఎఫ్.బీఎస్ఎఫ్,. సీఐఎస్ఎఫ్.ఐటీబీపీ.ఎస్ఎస్‌బీ.ఏఆర్ అస్సాం రైఫల్)కు అమలు చేయమని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో పారామిలిటరీ వెల్ఫేర్ బోర్డును స్థాపించాలని కోరడం జరిగింది. ఈ ప్రతినిధుల బృందంలో ఎచ్ఆర్‌సింగ్, ఆర్‌టీ.ఏడీజీ, సీఆర్‌పీఎఫ్. రాంబీర్ సింగ్ వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో పాటు తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ ఫోర్సెస్ సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొని తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సీఆర్‌పీఫ్ సమస్యల గురించి వివరించడం జరిగిందన్నారు.

## గుర్తుతెలియని యాచకుడు మృతి..



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొగ్గులకుంట రోడ్ ఫుట్‌పాత్‌పై ఓ యాచకుడు మృతి చెందినట్లు డయల్ 100 ఫోన్ వచ్చిందని అబిడ్స్ ఎస్ఐ సుమన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యాచకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రి మా ర్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగంపల్లి- తెల్లాపూర్ మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. అతని వయసు 30 ఉంటుందని అతని ఒంటిపై నీలిరంగు టీ షర్ట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతి దేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించినట్లు తెలిపారు. సంబంధికులు ఎవరైనా ఉంటె 9000394635 సంప్రదించాలన్నారు.

## జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ పరిరక్షణకు సిబ్బందిని నియమించాలి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ పరిరక్షణకు జీహెచ్ఎంసీ సిబ్బందిని నియమించాలని కార్పొరేటర్ వినయ్ కుమార్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణానికి ఇక నుండి ఒక జీహెచ్ఎంసీ కార్మికుడిని ఇన్‌చార్జి కమ్యూనిటీ హాల్‌గేటు వద్ద విధులు నిర్వహించేందుకు నియమించాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. బుధవారం జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన కార్పొరేటర్ వారు మాట్లాడుతూ చీకటి పడిన వెంటనే అసాంఘిక కార్యకలాపాలు, రాత్రిళ్ళు మద్యం సేవించి ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని, అనధికారిక వెహికల్ పార్కింగ్‌కు నెలవుగా మారిందని ఎస్ఆర్‌టీ జవహర్ నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కళ్యాణమండపం పరిరక్షణ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌తో సమీక్షించి, సమస్య వివరాలను తెలిపి వారి అనుమతితో ఒక ఇన్‌చార్జిను నియమించే నిర్ణయం తీసుకున్నామని కార్పొరేటర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జీహెచ్ఎంసీ ఎస్ఎస్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, వెంకటేష్, జీహెచ్ఎంసీ సిబ్బంది కమ్యూనిటీ హాల్ సభ్యులు మదన్మోహన్, సాయికుమార్ ఆనంద్ రావు, రాజ్ కుమార్, ప్రశాంత్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



# షడ్రుచుల సేవనం

తెలుగు సంవత్సరాది వచ్చిందంటే మన తెలుగువారి ఇంట ఒకటే సందడి. ప్రతి ఇంటా ఉగాది పచ్చడి రుచులు. జీవితంలోని కష్టసుఖాలు షడ్రుచుల వంటివనీ ఉప్పు, పులుపు, కారం, తీపి, చేదు, వగరు మొదలైన ఆరు రుచులన్నీ ఒకేసారి సేవిస్తే జీవితంలో కష్టసుఖాలు కూడా ఉగాది పచ్చడి అంత సురుచికరంగా సౌకర్యవంతంగా మారి మన జీవన మనుగడకు దోహదం చేస్తాయని ఒక నమ్మకం. చేసే విధానంగా చేస్తే ఉగాది పచ్చడి అంత రుచికరమైన వంట మరొకటి ఉండనే ఉండదు. ఈ ఉగాది వేళ రుచికరమైన ఉగాది పచ్చడి తయారీ విధానం గురించి తెలుసుకుందాం...

**కావల్సిన పదార్థాలు:** ఒక స్పూను వేపపువ్వు, చిన్న చెరకు ముక్క, చిన్న కొబ్బరి ముక్క, ఆరు అరటిపళ్లు, నిమ్మకాయంత చింతపండు, చిన్న మామిడికాయ, వంద గ్రాముల బెల్లం, ఒక పచ్చిమిర్చి, చిటికెడు ఉప్పు, రెండు ఏలకులు, రెండు గ్లాసుల నీళ్లు.

**తయారు చేసే విధానం:** ముందుగా చెరకు, కొబ్బరి, బెల్లం, పచ్చిమిర్చి, మామిడికాయలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని విడివిడిగా పెట్టుకోవాలి. వేప పువ్వును శుభ్రపరిచి రేకల్ని మాత్రం పక్కన ఉంచుకోవాలి. ఏలకులు పొడి చేసి పెట్టుకోవాలి. రెండు గ్లాసుల నీళ్లలో చింతపండును బాగా పిసికి, పులుపు నీళ్లను ఒక గిన్నెలోకి వడగట్టాలి. అందులో బెల్లం పొడి వేసి బాగా కలియబెట్టాలి. ఆ తర్వాత అరటిపళ్లను బాగా ముద్ద చేసి ఆ నీళ్లలో కలపాలి. ఎక్కడా అరటిపండు ముక్కలు ఉండకూడదు. అందులో చిటికెడు ఉప్పు, ఏలకల పొడి, చెరకు, కొబ్బరి, పచ్చిమిర్చి, మామిడికాయ ముక్కల్ని వేసి బాగా కలపాలి. అంతే ఉగాది పచ్చడి రెడీ.

**తెలుగు నాటకరంగ చరిత్రలో 'సురభి నాటక సంస్థ' 137 ఏండ్ల సుదీర్ఘమైన చరిత్రను సముపార్జించు కున్న ఏకైక నాటక సంస్థగా ఇప్పటికీ అలరారుతోంది. నాటక కళనే జీవనోపాధిగా ఎంచుకొని, వృత్తిగా నమ్ముకొని, కళాసేవ చేస్తూ, నాటక వికాసానికే అంకితమైన సంస్థగా వెలుగొందుతోంది. ఈ సంస్థలోని సభ్యులందరూ కళాకారులే! చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. సురభి కుటుంబ సభ్యులందరూ వనారస, అవేటి, సింధూరి, రేకందర్ లాంటి నాలుగు ఇంటిపేర్లతో ఎలాంటి తారతమ్యం లేకుండా ఒకరికొకరు సహకరించు కుంటూ నాటకకళకు జీవం పోస్తున్నారు. ఆ కుటుంబంలో సురభి ప్రభావతి ఒకరు. ఈరోజు ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఆమె కళా ప్రయాణం నేటి మానవిలో.**



# సురభి ప్రభావతి

సురభి నాటక సంస్థకు ఆద్యులు వనారస గోవిందరావు. సినిమాలు లేని ఆ రోజుల్లో సురభి నాటకాలే తెలుగు నాటక కళాప్రియులను రంజింపజేసాయి, వినోదాన్ని పంచాయి. సురభి కుటుంబీకులు ఊరూరు తిరుగుతూ ప్రతి ఊళ్ళో కనీసం రెండు నెలలు వుండేలా తమకు తామే ఒక పెద్ద తాత్కాలిక నాటకశాలలను నిర్మించుకుని గొప్ప గొప్ప నాటకాలను ప్రదర్శిస్తూ వుండేవారు. నాటక ప్రదర్శనా సమయంలో సురభి సాంకేతిక సిబ్బంది చేసే విన్యాసాలు, ట్రిక్స్, వైర్‌వర్క్స్ అనితరసాధ్యం. అందుకే అలనాటి మూకీ, టాకీ సినిమాలలో సురభి నాటక కళాకారిణులే నటించేవారు. నాటకరంగంలో పేరు ప్రఖ్యాతులు గడిస్తూ, తన కంటూ తానుగా ప్రత్యేక స్థానాన్ని సముపార్జించు కుంటున్నారు సురభి ప్రభావతి.

## కళే జీవితంగా...

ప్రభావతి నాటక కళాకారులైన రేకందర్ కుమార్ బాబు, కమలమ్మలకు 42 ఏండ్ల కిందట జనగామ జిల్లా, తరిగొప్పుల గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రుల నుండి కళ పట్ల ఆసక్తి పెంచుకున్న ప్రభావతి కూడా ఇదే రంగాన్ని తన కెరీర్‌గా మలుచుకున్నారు. కళే జీవితంగా బతుకుతున్నారు. వీరి జీవన సహచరుడు వనారస నాగేష్ కూడా సురభి కళాకారులే. వీరి పిల్లలు సాయిరాం, వైష్ణవి కూడా బాలనటులుగా నటించారు. ఆమె శశిరేఖాపరిణయం, నరకాసుర, శ్రీకృష్ణసత్య, కృష్ణార్జునీయం, ప్రమీలార్జున పరిణయం, శ్రీకృష్ణకమల పాలిక, పాదుకాపట్టాభిషేకం, గణపతి మహాత్మ్యం, యయాతి, శమంతకమణి లాంటి పౌరాణిక పద్యనాటకాలలో నటించారు. చింతామణి, పల్నాటియుద్ధం, కవయిత్రి మొల్ల, తరిగొండ వెంగమాంబ, సైరా నరసింహారెడ్డి, సారంగధర, చిత్రాంగద, రుద్రమదేవిలాంటి చారిత్రాత్మక పద్య నాటకాలలో కూడా నటించారు. బాపు బాటలో, గాలివాన, పయనించే ఓ చిలుకా, నారీనారీ నడుమ, నిశి, రాజిగాడు - రాజయ్యాడు, పడమటి గాలి, రేపటి స్వర్గం, పులి మళ్ళీ వచ్చింది, కల్లందిబ్బ, కంఠాభరణం, కన్యాశుల్కం, లాస్ట్ వార్నింగ్, పునాది, స్పీడు బ్రేకర్, హార్దిక సంబంధాలు, మూడోదరి, యోగనిద్ర, రైతేరాజు, అమ్మను కాపాడుకుందాం, త్యాగం, శైథిల్యం,



మిస్టరీలాంటి సాంఘిక నాటకాలలోనూ నటించారు.

## సాంఘిక నాటికలు

శిశిరాలలో, నిమజ్జనం, సముద్రమంత సంతోషం, మనకోసం మనదేశం, నవ్వుల నదిలో, హననం, శతమానం భవతి, అమ్మ పాల రుచులు, రైతంటే, ధరిత్రి రక్షతి రక్షిత:, కొత్తచిగురు, మట్టివేళ్ళు, అమ్మను కావాలి, ఓ భార్య తీర్పు, లైఫ్ లైన్, మాతృక, అబ్బే ఏంలేదు, ఒక క్షణం, అందమె ఆనందం, దిక్సూచి, వన్-టూ-త్రీ, రామచిలుక, చెంగల్వ పూదండ, రచ్చబండ, చిత్తగించవలెను, సైకత శిల్పం, రివర్స్ గేమ్, బొమ్మ సముద్రం, ఖాళీలు పూరించండి, మళ్ళీ మొదలు పెట్టకండి, కక్కుర్తి, మాకంటూ ఒకరోజు, సద్గతి, పంపకాలు, తూర్పుసంధ్య, భరోసా, చేయూత, శ్రీకారం, కొత్త బానిసలు, ఎక్కడో ఒకచోట, మధురం, కుక్కపిల్ల, చేజారితే, అటకెక్కింది, మనసుతో ఆలోచిస్తే, గమ్యస్థానం వైపు, భూమి దు:ఖం, రాతిలో తేమ, ఏది నిజం, బంధాల బరువెంత... వంటి సుమారు యాభై సాంఘిక నాటికల్లో నటించారు.

## అందవేసిన చేయి

నటనలో, వాచకంలో, డైలాగులు గుర్తుంచుకోవడంలో, పద్య పఠనంలో సురభి ప్రభావతిది అందెవేసిన చేయి. తన 20 ఏండ్ల నట ప్రస్థానంలో ఆమె సుమారు రెండువేల పైచిలుకు నాటక ప్రదర్శనలలో పాల్గొని శహభాష్ అనిపించుకున్నారు.

సినిమాల్లో గానీ, టీవీల్లో గానీ, షార్ట్ ఫిల్మ్స్‌లో గానీ అవలీలగా నటించడానికి ఆమె నాటకానుభవం ఎంతో తోడ్పడు తుందన్నది వాస్తవం.

## నటించిన సినిమాలు

ఆపరేషన్ ఐ.పి.యస్., బతుకమ్మ మహాత్మా, ఆది గురువు అమ్మ, మిడిల్ క్లాస్ మెలోడీస్, సురాపానం, భైరవగీత, దొరసాని, అఖండ, అశోకవనంలో అర్జున



కల్యాణం, ఈ రామాయణం, వినరో భాగ్యము విష్ణుకథ, అంబాజీపేట బ్యాండ్ పార్టీ, పంచతంత్రం, మెయిల్ వంటి చిత్రాల్లోనూ నటించి వెండితెర ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. అంతే కాదు మాయాబజార్, పూతరేకులు, సరస్వతీ వైభవం, కలవారి కోడలు, ముద్దమందారం, సీతమ్మ వాకిట్లో, మనసు-మమత వంటి టీవీ సీరియల్స్‌లోనూ నటించి ప్రతి ఇంటికీ చేరువయ్యారు. అలాగే కుర్తా, లక్ష్మిగారి అబ్బాయి, మా బుజ్జక్క అనే షార్ట్‌ఫిల్మ్‌లో కూడా నటించారు.

## నటనకు అందిన పురస్కారాలు

ఓ కళాకారిణిగా ప్రభావతి ఎన్నో అవార్డులు, రివార్డులు, పురస్కారాలు అందుకున్నారు. 2009లో నెల్లూరు నంది నాటక పోటీల్లో 'బాపు మాట' సాంఘిక నాటకానికి ఉత్తమనటిగా, 2010లో ఖమ్మం నంది నాటక పోటీల్లో 'విప్రనారాయణ' పద్యనాటకంలో దేవదేవి పాత్రకు ఉత్తమనటిగా అవార్డులు అందుకున్నారు. 2011లో గుంటూరు నంది నాటక పోటీల్లో 'పల్నాటియుద్ధం' పద్యనాటకంలో నాగమ్మ పాత్రకు జ్యూరీ బహుమతి పొందారు. 2014లో రాజమండ్రి నంది నాటక పోటీల్లో 'మాతృక' సాంఘిక నాటికలో నిర్మల పాత్రకు ఉత్తమ సహాయనటి బహుమతినీ, 2015లో తిరుపతి నంది నాటక పోటీల్లో 'కర్ణార్జునీయం' పద్య నాటకంలో కుంతి పాత్రకు ఉత్తమనటి బహుమతినీ పొందారు.

## ప్రతిష్టాత్మక అవార్డులు

వెంకటేశ్వర నాటక కళాపరిషత్, తిరుపతి వారు నిర్వహించిన పద్యనాటక పోటీలలో 'గరుడ అవార్డు'లు ఆరు, అశ్వం అవార్డులు మూడు లభించాయి. అలాగే 2021 'ప్రమీలార్జునీయం' పద్యనాటకంలో 'కుంతి' పాత్రకు వీణా అవార్డు పొందారు. అలాగే పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 'కీర్తి పురస్కారం', ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి 'ఉగాది పురస్కారం', నవరస, కాకినాడ వారి 'నవరస పురస్కారం', కళారంజని, భీమవరం వారి 'మహానటి సావిత్రి పురస్కారం', ఆరాధన, హైదరాబాద్ వారి 'గౌరవ పురస్కారం', యువకళావాహిని, హైదరాబాద్ వారి 'కళారత్న పురస్కారం' వంటివి ఎన్నో అందుకున్నారు. ఇంతటి నటనా ప్రతిభా ప్రపత్తులు గల ఈ నట విదుషీమణికి, తెలుగు నాటకరంగంలో బంగారు భవిష్యత్తు పుష్కళంగా ఉంది. సురభి ప్రభావతి నాటక, సినీ, టీ.వీ. రంగాలలో తన నిరుపమాన నటనా ప్రతిభతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

- శ్రీపాద కుమారశర్మ

# కమీషన్ రగడ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలు ఇచ్చారని విమర్శించారు. తాము మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పేపర్ యాడ్‌లు ఇచ్చినట్టు అభియోగం మోపడం సరిగాదన్నారు. ఒక్క యాడ్ ప్రభుత్వం పక్షాన ఇచ్చినట్టు నిరూపిస్తారా? ఇచ్చి ఉండకపోతే గౌరవ సభ్యులు ఏం చేస్తారు? అని ప్రశ్నించారు. అసత్యాలు మాట్లాడటం సరిగాదనీ, నోటికి ఏదొస్తే అది మాట్లాడటం తగదని హితవు పలికారు. ఐఅండ్‌పీఆర్ ద్వారా ఎన్నికల యాడ్‌లు ఇచ్చినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. నాలుగు కోట్ల రూపాయల్పి.. యాడ్ల కోసం రూ.40 కోట్ల ఖర్చుపెట్టామనడం సరిగాదని కొట్టిపడేశారు. అదే సమయంలో కౌశిక్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ సభ్యులు రన్నింగ్ కామెంట్ చేయడాన్ని ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి తప్పుబట్టారు. క్రాస్ ట్రాక్ చేయొద్దని సభ్యులకు సూచించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..మహారాష్ట్ర ఎన్నికల్లో తాము ఖర్చుపెట్టినట్టు మీరు చూపాలని సవాల్ విసిరారు. పత్రికా ప్రకటనలపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. పల్లా మాట్లాడే సమయంలో మంత్రులు పదేపదే లేచి మాట్లాడటంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. 'కూర్చోండి..కేటీఆర్ కూర్చోండి.. రాజేశ్వర్‌రెడ్డికి 10 :20కి మైకు ఇచ్చాం. 11 :43 అవుతున్నది. త్వరగా ముగిస్తే మీ నుంచి మరో సభ్యునికి మాట్లాడే అవకాశం దక్కుతుంది. సబ్జెక్టు వరకు పరితిమితం కండి రాజేశ్వర్‌రెడ్డి' అని సూచించారు. అయినా, కేటీఆర్ వినకపోవడంతో కేటీఆర్‌కు ప్యానల్ స్పీకర్ మైకు ఇచ్చారు.

### 30 శాతం కమీషన్ సర్కార్... : కేటీఆర్

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ మాట్లాడుతూ..'సభలో విశేష అనుభవమున్న, ఉన్నత పదవులను అలంకరించిన మిమ్మల్ని అడుగుతున్నా. రికార్డులు తెప్పించండి. మంత్రులు అన్ని సార్లు జోక్యం చేసుకోవడమేంటి అధ్యక్షా. ఎసెన్స్ ఆఫ్ డెమెక్రసీ సార్. కాంగ్రెస్ నుంచి 53 మంది కొత్త సభ్యులున్నారు. డిస్కర్షన్, డిబెట్, డిసెంట్ ఉండాలి. ప్రతిపక్షంగా ప్రభుత్వం చేస్తామని చేయని వాటిని ఎత్తిచూపుతాం. అలవుగాని హామీల గురించి అడుగుతాం. మంత్రులకు దయచేసి చెప్పండి. ఎక్కువ ఇన్వాల్వ్ కావొద్దని చెప్పండి. చెప్పాలనుకుంటే మేం కూడా చెప్పొచ్చు. 30 శాతం కమీషన్ సర్కారు అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నరు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారని కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నాలు చేస్తున్నారు' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులంతా లేచి ముందుకొచ్చారు.

### 30 శాతం కమీషన్ నిరూపించు.. లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

30 శాతం కమీషన్లు ఎక్కడ తీసుకున్నామో కేటీఆర్ నిరూపించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. లేదంటే రాష్ట్ర ప్రజలకు, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చామనీ, తాడితపీడిత, అణగారిన వర్గాల వారి పక్షాన నిలబడ్డామని చెప్పారు. 'మీలాగా రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకోలేదు. మీరు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. సభ్యులు మాట్లాడేటప్పుడు నిబద్ధతతో, ఒళ్ళు దగ్గర పెట్టుకునే మాట్లాడాలి. మైకు దొరికింది గదా అని ఏది పడితే అది మాట్లాడితే చెల్లుబాటు అవుతుంది అనుకుంటున్నారా?' అంటూ ప్రశ్నించారు. మాట్లాడే ప్రతి మాట జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. డిస్కర్షన్, డిబేట్ అంటూనే ప్రతిమాటా అబద్ధం చెబితే ఎలా అని నిలదీశారు. '40,000 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు మీరు పెండింగ్లో పెట్టి పోయారు, మీ పాపం వల్ల మొత్తం లక్ష కోట్ల బిల్లులు పెండింగ్లో పడ్డాయి. పనులు చేసిన వాళ్లు బిల్లులు రాక సచివాలయం చుట్టూ రోజూ తిరుగుతున్నారు. దానిపైనా అసత్య ప్రచారం చేయడం తగదు' అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరిట అడ్డ గోలుగా ప్రకటనలు ఇచ్చామని అబద్ధాలు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి సివిల్ సర్వీస్ పరీక్షల్లో ప్రిలిమ్స్ పాసై దరఖాస్తు చేసుకున్న పేదలకు లక్ష రూపాయల సహాయం, మెయిన్స్ అర్హత సాధించి ఢిల్లీలో ఇంటర్వ్యూలకు ప్రిపేర్ అయ్యే రాష్ట్ర అభ్యర్థులకు మరో లక్ష రూపాయలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. వారు సివిల్స్ సర్వీసులో ఉంటే భవిష్యత్తులో రాష్ట్రానికి మేలు చేసే అవకాశం ఉంటుంది కదా? రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతారు కదా? ఇలాంటి మంచి పథకం మీద అలా మాట్లాడటం తగదని హెచ్చరించారు. కేటీఆర్ వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ఇతర సభ్యుల మాటల్లోనూ అన్‌పార్లమెంట్ పదాలుంటే తొలగిస్తామని హామీనిచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు '30 శాతం కమీషన్ సర్కార్ డౌన్ డౌన్...30 శాతం కమీషన్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేసుకుంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.



### సీఎల్పీగా ఉండనివ్వలేదు.. ఆర్థిక మంత్రిగా కూడా ఉండనివ్వరా : పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో సీఎల్పీ నేతగా మల్లు భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక కాంగ్రెస్ సభ్యుల్ని సంతలో లెక్క కొన్నారని విమర్శించారు. దళిత నేతకు సీఎల్పీ పదవి లేకుండా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయనే ఆర్థిక మంత్రిగా ఉన్నాడని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు ఇలాగే వ్యవహరించారు.. ఇప్పుడూ ఇలాగే వ్యవహరిస్తున్నారు.. దళితుడు ఆర్థిక మంత్రిగా ఉండొద్దా? అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీఆర్ఎస్ సభ్యులకు సూచించారు.

# అప్రజాస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

చేసినప్పుడు కూడా తాను మాట్లాడేందుకు ప్రయత్నించాననీ, అప్పుడు కూడా స్పీకర్ తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. స్పీకర్ ఉద్దేశం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రూల్ 349కు అనుగుణంగా నడుచుకుంటారని భావిస్తున్నామంటూ స్పీకర్ సభను వాయిదా వేయడాన్ని రాహుల్‌గాంధీ తప్పుబట్టారు. రూల్ 349కు విరుద్ధంగా తాను ఏం చేశానని ప్రశ్నించారు. ప్రధాని మోడీ కుంభమేళాపై ప్రసంగిస్తుండగా తొక్కిసలాటలో మరణించినవారి గురించి ప్రస్తావించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారనీ, కానీ ప్రధాని తొక్కిసలాట మృతులకు కనీసం సంతాపం కూడా తెలియ జేయలేదని రాహుల్ గాంధీ విమర్శించారు. పైగా స్పీకర్ రూల్ 372ని విధించారనీ, ఈ రూల్ ప్రకారం ప్రధానిగానీ, మంత్రిగానీ మాట్లాడుతున్న ప్పుడు ఇతర సభ్యులు ఎలాంటి ప్రశ్నలూ వేయకూడదని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశముంటుందనీ, కానీ వీళ్ల మాత్రం తనను మాట్లాడనివ్వడంలేదని ఆరోపించారు.

సభా కార్యక్రమాలు అప్రజాస్వామిక విధానంలో సాగుతున్నాయనీ, కీలక అంశాలను ప్రస్తావించేందుకు తాను పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. మాట్లాడేందుకు అవకాశమివ్వాలని ఆయనను (స్పీకర్) కోరుతున్నప్పటికీ అనుమతించడం లేదని చెప్పారు. ఇది సభ నడిపే పద్ధతి కాదన్నారు. మహాకుంభమేళా గురించి ఇటీవల ప్రధాని మాట్లాడినప్పుడు తాను నిరుద్యోగం గురించి మాట్లాడాలను కున్నాననీ, కానీ పలుమార్లు అడ్డుకట్ట వేశారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. "నేనేమీ చేయలేక కూర్చుండి పోయాను. ఇప్పటికీ నేను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడకుండా అడ్డుకుంటు న్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యానికి చోటు లేదు" అని అన్నారు.

దీనికి ముందు, బుధవారం సభా కార్యక్రమాల సమయంలో స్పీకర్ ఓంబిర్లా రాహుల్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... సభ గౌరవాన్ని కాపాడేం దుకు నిబంధనలను పాటించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన సభా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం లేదని పలుమార్లు తన దృష్టికి వచ్చిందన్నారు. "ఈ సభలో తండ్రీకూతురు, తల్లీ కుమార్తె, భార్యాభర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రతిపక్ష నేత 394 నిబంధన ప్రకారం నడుచుకుంటారని ఆశిస్తున్నాను" అని అన్నారు. కాగా, స్పీకర్ తన గురించి వ్యాఖ్యలు చేసి దానిపై మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకుండానే సభను వాయిదా వేశారని రాహుల్ గాంధీ తెలిపారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా తనపై స్పీకర్ అసత్యాలు మాట్లాడు తున్నారని అన్నారు. గత వారం కూడా తనకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు.

# ఆ వ్యాఖ్యలు అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు సహకారం అందించారు. సుమోటో కేసును జాగ్రత్తగా పరిశీలించాలని వారు న్యాయస్థానాన్ని కోరారు.

కేంద్రానికి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేసులో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించుకునే అవకాశాన్ని మైనర్ బాధితురాలి తల్లికి ఇచ్చింది. అవసరమైన చర్యల నిమిత్తం తన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రీకి, ఆయన ద్వారా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలియజేయాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. అనంతరం కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

అత్యాచార అభియోగానికి సంబంధించి ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను వ్యతిరేకిస్తూ నిందితులు దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను పురస్కరించుకొని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కేసు నిందితులకు సమన్లు జారీ చేసే ప్రారంభ దశలోనే ఉన్నప్పుడు న్యాయమూర్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అసంబద్ధంగా, నష్టాన్ని చేకూర్చేలా ఉన్నాయని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అలహాబాద్ న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వులలోని మూడు పేరాలు అసహ్యకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పేరాల ప్రకారం...ఇద్దరు నిందితులు మైనర్ బాలిక వక్షోజాలను పట్టుకొని, ఆమె పైజమా దారాన్ని తెంచి, ఆమెను కల్వర్టు కిందికి లాగడానికి ప్రయత్నించారు. అయితే అటుగా వెళుతున్న వారిని చూసి నిందితులు పారిపోయారు. అయితే సెక్షన్ 376 (అత్యాచారం), 511 (జీవిత ఖైదు శిక్ష విధించదగిన నేరానికి పాల్పడేందుకు ప్రయత్నించడం), పోక్సో చట్టంలోని సెక్షన్ 18లో ఉన్న అత్యాచార ఆరోపణలు...ఇవి నిందితులకు సమన్లు జారీ చేయడానికి సరిపోవని జస్టిస్ మిశ్రా పేర్కొన్నారు. పోక్సో చట్టం ప్రకారం నేరం చేయడానికి ప్రయత్నిస్తే సెక్షన్ 18 కింద శిక్షించవచ్చు.

ఈ కేసులోని వాస్తవాలను కూలంకషంగా పరిశీలించిన తర్వాతే సమన్ల ఉత్తర్వులను సవరిస్తున్నామని జస్టిస్ మిశ్రా చెప్పారు. 'నిందితులు అత్యాచారానికి ప్రయత్నించినట్లు ప్రాథమిక అభియోగం మోపలేము' అని వాటిలో తెలిపారు. దానికి బదులుగా ఐపీసీలోని సెక్షన్ 354 (బీ) ప్రకారం చిన్న నేరానికి పాల్పడినందుకు సమన్లు జారీ చేస్తానని ఉత్తర్వులలో వివరించారు. 'ఒక మహిళను దుస్తులు విప్పమని లేదా నగ్నంగా ఉండమని బలవంతం చేసే ఉద్దేశంతో దాడి చేయడం లేదా అవమానించడం ఈ సెక్షన్ కిందికి వస్తుంది. బాధితురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం శిక్షకు గురవుతారు' అని ఈ నెల 17న జారీ చేసిన ఉత్తర్వులలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా తెలిపారు.

# రణరంగంగా రామోజీ ఫిల్మ్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు బలగాలు అడ్డుకోవాలని చూసినా వారిని దాటుకుని పేదలు ముందుకు సాగారు. అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించారు. పార్టీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదలు భూముల్లోకి వెళ్లే క్రమంలో పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నా వారిని ప్రతిఘటిస్తూ తమ జాగాల్లోకి చేరుకున్నారు. అక్కడ సమావేశమై తమ కార్యాచరణకు పూనుకునే క్రమంలో రంగంలోకి దిగిన ఏసీపీ రాజు.. సీపీఐ(ఎం) నాయకులతో చర్చించే ప్రయత్నం చేశారు. 'రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం కొంత గడువు కోరిందని.. ప్రత్యా మ్నాయం చూపిస్తామంటుందని, ఇక్కడ ఆందోళన చేయొద్దని.. నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీనికి పార్టీ నాయకులు స్పందిస్తూ.. 'ఇలాంటి వాగ్దానాలు 18 ఏండ్లుగా వింటున్నాం. మేము గుడిసెలు వేసి తీరుతాం. మమ్మల్ని అడ్డుకో వద్దు' అంటూ కరాఖండిగా చెప్పారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో పోలీసులు జులుం ప్రదర్శించారు. వారిని లాక్కెళ్తూ... వాహనంలోకి ఎక్కించారు. పార్టీ శ్రేణులను తరలించే వాహనాలను పేదలు అడ్డుకున్నారు. పోలీసులు, ప్రజల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు లాఠీచార్జి చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, ఇతర జిల్లా నాయకత్వాన్ని లాక్కెళ్లారు. ఈ ఘటనలో ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్, మరో మహిళ వెంకటమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. వీరిని ఇబ్రహీంపట్నంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా క్యాదర్శి యాదయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, జగదీశ్, జగన్, జిల్లా నాయకులు పి.జగన్, సీహెచ్ జంగయ్య, డి.కిషన్, రావుల జంగయ్య సీనియర్ నాయకులు వెంటకటేష్, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### గుడిసెలు వేసి తీరుతాం : జాన్‌వెస్లీ

పేదల ఇండ్ల నిర్మాణం కోసం నాటి ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల జాగాలను పేదలకే ఇవ్వాలని, లేనిపక్షంలో ఆ భూముల్లో గుడిసెలు వేసి తీరుతామని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని, రామోజీ పిల్మ్ సిటీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. పొల్కంపల్లి, నగన్‌పల్లి రెండు గ్రామాలకు సంబంధించిన సుమారు 570 కుటుంబాలకు నాటి ప్రభుత్వం ఇండ్ల జాగాలు కేటాయించిందన్నారు. ఈ భూములపై కన్నేసిన రామోజీ యాజమాన్యం పేదల భూములను కాజేసేం దుకు కుట్రలు చేస్తోందన్నారు. పేదలను తమ జాగాలకు వెళ్లకుండా అడ్డంగా గేట్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వంతో రాయభారం చేస్తూ.. పేదలకు ఇక్కడ ఇండ్ల జాగాలు ఇవ్వొద్దని, తమకు ఇబ్బంది అవుతుందని.. ఈ భూమి తమకే ఇవ్వాలని, పేదలకు మరో చోట ఇండ్ల జాగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరిందన్నారు. ప్రభుత్వం కూడా రామోజీ యాజమాన్యానికి తొత్తుగా మారిం దన్నారు. పేదలకు వారి భూములు వారికి ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులకు 18 ఏండ్లు సరిపోలేదా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే.. ప్రజల కోసం పనిచేయకుండా.. డబ్బుల సంచులు పంపించే దగా కోరుల కోసం పనిచేస్తోందని విమర్శించారు. పేదల భూములు పేదలకు ఇవ్వాల్సిం దేనని, లేకుంటే.. పదివేల మందితో రామోజీ ఫిల్మ్ సిటీని ముట్టడించి అక్రమం గా కబ్జా పెట్టిన 360 ఎకరాల్లో ఎర్రజెండాలు పాతుతామని హెచ్చరించారు. పోలీసులు అడ్డుపెట్టుకుని దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. పోలీసు, రెవెన్యూ వ్యవస్థ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని హితవు పలికారు. భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, పేదలకు ఈ జాగాలు దక్కే వరకూ సీపీఐ(ఎం) పోరాడుతుందని స్పష్టం చేశారు.

# రామోజీ యాజమాన్యంపై కేసు పెట్టాలి

### పట్టాలు పొందిన పేదలకు స్థలాలివ్వాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వం పేదలకిచ్చిన ఇండ్ల స్థలాలను, రోడ్లను, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయకుండా బుధవారం తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవటానికి వెళ్లిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు జిల్లా నాయకులను అరెస్టు చేయటమేంటని ప్రశ్నించారు. ఫిలింసిటీ దగ్గర నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. కానీ ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, చుట్టూ గోడ నిర్మించి సెక్యూరిటీని పెట్టి అడ్డుకుంటున్నదని పేర్కొన్నారు. స్థలాల్లోకి వెళ్ళిన 78 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి ఏండ్ల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందని తెలిపారు. జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని దీన్ని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్దిదారులను వారికిచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులు, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేసిందని పేర్కొన్నారు. వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన రామోజీ సంస్థపై కేసులు నమోదు చేయాలనీ, పేద ప్రజలకు తమ ఇంటి స్థలాలను అప్పగించి, అక్కడే నివాసం ఉండే విధంగా ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేదంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఇండ్లు లేని పేదలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



### సీపీఐ(ఎం)24వ అఖిల భారత మహాసభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మధురై. మధురైలో జరగనున్న సీపీఐ(ఎం)24వ అఖిల భారత మహాసభ ఆహ్వాన పత్రికను బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం , కేంద్ర కమిటీ సభ్యురాలు యు. వాసుకి, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు . ఎంపీ వెంకటేశన్, జిల్లా కార్యదర్శులు మధురై మున్సిపల్ చైర్మెన్ ఎం. గణేశన్, సబర్బన్ జిల్లా కార్యదర్శి కె. రాజేంద్రన్ పాల్గొన్నారు.



9వ మహాసభ ...

# సీపీఐ(ఎం) ప్రస్థానం

## అరుణారుణ చేతనం

సీపీఐ(ఎం) "భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక సుదీర్ఘ అంతరంగిక పోరాటంలో నుంచి ఆవిర్భవించిన కష్టజీవుల అమృత భాండం. రివిజనిజాన్ని, వర్గ సంకర రాజకీయాలను దునుమాడే వజ్రాయుధంగా ఇది భారత రాజకీయాల్లో ఉదయించిన నూతన శక్తి. భారతదేశ వామపక్ష శక్తుల ఆశాజ్యోతిగా 1964లో ప్రారంభమైన అరుణారుణ చైతన్య దీపిక సీపీఐ(ఎం). ఆ పార్టీ 24వ మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో 2025, ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన అఖిలభారత మహాసభల విశేషాలు" 'నవతెలంగాణ' నేటి నుంచి ధారావాహికంగా ప్రచురించే సంగ్రహ, సంక్షిప్త మాలిక....

### 7వ మహాసభ — అక్టోబర్ 31-7 నవంబర్ 1964 కలకత్తా, పశ్చిమబెంగాల్

ఏడో మహాసభలో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ఆవిర్భవించింది. దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు తీవ్రరూపాన్ని దాల్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిని దిగజార్చిందని మహాసభ అభిప్రాయపడింది. భారత దేశాన్ని బడా బూర్జువాల నాయకత్వంలోని బూర్జువా, భూస్వాముల పాలనగా, విదేశీ పెట్టుబడితో మిలాఖత్ సంబంధాలు కలిగి ఉన్నదని పార్టీ సూత్రీకరించింది. ఆ విధంగా ఒక కొత్త కార్యక్రమాన్ని కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక కర్షక మైత్రి ఇరుసు జనతా ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో సీపీఐ(ఎం) ఏర్పడింది. ఈ మహాసభే పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించింది.

**పొలిట్ బ్యూరో**

పి.సుందరయ్య
ఇఎంఎస్ నంబూద్రిపాద్
ఎ. కె. గోపాలన్
ఎం. బసవపున్నయ్య
పి. రామమూర్తి
బి. టి. రణదివే
హరికిషన్ సింగ్ సుర్జీత్
ప్రమోద్ దాస్‌గుప్తా
జ్యోతి బసు

ఈ 7వ మహాసభ 31 మందితో కేంద్ర కమిటీని, తొమ్మిది మందితో పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. కామ్రేడ్ పి. సుందరయ్య మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ తొలి పొలిట్ బ్యూరోనే నవరత్నాలుగా పిలుస్తారు.

### 8వ మహాసభ — 23-29 డిసెంబర్ 1968 కొచ్చిన్, కేరళ

1967 నక్సలైట్ల చీలిక సంఘటన తర్వాత సీపీఐ(ఎం) కేంద్ర ప్రభుత్వం నుంచి అణచి వేతను ఎదుర్కొంది. అతివాద-వామపక్షం నుండి, కేంద్రం నుంచి సవాళ్లను కూడా ఎదుర్కొంది. ఈ సవాళ్లను అధిగమించి, సీపీఐ(ఎం) నేతత్వంలోని సంకీర్ణాలు పశ్చిమ బెంగాల్, కేరళలో 1967 సాధారణ ఎన్నికలలో విజయం సాధించాయి. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్ట్ శిబిరంలో చీలికను పార్టీ మహాసభ గమనించింది, సోవియట్ పార్టీ రివిజనిజం ప్రభావంలోకి పడిపోయింది, చైనా పార్టీ భారత విప్లవ పంథాను తప్పుడు అవగాహనకు రావడం వంటి పరిణామాలు చోటుచేసుకున్న కాలంమది. స్వతంత్ర ప్రజా పోరాటాలను, సైద్ధాంతిక పటిష్టతను పెంచుకోవాలని 8వ మహాసభ పిలుపునిచ్చింది.

**పొలిట్ బ్యూరో**

పి.సుందరయ్య
ఇఎంఎస్ నంబూద్రిపాద్
ఎ. కె. గోపాలన్
ఎం. బసవపున్నయ్య
పి. రామమూర్తి
బి. టి. రణదివే
హరికిషన్ సింగ్ సుర్జీత్
ప్రమోద్ దాస్‌గుప్తా
జ్యోతి బసు

28 మందితో కేంద్ర కమిటీని, తొమ్మిది మందితో పోలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ పి. సుందరయ్య ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు.

### 9వ మహాసభ — జూన్ 27 నుండి జులై 2 వరకు 1972 మధురై, తమిళనాడు

పశ్చిమ బెంగాల్, కేరళలో సీపీఐ(ఎం) నేతత్వంలోని ప్రభుత్వాలను రద్దు చేయడం, కాంగ్రెస్ పార్టీలో చీలిక, ఇందిరా గాంధీ ఎన్నికలలో భారీ విజయం, బంగ్లాదేశ్ విముక్తి వంటి ముఖ్యమైన పరిణామాలను తొమ్మిదవ పార్టీ మహాసభ గుర్తించింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రధానంగా సీపీఐ(ఎం)ను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న సెమీ-ఫాసిస్ట్ విచ్చిన్నాన్ని ఉగ్రవాదాన్ని, ఎన్నికలలో హింసాత్మక అణచివేత, రిగ్గింగ్‌లను, వేర్పాటువాద ఉద్యమాలు పెరుగుతున్న ధోరణిని మహాసభ గుర్తించింది. అధికార కేంద్రీకరణ ప్రజాస్వామ్యానికి ముప్పు అని మహాసభ హెచ్చరించింది. భారతదేశంలో జాతుల సమస్యకు ఒక పరిష్కారాన్ని సూచించింది. "విడిపోయే హక్కు" భారత పరిస్థితులకు వర్తించదని పేర్కొంది. ఆమేరకే తరువాతి కాలంలో అస్సాం, ఖలిస్థాన్ ఉద్యమాలపై సరైన పంథాను పార్టీ తీసుకోగలిగింది.

30 మందితో కేంద్ర కమిటీని, తొమ్మిది మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ పి. సుందరయ్య ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు.

**పొలిట్ బ్యూరో**

పి.సుందరయ్య
ఇఎంఎస్ నంబూద్రిపాద్
ఎ. కె. గోపాలన్
ఎం. బసవపున్నయ్య
పి. రామమూర్తి
బి. టి. రణదివే
హరికిషన్ సింగ్ సుర్జీత్
ప్రమోద్ దాస్‌గుప్తా
జ్యోతి బసు

### 10వ మహాసభ — 2-8 ఏప్రిల్ 1978 జలంధర్, పంజాబ్



ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి కారణంగా ఆరేండ్ల తర్వాత పార్టీ పదవ మహాసభ జరిగింది. 1971-1977 కాలంలో ప్రజాస్వామ్యంపై దాడి, హింసాత్మక అణచివేత చోటుచేసుకున్నాయి. ఈ ఎమర్జెన్సీ కాలంలో పశ్చిమ బెంగాల్,కేరళల్లో వందల మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఈ కాలంలో కాంగ్రెస్(ఐ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ పోరాటాలు నిరసనలు వెల్లివిరిసాయి. వాటిలో 1974 రైల్వే సమ్మె, జయప్రకాష్ నారాయణ నేతత్వంలోని ఉద్యమాలు కూడా సాగాయి. ఇందిరా గాంధీ నేతత్వంలోని కాంగ్రెస్ పార్టీ 1977లో ఓడిపోయింది. జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. 1978లో బెంగాల్, త్రిపురల్లో వామపక్ష నేతత్వంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా ధైర్యంగా సీపీఐ(ఎం) పోరాడినప్పటికీ, పాలక, ప్రతిపక్ష బూర్జువా-భూస్వామ్య పార్టీల మధ్య వైరుధ్యాలను లోతును అంచనా వేయడంలో విఫలం చెందిందని 10వ మహాసభ గుర్తించింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించే, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కోసం పోరాడే వామపక్ష, ప్రజాతంత్ర ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. వామపక్ష నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను రక్షించాలని కూడా పార్టీ మహాసభ పిలుపునిచ్చింది.

**పొలిట్ బ్యూరో**

ఇఎంఎస్ నంబూద్రిపాద్
బి. టి. రణదివే
పి.సుందరయ్య
ఎం. బసవపున్నయ్య
పి. రామమూర్తి
హరికిషన్ సింగ్ సుర్జీత్
జ్యోతి బసు
ప్రమోద్ దాస్‌గుప్తా
సమర్ ముఖర్జీ
ఎ.బాలసుబ్రహ్మణ్యన్
ఇ.బాలనందన్

40 మందితో కేంద్ర కమిటీ, 11 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

### 11వ మహాసభ — 26 - 31 జనవరి 1982 విజయవాడ , ఆంధ్రప్రదేశ్

1980లో జనతా పార్టీ ప్రభుత్వం కూలిపోయి ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత పదకొండవ మహాసభ జరిగింది. ఈ కాలంలోనే కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఏర్పడింది. ఐఎంఎఫ్ రుణాలతో విధించిన షరతుల కారణంగా దేశాన్ని ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. పాకిస్తాన్ నుండి చురుకైన మద్దతుతో అమెరికా తోడ్పాటుతో పాకిస్థాన్ మద్దతుదారులు పంజాబ్, కాశ్మీర్‌లలో వేర్పాటువాద ఉద్యమాలు వ్యాప్తి చెందాయి. పౌర స్వేచ్ఛలపై దాడులు, కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని కూల్చివేయడం, జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) ప్రకటించడం వంటివి నిరంకుశ పాలన యొక్క కొత్త దశను సూచిస్తాయని మహాసభ అభిప్రాయపడింది.

మతతత్వ శక్తుల పెరుగుదలపై కూడా 11వ మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను ఏకకాలంలో బలోపేతం చేస్తూ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా విస్తత ప్రతిఘటనను నిర్మించాలని 11వ మహాసభ పిలుపునిచ్చింది.

**పొలిట్ బ్యూరో**

ఇఎంఎస్.నంబూద్రిపాద్
బి.టి.రణదివే
ఎం.బసవపున్నయ్య
పి.రామమూర్తి
ప్రమోద్ దాస్‌గుప్తా
జ్యోతి బసు
హరికిషన్ సింగ్ సుర్జీత్
సమర్ ముఖర్జీ
ఇ.బాలనందన్

42 మందితో కేంద్ర కమిటిని, 9 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు.

### 12వ మహాసభ — 25 - 29 డిసెంబర్ 1985 కలకత్తా, పశ్చిమబెంగాల్



దేశంలోని పరిస్థితులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకున్న పరిణామాలను, వర్గ సంఘర్షణలను పార్టీ అంచనా వేసింది. దేశంలో మతతత్వ శక్తుల పెరుగుదలను, సమాజంలో అవి సష్టించే అలజడులను మహాసభ అంచనా వేసింది. ప్రజల్లో ద్వేషం, ఉద్రిక్తత వ్యాపించాయని, ఇస్లామిక్ ఛాందసవాదం కూడా పెరుగుతోందని మహాసభ గుర్తించింది. పంజాబ్, జమ్మూ కాశ్మీర్, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లోని గూర్ఖాలాండ్, ఈశాన్య ప్రాంతాలలో ఘర్షణలు చెలరేగాయి. వేర్పాటువాద, మిలిటెంట్ శక్తులను వ్యతిరేకిస్తూ పంజాబ్, అస్సాం, డార్జిలింగ్‌లలో నిర్వహించిన మిలిటెంట్ పోరాటలలో పార్టీ అనేక మంది నాయకులను, కార్యకర్తలను కోల్పోయింది. ఆపరేషన్ బ్లూస్టార్, ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హత్య, ఆపైన జరిగిన సిక్కుల ఊచకోత సంక్షోభం తీవ్రమైంది, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యం, జాతీయ ఐక్యత కోసం పోరాటాలు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉన్నాయని మహాసభ నొక్కి చెప్పింది.

**పొలిట్ బ్యూరో**

ఇఎంఎస్ నంబూద్రిపాద్
బి.టి. రణదివే
ఎం.బసవపున్నయ్య
హరికిషన్ సింగ్ సుర్జీత్
జ్యోతి బసు
సమర్ ముఖర్జీ
ఇ బాలానందన్
నృపేన్ చక్రవర్తి
సరోజ్ ముఖర్జీ
వి.ఎస్.అచ్యుతానందన్

కేరళలో, మతతత్వ శక్తులతో సంబం ధం లేకుండా పార్టీ పంథాకు అనుగుణంగా అఖిల భారత ముస్లిం లీగ్‌తో సంబంధాలను వదులుకోవాలని సీపీఐ(ఎం) నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ వర్గ విధానాలను బహిర్గతం చేయడం, ప్రజలను తమ పాలన ద్వారా అంటి పెట్టుకొని ఉండటం అనే రెండు గురుతరమైన బాధ్యతలను మహాసభ పశ్చిమ బెంగాల్, త్రిపురలోని వామపక్ష ప్రభుత్వాలపై ఉంచింది. పన్నెండవ మహాసభ వామపక్ష ఐక్యతను ప్రధానాంశంగా చేసుకుని నిరంకుశత్వాన్ని ఎదుర్కోవడానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలోపేతానికి కృషి చేయాలని నొక్కి చెప్పింది.

66 మందితో కేంద్ర కమిటీని, 10 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

### 13వ మహాసభ — డిసెంబర్ 27,1988 జనవరి 1,1989 త్రివేండ్రం , కేరళ

పదమూడవ పార్టీ మహాసభకు ముందు గోర్బచేవ్ నేతత్వంలోని సోవియట్ యూనియన్ పెరి స్ట్రోయికా, గ్లాస్‌నాస్ట్ నినాదాలిచ్చింది. మార్క్సిజం - లెనినిజం యొక్క మార్గదర్శక పాత్రను, సామాజిక పరివర్తనలో కమ్యూనిస్ట్ పార్టీ యొక్క నాయకత్వ పాత్రను తిరస్కరించినందున సీపీఐ(ఎం) ఈ సిద్ధాంతంతో విభేదించింది. దేశీయంగా, రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు డిమాండ్లు, విదేశీ మూలధ నానికి రాయి తీలకు లొంగి పోవడాన్ని వ్యతిరేకించ డంలో సీపీఐ(ఎం) ముందం జలో ఉంది. మత, వేర్పాటువాద, విభజన శక్తులకు వ్యతిరేకంగా కూడా పార్టీ ఒక భద్రతా వలయంగా ఉంది. కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో వామపక్ష ప్రభుత్వాలను రక్షించాలని, రాబోయే ఎన్నికలలో రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఓడించాలని పదమూడవ మహాసభ పిలుపునిచ్చింది. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలని కూడా పిలుపునిచ్చింది.

**పొలిట్ బ్యూరో**

ఇఎంఎస్ నంబూద్రిపాద్
బి.టి. రణదివే
ఎం. బసవపున్నయ్య
హరికిషన్ సింగ్ సుర్జీత్
జ్యోతి బసు
సమర్ ముఖర్జీ
ఇ బాలానందన్
నృపేన్ చక్రవర్తి
సరోజ్ ముఖర్జీ
వి.ఎస్. అచ్యుతానందన్
ఎ. నల్లశివన్
ఎల్.బి. గంగాధరరావు

66 మంది సభ్యుల కేంద్ర కమిటీని, 12 మంది సభ్యుల పొలిట్ బ్యూరో సభ్యులను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ను వరుసగా నాలుగోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. ఐదుగురు సభ్యులతో కార్యదర్శివర్గాన్ని కూడా కేంద్ర కమిటీ ఏర్పాటు చేసుకున్నది.

### 14వ మహాసభ — జనవరి 3-9, 1992 మద్రాస్, తమిళనాడు



యూఎస్ఎస్ఆర్, తూర్పు ఐరోపాలో సోషలిజం పతనానికి దారితీసింది. తియానాన్మెన్ స్క్వేర్ సంఘటన తర్వాత చైనాలో గందరగోళం కూడా ఏర్పడింది. సోవియట్ సహాయం ఉప సంహరణ,అమెరికా ఆర్థిక దిగ్బంధనం సోషలిస్ట్ క్యూబాకు ఇబ్బందులకు గురిచేసింది. సైద్ధాంతిక అంశాలపై మరింత అధ్యయనం చేయవలసిన అవసరాన్ని అంగీకరిస్తూనే, సీపీఐ(ఎం) సోషలిజానికి కట్టుబడి ఉందని మహాసభ గట్టిగా చెప్పింది. "కొన్ని సైద్ధాంతిక సమస్యలపై" అనే డాక్యుమెంట్ల రూపకల్పన జరిగింది.

నమీబియా స్వాతంత్ర్యం, దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్య శక్తుల పురోగతి, నేపాల్‌లో కమ్యూనిస్టుల ఎన్నికల విజయాలు వంటి ప్రపంచ పరిణామాలలో ప్రేరణ పొందింది. సోషలిస్ట్ దేశాలు, స్వాతంత్ర్యాన్ని కాపాడు కోవడానికి నిశ్చయించుకున్న మూడవ ప్రపంచ దేశాలు, ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల పోరాటాలతో సంఘీ భావాన్ని బలోపేతం చేయాలని 14వ మహాసభ నిర్ణయించింది.దేశీయంగా, 1989 పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్(ఐ) ఓటమి పాలైంది. వి.పి.సింగ్ ప్రభుత్వానికి పార్టీ బయటి నుండి మద్దతు ఇచ్చింది. మధ్యలోనే బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో ఆ ప్రభుత్వం పతనమైంది. తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ నరసింహారావు నేతత్వంలోని ఆర్థిక, రాజకీయ విధానాలు బీజేపీ గణనీయమైన లాభాలను పొందేందుకు దోహదపడ్డాయి.ప్రజా పోరాటాలను ఉధతం చేయాలని, పార్టీ నిర్మాణం యొక్క ప్రాధాన్యతను పునరుద్ధరిం చాలని, సైద్ధాంతిక విధానాలను అమలు చేయాలని, అందుకు తగినంత కషి చేయాలని మహసభ పిలుపునిచ్చింది. అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల్లో మార్పులను ప్రతిబింబించేలా "పార్టీ కార్యక్రమాన్ని తాజా పరచాలి" అనే తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

**పొలిట్ బ్యూరో**

హరికిషన్ సింగ్ సుర్జీత్
ఇఎంఎస్ నంబూద్రిపాద్
మాకినేని బసవపున్నయ్య
జ్యోతి బసు
ఇ బాలానందన్
నృపేన్ చక్రవర్తి
వి.ఎస్.అచ్యుతానందన్
ఎల్.బి. గంగాధరరావు
బినోయ్ కష్ణ చౌదరి
ఎ. నల్లశివన్
ప్రకాశ్ కారత్
సీతారాం ఏచూరి
ఎస్ రామచంద్రన్ పిళ్లై
సునీల్ మైత్ర
పి రామచంద్రన్
సైలేన్ దాస్‌గుప్తా
ఇకె నాయనార్

63 మందితో కేంద్ర కమిటీని, 17 మందితో పొలిట్ బ్యూరో మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జీత్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

### 15వ మహాసభ — ఏప్రిల్ 3-8, 1995 చండీఘడ్



యూఎస్ఎస్ఆర్, తూర్పు ఐరోపాలో సోషలిజం పతనం తరువాత ప్రపంచ పరిస్థితిపై పార్టీ విశ్లేషణ సరైందే అని 15వ మహాసభ గుర్తించింది. పెట్టుబడిదారీ విధానం, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రజలను పూర్తిగా విఫలం చేశాయి. అమెరికా ఆర్థిక దిగ్బంధంలో ఉన్న క్యూబాకు పార్టీ 12వేల టన్నుల ఆహార ధాన్యాలను,మందులను పంపింది. సోషలిస్ట్ దేశాలు, మూడవ ప్రపంచ దేశాల ప్రజలతో నిలబడవలసిన అవసరాన్ని ఈ మహాసభ నొక్కి చెప్పింది. దేశీయంగా మతతత్వం పెరుగుదల అతిపెద్ద సవాలుగా మారింది. బాబ్రీ మసీదు విధ్వంసం ఇందుకు నిదర్శనం. మతతత్వ శక్తులకు వ్యతరేకంగా సీపీఐ(ఎం) చాలా కాలంగా పోరాడుతోంది. ఇది దేశానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని హెచ్చరించింది. మతతత్వ శక్తుల పట్ల రాజీ వైఖరిని అవలంభిస్తున్న కాంగ్రెస్(ఐ) విధానాన్ని మహాసభ తీవ్రంగా విమర్శించింది. పి.వి.నరసింహారావు ప్రభుత్వ ఆర్థిక విధానాలను కూడా మహా సభ తిరస్కరించింది. కార్పొ రేట్ పన్ను పెంచి, భూ సంస్కరణలు అమలు చేసి, వ్యవసాయంపై ఎక్కువ ఖర్చు వంటి దశల ద్వారా సర్వతో ముఖాభివద్ధిని ప్రోత్సహించే టప్పుడు సార్వభౌమత్వాన్ని రక్షించే ప్రత్యామ్నాయాన్ని మహాసభ ప్రతిపాదించింది. ముఖ్యంగా మతతత్వ అంశం పై ప్రతిపక్ష పార్టీల అవకాశవాదాన్ని గమని స్తూనే మహాసభ బీజేపీ,కాంగ్రెస్(ఐ) లను ఓడించడానికి లౌకిక పార్టీలతో అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

**పొలిట్ బ్యూరో**

హరికిషన్ సింగ్ సుర్జీత్
ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్
జ్యోతి బసు
ఇ.బాలానందన్
బినోయ్ చౌదరి
వి.ఎస్. అచ్యుతానందన్
ఎ.నల్లశివన్
ఎల్.బి.గంగాధరరావు
ప్రకాష్ కారత్
సీతారాం ఏచూరి
ఎస్. రామచంద్రన్ పిళ్లై
సునీల్ మైత్రా
పి.రామచంద్రన్
సైలెన్ దాస్‌గుప్తా
ఇ.కె.నాయనార్
ఎం.హనుమంత రావు

71 మందితో కేంద్రకమిటీని, 16 మందితో పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జీత్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి మహాసభ ఎన్నుకుంది.

మిగతాది రేపటి సంచికలో....


Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటాం

**మతసామరస్యంపై సీరియస్‌గా ఉన్నాం ● వ్యతిరేక శక్తులను ప్రజలు స్వాగతించరు ● హజారీబాగ్ ఘటనపై జార్ఖండ్ మంత్రులు ● రాష్ట్ర అసెంబ్లీలో గందరగోళం**



**రాంచీ :** హజారీబాగ్ రాళ్లదాడి అంశంపై జార్ఖండ్ అసెంబ్లీలో గందరగోళం తలెత్తింది. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభలో తీవ్ర అలజడి సృష్టించారు. ఈ అంశంపై చర్చకు పట్టుబట్టారు. సభను జరగనివ్వకుండా గందరగోళం సృష్టించారు. అయితే, బీజేపీ సభ్యుల తీరుపై రాష్ట్ర మంత్రులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆ రాష్ట్ర మంత్రి రాధాకృష్ణ కిషోర్ అన్నారు. "ఈ సంఘటన వెనుక గల కారణాలను ప్రభుత్వం దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడుకోవటంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నది" అని మంత్రి చెప్పారు.

ఈ ఘటనపై ప్రతిపక్షాల తీరుపై రాష్ట్ర మంత్రి సుదివ్య కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ సంఘటనలకు మూలకారణం ఏమీ లేదు. హజారీబాగ్ ఒక 'ప్రయోగాత్మక ప్రదేశం'గా మారితే ప్రభుత్వం కచ్చితంగా దానిని గుర్తిస్తుంది. ఇలాంటి తిరుగుబాటు, వ్యతిరేక శక్తులను జార్ఖండ్ ప్రజలు ఎప్పుడూ స్వాగతించలేదని నేను స్పష్టంగా చెప్తున్నా. రాజకీయపార్టీలు ప్రజల ఆదేశాన్ని అర్థం చేసుకోవటంలో విఫలమైతే.. 2019, 2024, తర్వాత 2029లో దాని ప్రభావాన్ని చూస్తారు" అని అన్నారు.

**ఏం జరిగింది?**

జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో మతపరమైన ఊరేగింపు సందర్భంగా రాళ్లు రువ్విన ఘటనలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చెలరేగిందని పోలీసులు చెప్పారు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జామా మసీదు చౌక్ సమీపంలో రామ నవమి వేడుకల్లో భాగంగా మంగళ ఊరేగింపు జరుగుతుండగా ఈ ఘటన జరిగిందని హజారీబాగ్ పోలీసు అధికారి పరమేశ్వర్ కామ్ది తెలిపారు. ఇరువర్గాలూ నుంచి రాళ్లు రువ్వుకున్నాయని తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి గాల్లోకి కాల్పులు జరిపినట్టు మరొక అధికారి వివరించారు. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితి అదుపులో ఉన్నదనీ, ఘటనా స్థలంలో భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. "రాళ్లు రువ్వటానికి కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నాం. వారిని త్వరలో పట్టుకుంటాం" అని పోలీసులు చెప్పారు.

మతపరమైన పాటలను ప్లే చేసిన విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తిందని స్థానికులు చెప్పారు. ఆ తర్వాత పరిస్థితి రాళ్లదాడికి దారి తీసిందన్నారు. ఇరువైపుల నుంచి రాళ్లు రువ్వుకున్నారు. జిల్లా మేజిస్ట్రేటు ఆదేశాల మేరకు అక్కడ పోలీసులు మోహరించారు. 200 మంది గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.



## దక్షిణ కొరియాలో దావానలం

**24మంది మృతి, వెయ్యేళ్ళనాటి బౌద్ధ ఆలయం దగ్ధం**

**కాలిబూడిదైన వేలాది హెక్టార్ల అటవీ ప్రాంతం**

**సియోల్ :** దక్షిణ కొరియాలోని ఆగ్నేయ ప్రాంతంలో పలు చోట్ల కార్చిచ్చు చెలరేగింది. ఈ ఘటనల్లో ఇప్పటివరకు 24మంది మరణించగా, 20మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న మంటలను అదుపు చేసేందుకు వందలాది అగ్నిమాపక యంత్రాలు, వేలాదిమంది సిబ్బంది శ్రమిస్తున్నారు. గత వారాంతంలో 12చోట్లకు పైగా అడవులను అగ్ని కీలలు చుట్టుముట్టాయి. దీంతో యుద్ధ ప్రాతిపదికన 27వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరించారు. బుధవారం ఉదయానికి ఐదు చోట్ల మంటలు ఇంకా చెలరేగుతున్నాయి. మిగిలిన చోట్ల పరిస్థితి కాస్త శాంతించిందని అధికారులు తెలిపారు. వేలాది ఎకరాల్లో చెలరేగిన మంటల కారణంగా వెయ్యేళ్ళనాటి చారిత్రక బుద్ధుని ఆలయనం దగ్ధమైంది. 681లో నిర్మించబడిన ఈ ఆలయంలో జాతి సంపద అంతా నిక్షిప్తమై వుంది. వాటిని ముందుగానే ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మీడియా వార్తలు తెలిపాయి. యునెస్కో వారసత్వ జాబితాలో వున్న హహోయి గ్రామంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ఈ గ్రామానికి కేవలం 8కిలోమీటర్ల దూరంలోనే కార్చిచ్చు విస్తరిస్తోంది. మంటలు ఇతర కట్టడాలకు విస్తరించకుండే వుండేందుకు డజన్ల సంఖ్యలో నీటి ట్యాంకర్లు, అగ్నిమాపక యంత్రాలను మోహరించారు. 200కిపైగా ఇళ్లు, భవనాలు దెబ్బతిన్నాయి. మంటల నుండి తప్పించుకోవడానికి కారులో వెళుతుండగా, వాహనం బోల్తా పడడంతో నలుగురు రోడ్డుపై పడి మరణించారని కొరియా అధికార వార్తా సంస్థ బుధవారం తెలిపింది. ఇప్పటివరకు 17వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం తగలబడింది. గతంలోని అంచనాలను మించి ఈ విపత్తు చోటు చేసుకుందని దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూ వ్యాఖ్యానించారు. 5వేల మంది సైనికులు, 146 హెలికాప్టర్లను రంగంలోకి దించారు.



## శాంతిభద్రతలపై రాజీపడేది లేదు..

- ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను చేతల్లో చూపించాం
- పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా స్కూల్
- గతంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నా... బీఆర్ఎస్ సర్కారు జోక్యం
- ట్రాఫిక్ నియంత్రణ భేష్ : శాంతిభద్రతల పద్దుల చర్చలో మంత్రి శ్రీధర్‌బాబు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మాటల్లో కాదు... చేతల్లో చూపించామన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని స్పష్టం చేశారు. బుధవారం శాసనసభలో శాంతి భద్రతల పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లను బాధితులకు వాపస్ ఇప్పించారని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారని విమర్శించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నా...ప్రభుత్వ పెద్దల జోక్యం ఉండేదన్నారు. నేడు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. పోలీసుల పిల్లల కోసం రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యనందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని విమర్శించారు. మంథనిలో న్యాయవాదులను హత్య చేసిన ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలకు తెలుసనన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఇప్పుడు క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులను మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ అనేది యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామనీ, గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ బాగుందని చెప్పారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని మంత్రి వివరించారు.

**త్వరలో శాసనసభా కమిటీలను నియమిస్తాం**

శాసనసభ పరిధిలో ఉన్న అన్ని రకాల కమిటీలను త్వరలో నియమిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. పార్లమెంటు తరహాలో శాసనసభ, శాసనమండలి సమావేశాలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అందుకు పాత అసెంబ్లీ భవనానికి మరమ్మత్తులు చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఢిల్లీలోని పటౌడీహౌస్ మన రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందని వివరించారు. అక్కడ రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ భవన్' నిర్మిస్తామని వెల్లడించారు.


# ఢిల్లీ భగ..భగ

**38.9 డిగ్రీల ఉష్ణోగ్రత...అన్ని రికార్డులు బద్దలు ● ఈ సీజన్‌లో అత్యంత వేడి రోజు**

**న్యూఢిల్లీ :** ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రత దేశ రాజధాని ఢిల్లీలో నమోదైంది. సఫ్దర్‌జంగ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 38.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది ఇప్పటివరకు సీజన్‌లో అత్యంత వేడిగా నమోదైన రోజు బుధవారంగా వాతావరణశాఖ తెలిపింది. ఈ ఉష్ణోగ్రత నిన్నటి గరిష్ట ఉష్ణోగ్రత కంటే దాదాపు 2 డిగ్రీలు ఎక్కువ. మంగళవారం సఫ్దర్‌జంగ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 37.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత గా అధికారులు గుర్తించారు. సోమవారం ఉదయం ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 36 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది సాధారణం కంటే 4.5 డిగ్రీలు ఎక్కువ. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం.. కనిష్ట ఉష్ణోగ్రత 15.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, తేమ స్థాయి 81 శాతం.. 17 శాతం మధ్య ఉంది. బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. ఆగ్రాలో 35 డిగ్రీల సెల్సియస్, పాట్నాలో 30, లక్నోలో 35, జైపూర్‌లో 33, ఇండోర్‌లో 33, రాంచీలో 26, రాయ్‌పూర్‌లో 35, ముంబైలో 28, అహ్మదాబాద్‌లో 32, జమ్మూలో 31, శ్రీనగర్‌లో 17 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

**వడగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

రాబోయే రోజుల్లో వేడి గాలులు వీచే అవకాశం ఉన్నదని ఐఎండీ పేర్కొంది. వేడిగాలుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వాతావరణ కేంద్రంలో గరిష్ట ఉష్ణోగ్రత మైదానాల్లో కనీసం 40 డిగ్రీల సెల్సియస్, తీరప్రాంతాల్లో 37 డిగ్రీల సెల్సియస్ . కాగా కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని, సాధారణం కంటే కనీసం 4.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నప్పుడు వేడి తరంగ పరిమితిని చేరుకుంటాయని చెబుతారు. వేసవికాలంలో, మైదానాలలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువకు చేరుకున్నప్పుడు, గాలి చాలా వేడిగా మారుతుంది, దీని కారణంగా వడదెబ్బ ప్రమాదం ఉంటుంది.



# మహిళలే బ్యాంకు పెట్టుకోవడం గొప్ప విషయం

- స్త్రీనిధికి హిమాయత్ నగర్ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం అప్పగింత
- త్వరలో అవసరమైన సిబ్బందిని నియమిస్తాం : రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క)
- ఇందిరా మహిళా శక్తి భవనాలకు రూ.22 కోట్లు ఇచ్చిన స్త్రీనిధి బోర్డు



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మహిళలే స్త్రీనిధి పేరిట బ్యాంకు ఏర్పాటు చేసుకుని రుణాలిచ్చుకోవడం, 800 కోట్ల సేవింగ్స్, రూ.5,200 మూలనిధి ఉండటం గొప్ప విషయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. స్త్రీ నిధి బ్యాంక్ పై సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ రవీందర్ రావు రూపొందించిన పాటను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. తన షేర్ క్యాపిటల్ మీద 14 శాతం ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు చెక్కుల రూపంలో స్త్రీనిధి బోర్డు సభ్యులు అందజేశారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం తన వంతు బాధ్యతగా రూ.22 కోట్లను స్త్రీనిధి బోర్డు అందజేసింది. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, స్త్రీనిధి అధ్యక్షులు జి.ఇందిర, కోశాధికారి పల్లేటి సరస్వతి, మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి, వరంగల్, కొమరంభీం జిల్లా అడిషనల్ కలెక్టర్లు, 17 మంది స్త్రీనిధి డైరెక్టర్లు, 650 కు పైగా మండల మరియు పట్టణ సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్న స్త్రీ నిధి సిబ్బందికి, బోర్డు సభ్యులకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు అభినందనలు తెలిపారు. వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి మహిళలను కాపాడేందుకు 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీ నిధి సహకార సంస్థను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఆశ, ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం ఉంది కాబట్టే మహిళా సంఘాలు పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగాయని ప్రశంసించారు. స్త్రీనిధి సంస్థ ఏగ్రేడ్ సాధించిందనీ, మహిళలు గొప్ప ఆర్థికవేత్తలు అనటానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వానికి రుణాలిచ్చే స్థాయికి ఎదగటం అద్భుతమని కొనియాడారు. కోటిమంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారనీ, అందులో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పాత్ర కీలకమైందని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం స్థాయి నుంచి మహిళా సంఘాలే ఇప్పుడు బస్సులకు ఓనర్లను చేశామనీ, అదాని అంబానీ వంటి కుబేరులు నిర్వహించే సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని తెలిపారు. త్వరలో మండల కేంద్రాల్లోని గోదాములతో పాటు రైసుమిల్లులను ఏర్పాటు చేయిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రూ.23 వేల కోట్ల బ్యాంకు రుణాలను ఇప్పించామని గుర్తుచేశారు. మహిళా సంఘాల సభ్యుల నైపుణ్యాన్ని పెంపుదల కోసం అత్యున్నత సంస్థలతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు కోసం ఇక్రిసాట్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నామనీ, స్థానికంగా లభ్యమయ్యే వనరుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరికైనా ఆపద వస్తే మేమున్నామంటూ మహిళా సంఘాలు ఆదుకోవాలనీ, ఆర్థిక భరోసానే కాదు సామాజిక రక్షణగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం పెంచేందుకు కోట్లు వెచ్చించి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజారు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. మహిళలు సీఈఓలు, మేనేజర్లుగా ఉన్న కంపెనీలు లాభాల్లో దూసుకుపోతున్నాయని ఉదహరించారు. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో ముందడుగు వేస్తే విజయం సొంతమనీ, దానికి స్త్రీనిధి బ్యాంకే ప్రత్యక్ష ఉదహరణ అని చెప్పారు. స్త్రీనిధికి అవసరమైన సిబ్బందిని నియమిస్తామని హామీనిచ్చారు. హిమాయత్ నగర్‌లోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయాన్ని స్త్రీనిధి అవసరాలకు అప్పగిస్తున్నామని ప్రకటించారు. సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంఘాల్లో చేరని మహిళలను సంఘంలో చేర్పించాలని సూచించారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

### అమెరికా ఎన్నికల ప్రక్రియలో

## కీలకమైన సంస్కరణలు

**ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్**

**భారత్‌లో ఓటరు గుర్తింపు వ్యవస్థను ఉదహరించిన అధ్యక్షుడు**



**వాషింగ్టన్ :** అమెరికా ఎన్నికల ప్రక్రియలో కీలకమైన సంస్కరణలు తీసుకువస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ సంస్కరణల్లో ప్రధానమైనది, ఇకపై అమెరికా ఎన్నికల్లో ఓటు వేయాలంటే పౌరసత్వం నిర్ధారణ పత్రాన్ని తప్పనిసరిగా అందచేయాల్సి వుంటుంది. ఈ సందర్భంగా భారతదేశంలో ఓటర్లను గుర్తించేందుకు అనుసరిస్తున్న గుర్తింపు వ్యవస్థను ట్రంప్ తన ఉత్తర్వులో ఉదహరించారు. అమెరికాలో నిజాయితీగా ఎన్నికలు జరగాలంటే ఇటువంటి చర్యలు తప్పనిసరని వ్యాఖ్యానించారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలు లేకుండా, అనుమానాస్పదం కాకుండా ఓటింగ్ జరగడం ముఖ్యమన్నారు. ఎన్నికల రక్షణలకు సంబంధించి మౌలికమైన, అవసరమైన చర్యలు, నిబంధనలను అమలు చేయడంలో ఇతర దేశాల కన్నా అమెరికా వెనుకబడి పోయిందని విమర్శించారు. భారత్; బ్రెజిల్‌ల్లోని ఓటింగ్ పద్ధతులను ఈ సందర్భంగా ఆయన పోల్చి చూపుతూ మాట్లాడారు. ఈ రెండు దేశాల్లో ఓటరు గుర్తింపు బయో మెట్రిక్ డేటా బేస్‌తో అనుసంధానించి వుంటుందన్నారు. కానీ అమెరికా మాత్రం పౌరసత్వం స్వీయ గుర్తింపుపైనే ప్రధానంగా ఆధారపడిందని ట్రంప్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. జర్మనీ, కెనడా వంటి దేశాలు కాగితపు బ్యాలట్ వ్యవస్థలు అనుసరిస్తుండగా, డెన్మార్క్, స్వీడన్‌లు మెయిల్ ఇన్ ఓటింగ్‌కు పరిమితమయ్యాయన్నారు. ట్రంప్ దీర్ఘకాలంగా అమెరికా ఎన్నికల వ్యవస్థను ప్రశ్నిస్తూనే వస్తున్నారు. ప్రధానంగా 2020 ఎన్నికల్లో ఓటమిని చవిచూసినపుడు ఎన్నికలు మోసపూరితంగా జరిగాయంటూ తీవ్ర గందరగోళం సృష్టించారు. మన ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం వుందని ట్రంప్ నొక్కి చెప్పారు.

## అమెజాన్ గిడ్డంగుల్లో గుర్తింపులేని ఉత్పత్తులు

**హైదరాబాద్‌లో 2783 ఉత్పత్తుల సీజ్**

**సీజ్ చేసిన బీఐఎస్**




**నవ తెలంగాణ - హైదరాబాద్**

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ గిడ్డంగుల్లో గుర్తింపులేని ఉత్పత్తులు బయటపడ్డాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారుల దాడుల్లో బీఐఎస్ ధ్రువీకరించిన ఐఎస్ఐ మార్కు, రిజిస్ట్రేషన్ మార్కు లేని ఉత్పత్తులను నిల్వ చేశారన్న సమాచారంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు అమెజాన్ గోదాములపై దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున అనుమతులు లేని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను సీజు చేశారు. బీఐఎస్ హైదరాబాద్ హెడ్ పివి శ్రీకాంత్ ఆదేశాలతో ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, ఎస్‌పీఓ అభిసాయి ఇట్ట, శివాజీ బృందం మంగళవారం తనిఖీలు చేసింది. శంషాబాద్‌లోని అమెజాన్ గోదాంలోని తనిఖీల్లో భాగంగా దాదాపు రూ.50 లక్షల పైగా విలువైన 2783 ఉత్పత్తులకు బీఐఎస్ ధ్రువీకరణ లేదని గుర్తించినట్టు తెలిపారు. వీటిని జప్తు చేశారు. వీటిలో 150 స్మార్ట్‌వాచ్‌లు, 15 ఎలక్ట్రిక్ వాటర్ హీటర్లు, 30 సీసీటీవీ కెమెరాలు, 16 మిక్సర్లు, 10 ప్రెజర్ కుక్కర్లు, 326 వైర్‌లెస్ ఇయర్ బడ్స్, 170 మొబైల్ ఛార్జర్లు తదితర ఉత్పత్తులున్నాయని బీఐఎస్ అధికారులు వెల్లడించారు.

**170 పట్టణాలకు అమెజాన్ ఫ్రెష్ సేవలు**

దేశంలోని 170కి పైగా పట్టణాలకు అమెజాన్ ఫ్రెష్ సేవలను విస్తరించినట్టు అమెజాన్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో చిత్తూరు, విజయవాడ సహా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, నగరాలున్నాయని వెల్లడించింది. 11,000 కంటే ఎక్కువ మంది రైతుల నుంచి ఉత్పత్తులను సేకరిస్తున్నట్టు పేర్కొంది. 2024 ద్వితీయార్థంలో ఈ విభాగంలో 50 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు పేర్కొంది

**బిజినెస్**

## ఏడు రోజుల లాభాలకు తెర

**ముంబయి :** వరుసగా ఏడు రోజులు సాగిన లాభాల పరంపరకు బుధవారం బ్రేక్ పడింది. ఏప్రిల్ నుంచి భారత్‌పై టారిఫ్‌ల విషయంలో అమెరికా ఎలాంటి నిర్ణయం తీసుకుంటోందనే ఆందోళనతో మదుపర్లు ఆచితూచీ వ్యవహరించారు. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 729 పాయింట్ల నష్టంతో 77,288కు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 182 పాయింట్లు కోల్పోయి 23,486.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్‌టిపిసి, జొమాటో, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభపడ్డాయి.

**తగ్గిన ఈక్విటీ ఎంఎఫ్‌ల ఎయుఎం : పిఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్**

ఈ ఏడాది ఫిబ్రవరిలో 159 ఫండ్స్ మెరుగైన పనితీరును కనబర్చాయని పిఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ విశ్లేషించింది. అయితే.. 2025లో జనవరిలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.24,85,843 కోట్లుగా ఉండగా.. ఫిబ్రవరిలో 6.97 శాతం తగ్గి రూ.23,12,570 కోట్లకు తగ్గిందని వెల్లడించింది. కాగా.. స్మాల్ క్యాప్ ఫండ్స్ అత్యుత్తమ పనితీరును కనబర్చాయని.. 79.31 శాతం స్కీములు తమ బెంచ్‌మార్క్‌ను అధిగమించాయని విశ్లేషించింది.

## అకాయ్ నుంచి అడ్వాన్స్ టెక్నాలజీ ఎసిలు

**ముంబయి :** గృహోపకరణాల తయారీ సంస్థ అకాయ్ అకాయ్ ఇండియా కొత్తగా అడ్వాన్స్ కూలింగ్ టెక్నాలజీతో కొత్త ఎసిలను విడుదల చేసినట్లు తెలిపింది. అకాయ్ సియాచిన్ (హెవీ డ్యూటీ), అకాయ్ నీలగిరి (ఎకానమీ), అకాయ్ కాశ్మీర్ (హాట్ అండ్ కోల్డ్) పేరుతో మూడు కొత్త సిరీస్‌లను అందిస్తోన్నట్లు అకాయ్ ఇండియా సీఈఓ, ఎండీ అనురాగ్ శర్మ తెలిపారు. జపనీస్ కచ్చితత్వం, విశ్వసనీయతలతో కూడిన అకాయ్ వారసత్వంపై రూపొందిన ఈ ఎసిలు అద్భుతమైన శీతలీకరణ పనితీరును కనబర్చనున్నాయన్నారు. వీటి ధరలు రూ.30,990 నుంచి ప్రారంభమవుతాయన్నారు.



## ల్యాండ్ రోవర్ డిఫెండర్ అక్టా విడుదల

**న్యూఢిల్లీ :** ల్యాండ్ రోవర్ తన కొత్త హార్డ్‌కోర్ డిఫెండర్ అక్టాను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.2.59 కోట్లుగా నిర్ణయించింది. గతేడాది జులై నుంచే దీని కోసం బుకింగ్స్‌ను తెరువగా.. ప్రస్తుతం అమ్మకాలు, డెలివరీలను ప్రారంభించినట్లు జెఎల్ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబా తెలిపారు. ఇందులో 4.4 లీటర్ ట్విన్ టర్బో మిల్డ్ హైబ్రిడ్ వి8 ఇంజిన్‌ను ఉపయోగించింది. కేవలం 4.4 సెకన్లలోనే 0-100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదు.

## ఫోన్‌పేలో కొత్త వాహనాలకు బీమా

**న్యూఢిల్లీ :** కొత్త వాహనాలకు బీమాను అందిస్తున్నట్లు ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్ పే తెలిపింది. కొత్తగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల కొనుగోలు చేస్తున్న వాహనదారుల కోసం ఇన్సూరెన్స్ ఆఫర్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. సరసమైన ధరకే, ఆన్‌లైన్‌లోనే ఇన్సూరెన్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. డీలర్‌షిప్ ధరలతో పోలిస్తే టూ-వీలర్ ఇన్సూరెన్స్‌పై రూ.4,000 వరకు, ఫోర్ వీలర్ ఇన్సూరెన్స్‌పై రూ.40,000 వరకు ఆదా చేయవచ్చని ఫోన్‌పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సిఇఒ విశాల్ గుప్తా తెలిపారు.

### రూ.7,410 కోట్లతో

## మారుతి సుజుకి కొత్త ప్లాంట్

**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ మారుతి సుజుకి భారత్‌లో తన మూడో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏడాదికి 2.50 లక్షల యూనిట్ల సామర్థ్యంతో హర్యానాలోని ఖర్ఖోడాలో దీన్ని అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం రూ.7,410 కోట్ల పెట్టుబడులను ఆ కంపెనీ బోర్డు ఆమోదించింది. ఇదే విషయాన్ని బుధవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మూడవ ప్లాంట్ నిర్మాణం చేయనున్నామని పేర్కొంది. 2024లో ఈ కంపెనీ 20 లక్షల పైగా వాహనాలను తయారు చేసి నూతన మైలురాయిని దాటింది. ఇందులో దాదాపు 60 శాతం హర్యానాలోని ప్లాంట్లలో తయారయితే, మిగిలిన 40 శాతం గుజరాత్ ప్లాంట్ నుంచి వచ్చాయని కంపెనీ తెలిపింది.

## అమెరికా టారిఫ్‌లతో భారత ఫార్మాకు ముప్పు

**బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథి రెడ్డి**

న్యూఢిల్లీ : భారత ఫార్మా రంగంపై అమెరికా విధించనున్న సుంకాలపై బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదిత సుంకాలు అమల్లోకి వస్తే భారత ఫార్మా పరిశ్రమకు తీవ్రమైన ఆర్థిక నష్టాలను కలిగించవచ్చని ఆయన రాజ్యసభలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సుంకాల వల్ల 30 లక్షల పైగా భారత ఉద్యోగుల భద్రతకు ముప్పు వాటిల్లవచ్చన్నారు. 2023-24లో అమెరికాకు సుమారు రూ.74వేల కోట్ల విలువ చేసే ఔషధ ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసిందన్నారు. ఈ ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతున్నాయని ఇలాంటి సమయంలో పన్నుల పెంపు ఆందోళన కలిగిస్తోందన్నారు. భారత ఔషధ ఎగుమతుల్లో దాదాపుగా అమెరికా వాటా 31శాతంగా ఉందని పార్థసారథి రెడ్డి గుర్తు చేశారు. ప్రపంచ ఫార్మసీగా పేరొందిన భారత ఔషధ పరిశ్రమ అమెరికా టారిఫ్ పెంపుతో తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. భారత్‌కు విదేశీ మారక ద్రవ్య ఆదాయం తగ్గిపోవచ్చన్నారు.